1993 నుంచి 2013 వరకు వెలువడిన నడుస్తున్న చరిత్ర కు నేటి రూపం

సంపుటి : 9
సంచిక : 10,11
పుటలు : 52
రు. 25లు
ISSN NO:
2582-8738
యు.జి.సి. గుర్తింపు పొందినది

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

డిసెంబరు 2023/జనవరి 2024



## నవభారత గణతంత్రదినోత్సవం, జనవరి 26

## తెలుగుజాతి అస్థిత్వ రక్షణకై ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలి


అందాల కాశ్మీర్ ఉజ్వల భవిష్యత్తుకు హామీ
జమ్ము కాశ్మీర్ వనితాలోకం

- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు *9848016136*

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి





డిసెంబరు 2023
జనవరి 2024


### రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. రచనలను వ్యాసం, కథ, వచన కవిత, పాట – ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు, కథలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో పంపాలి. అనుఫాంట్‌లో టైప్ చేసినట్లయితే పి.యండి. మరియు పిడిఎఫ్‌లో కూడా పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి పంపాలి. *editorammanudi@gmail. com* కు మాత్రమే పంపాలి. కొరియర్‌లో గాని, రిజిష్టర్డ్‌పోస్టులో గాని పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

**4. <u>హామీపత్రం తప్పనిసరి:</u> రచన సొంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. హామీ పత్రంలేని రచనలను, ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.**

**5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని వెంటనే పరిశీలించడం వీలుకాదు. వ్యాసాలను ప్రచురించడానికి కనీసం 1-2 నెలల వ్యవధి పట్టవచ్చు.**

### లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| **సంపాదహృదయం** | తెలుగు జాతి అస్థిత్వ.. | | **............6,7** |
| **తె.భా.స విన్నపం** | .......................... | **తెలుగు భాషోద్యమ సమాఖ్య** | **08** |
| **ఇవి సంగతులు** | .......................... | **రహ్మానుద్దీన్ షేక్** | **10** |
| **మూడు బహిరంగ లేఖలు** | .................... | **గుంటుపల్లి శ్రీనివాస్** | **12** |
| **అంతర్జాతీయ సదస్సు** | తెలుగు శాస్త్రజ్ఞులు... | **....................** | **18** |
| **పరిశోధనా పత్రం** | అత్తా కోడళ్ళ గేయాలు | **బి. మాధవీలత,జి.నరసింహన్** | **20** |
| **పరిశోధనా పత్రం** | కురవంజి కళారూపం ,...... | **ఉప్పోరి హిమబిందు** | **23** |
| **ధారావాహిక** | నా ఆత్మకూరు కాజ యాత్ర.... | **ఈమని శివనాగిరెడ్డి** | **25** |
| **పరిశోధనా పత్రం** | మన కాలపు విమర్శకులు | **సుంకర గోపాలయ్య** | **28** |
| **పరిశోధనా పత్రం** | తెలుగు-కన్నడ జానపద గేయాలు.... | **డి.కె.ప్రభాకర్.** | **33** |
| **పరిశోధనా పత్రం** | సాహిత్య అనువాదాలలో..... | **లక్ష్మి హరిబండి** | **37** |
| **భాషల పరిరక్షణ** | తెలుగు నుడి పెన్నిధి | **రహ్మానుద్దీన్ షేక్** | **40** |
| **చరిత్ర పుటల నుండి** | ప్రాంతీయ భావం.... | **ఆవుల సాంబశివరావు** | **44** |
| **వారసత్వ సంపద** | శంకరన్ తరం తరువాత....... | **పి.శివరామకృష్ణ** | **46** |
| **స్మృత్యంజలి** | గిడుగు వారసురాలు | **బద్రి కుర్మారావు** | **47** |
| **వెలిసిపోతున్న పదాలు** | చలం. | **జి.వి.పూర్ణచందు** | **48** |
| **కవితలు...** | జీవన్మృతులు | **సి.భవానీదేవీ** | **27** |
| | నేను అనుకున్నాను | **లక్ష్మీ శ్రీనివాస్** | **39** |
| | మనిషి-మనసు | **శైలజా మిత్ర** | **43** |



| ముఖచిత్రం, | కార్టూన్లు | కంప్యూటర్ |
|---|---|---|
| తమ్మా శ్రీనివాసరెడ్డి | సరసి, శేఖర్ | యన్.రాజారావు |


ammanudi.org వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదువగలరు

**రచనలను, వార్తలను, వాట్సాప్ పంపవద్దు: 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్స్‌యాప్(WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా editorammanudi@gmail.com కు పంపించండి. – సంపాదకుడు**


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు మాసపత్రిక

చందా వివరాలు: జీవిత చందా: రూ.5000

4 సంll: రూ.1000, 1 సంll :రూ.300

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

## బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

Telugu Jaathi

+91 94929 80244

9492980244@okbizaxis

ఈ **QR**కోడ్‌ను స్కాన్ చేసి లేదా **QR**కోడ్ క్రింద ఇచ్చిన యుపిఐ ఐడి నెంబరుకు మీరు విరాళాలు, చందాలు పంపవచ్చును.

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమపూర్తి చిరునామాను, ఫోన్‌నెంబరు, మెయిల్‌ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు.

**94404 48244** లేదా **94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

**డాll సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94404 48244, 94929 80244,
ఇ-మెయిల్ : ammanudi@gmail.com

## చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

### గమనిక

పత్రికకు చందాదారులుగా చేరినవారి రచనలను తప్పనిసరిగా ప్రచురిస్తామనే హామీ ఏమీలేదు. ఏ రచనలను ప్రచురించాలో ఎంపిక చేసే బాధ్యత కేవలం పత్రిక సంపాదకుడిదే. దయచేసి ఎవ్వరూ వత్తిడి తేవద్దు. -ప్రచురణకర్త

## ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

**తెలుగుజాతి(ట్రస్టు) ప్రచురణ**

# అమ్మనుడి (మాసపత్రిక)

## రచయితలకు సూచనలు

**ఈ కింద సూచించిన లక్షణాలు కలిగిన వ్యాసాలు మాత్రమే అమ్మనుడిలో ప్రచురణ పొందుతాయి:**

1. **అమ్మనుడి** ప్రాథమికంగా భాషోద్యమ పత్రిక. భాషావిషయాలకు ప్రాముఖ్యతను కల్పిస్తాం. ప్రత్యేకంగా ప్రజలభాషల హక్కులను కాపాడేటటువంటి వ్యాసాలకు అధిక ప్రాధాన్యతను ఇస్తాం.
2. ఆధునిక వైజ్ఞానిక, సాంకేతిక, సామాజిక, ఆర్థిక రంగాలలోని ఆవిష్కరణల గురించి తెలుగులో స్వతంత్ర రచనలకు ఆహ్వానం.
3. వీటితోపాటు తెలుగుజాతి చరిత్ర, సంస్కృతి, అంతరించిపోతున్న తెలుగు కళలూ, జానపద సాహిత్యం మొదలైనవాటికి ప్రాధాన్యం.
4. తెలుగు ప్రజల సామాజిక జీవన విధానంలో, కుటుంబ జీవనంలో భాష, తెలుగూ తదితర అమ్మనుడులకు సంబంధించిన విషయాల ఆధారంగా రాసిన రచనలను పంపవచ్చు.
5. వ్యాసాలు ప్రాథమికంగా పరిశోధనాత్మకంగా, ఆధునిక భాష అవసరాలను తీర్చేవిగాఉండాలి.
6. వ్యాసంలో పేర్కొన్న విషయంలో కొత్తదనం ఉండాలి.
7. ఆ చెప్పే విషయం ఎక్కువమందికి అవసరమైనదిగా, ప్రయోజనకరంగా ఉండాలి.
8. వ్యక్తి ప్రాధాన్యత కంటే విషయ ప్రాధాన్యత గలిగిన వ్యాసాలకే ప్రాధాన్యం.

**పరిశోధనా వ్యాసాలు ఈ కింద పేర్కొన్న సూచనలను విధిగా పాటించాలి.**

1. ప్రచురణ కోసం పంపే పరిశోధనా వ్యాసాలు ఐదుపుటలకు గానీ 3000 పదాలకుగానీ మించకుండా యూనీకోడులో ఉండాలి.
2. వ్యాసాలు ఆధునిక తెలుగులో ఉండాలి. మాండలికతపై ఎలాంటి నిర్బంధమూ లేదు.
3. బాగా వాడుకలో ఉన్న సమాసాలు తప్ప మిగిలిన చోట్ల పదాలను సంధి చేయకుండా వీలైనంతమేరకు విడిగా రాయండి.
4. వ్యాసంలో మొదటిసారిగా ప్రస్తావించిన ప్రత్యేక విషయాలకు రచయిత లేక గ్రంథకర్త పేర్లను సంక్షిప్తరూపంలో కుండలీకరణాలలో సూచించండి.
5. వ్యాస రచనలో తోడ్పడిన రచనల సూచిని చేర్చండి.
6 అచ్చు తప్పులతో ఉన్న వ్యాసాలను తిప్పి పంపవలసి వస్తుంది.
7. మీ వ్యాసం మీ సొంత సృజన అనీ ఇంతకుమునుపు వేరెక్కడా అచ్చుకాలేదనీ హామీ పత్రాన్ని జతపరచండి.
8. మీ రచనలతోపాటు, పేరు, ఉపాధి, చిరునామా, ఈమెయిలుఐడి, చరవాణి అంకెలు తెలియజేయండి.
9. వీటిని గురించిన ఉత్తర ప్రత్యుత్తరాలు అన్నీ తెలుగులో జరపండి.
10. వ్యాసాలు పైన పేర్కొన్నవాటికి అనుగుణంగా లేనప్పుడు ప్రచురణకు వీలుపడదు.
11. మీ వ్యాసాలనూ వాటికి సంబంధించిన ఫొటోలనూ, బొమ్మలనూ, ఇతరాలను editorammanudi@gmail.com_కే పంపాలి. వాట్సప్‌లో పంపినవి తీసుకొనజాలము.

**సంపాదకుడు-అమ్మనుడి**

సంపుటి : 9 సంచిక : 10,11
**అమ్మనుడి**
డిసెంబరు 2023, జనవరి 2024

సంపాదక హృదయం

# తెలుగుజాతి ఆస్తిత్వ రక్షణకై ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలి

కేంద్ర ప్రభుత్వానికి చెందిన అన్ని శాస్త్ర సాంకేతిక విభాగాల్లో హిందీ భాష వాడుక పెరిగిందని సంబంధిత కేంద్ర మంత్రి డా. జితేంద్రసింగ్ ప్రకటించారు. ఆంగ్లం స్థానంలో అనేక కేంద్ర ప్రభుత్వ సంస్థలలో హిందీ వాడకం పెరగడానికి ప్రధాన మంత్రి మోదీగారి చొరవ కారణమని ఆయన ప్రత్యేకించి చెప్పారు. ప్రధానంగా ఆంగ్లంలో వున్న పారిభాషికపదాలను హిందీలోకి అనువదించి నిఘంటువులను తయారుచేసి వాటిని అందరికీ అందుబాటులోకి తేవడమే హిందీ భాష వాడుక బాగా పెరగడానికి ముఖ్య కారణమని ఆయన వివరించారు.

ఇది చాలా సంతోషించవలసిన విషయం. ఎందుకంటే – రాజ్యాంగం గుర్తించిన 22 దేశీయభాషలూ జాతీయ భాషలే. ప్రత్యేకంగా హిందీ మాత్రమే జాతీయ భాష అని రాజ్యాంగంలో ఎక్కడా పేర్కొనలేదు. కనుక అన్నీ భారత జాతీయభాషలే. భారత పౌరులు కేంద్ర వ్యవస్థల పాలకులతో, అధికార వ్యవహారాల్లో తమ మాతృభాషలలోనే అన్ని వ్యవహారాలూ జరుపుకోవచ్చు. అయితే, కేంద్ర ప్రభుత్వ అధికార భాషగా హిందీని క్రమంగా అభివృద్ధి పరచుకొంటూ 15 ఏళ్ళు గడిచేసరికి ఆంగ్లాన్ని పాలనా వ్యవహారాలనుంచి బయటకు నెట్టివేయాలని రాజ్యాంగం చెప్పింది. స్వతంత్ర దేశంగా భారతదేశం తన భాషలోనే అన్ని వ్యవహారాలు నడుపుకొనేందుకు ఇది రాజ్యాంగం చేసిన నిర్ణయం. అయితే మన దేశం అమృతోత్సవాలు జరుపుకొని, ముందడుగు వేస్తున్నా ఆ పదిహేనేళ్ళ గడువు ఇప్పటికీ గడిచిపోలేదు. ఎప్పటికప్పుడు ఆ గడువు పొడిగింపబడుతూనే ఉంది. ఈలోపు ఆంగ్లం అన్ని రంగాల్లో పునాదులు వేసుకొని, దానిని కదిలించడానికే వీలులేని విధంగా దేశంలో స్థిరపడిపోయింది. మొత్తం పరిపాలనను హిందీలోకి తేవడానికి మరొక పక్క ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి.

శాస్త్ర సాంకేతిక రంగాలలో ఆంగ్లాధిపత్యాన్ని గుర్తించి, పలు భాషా రాష్ట్రాలు తమ రాష్ట్రాల అధికార భాషలను సమకాలీన అవసరాలకు తగ్గట్లుగా నవీకరించుకునే కృషి చేస్తూనే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వంలో రాజకీయాధికారం హిందీ భాషీయుల చేతిలో ఉండడం వల్ల సహజంగానే వారిలో ఈ విషయమై బలమైన రాజకీయ సంకల్పం ఉంది. కాంగ్రెస్ పార్టీ, భారతీయ జనతాపార్టీ వంటి జాతీయ పార్టీలు, హిందీ ప్రాంతాలకు చెందిన పలు ప్రాంతీయ పార్టీలూ అన్నీ హిందీ ఆధిపత్యవాదంలో పరస్పరం పోటీ పడుతుంటాయన్న సంగతి తెలిసిందే.

'దేవనాగరి లిపిలో ఉన్న హిందీయే కేంద్ర ప్రభుత్వ అధికార భాష' అని స్పష్టంగా రాజ్యాంగం పేర్కొన్నది. షెడ్యూల్ 8 లోని భాషలన్నీ జాతీయ భాషలే అని ప్రధాన మంత్రి స్థాయిలోని వారు పదే పదే వక్కాణిస్తున్నారు. వారి చర్యలు మాత్రం హిందీయే జాతీయభాష అనిపించేంత బలంగా ఉంటున్నాయి. కాని, భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాత పాలనాపరంగానూ, రాజకీయంగానూ, వారి చర్యలు 'హిందీ'ని జాతీయభాషగా ఏదో ఒకనాటికి గుర్తించక తప్పదా అనే పరిస్థితులకు దారితీస్తున్నాయి. అందువల్ల ఆంగ్లానికి వచ్చే ఇబ్బంది ఏమీ ఉండదు. పైగా ఇప్పుడు దేశంలోని అన్ని భాషలలోకి –హిందీలోకి కూడా– విడదీయడానికి వీలులేనంతగా ఆంగ్లపదాలు చొచ్చుకుపోయాయి. రాజ్యాంగమే సూచించిన విధంగా సంస్కృత పదాలనూ గ్రహిస్తూ అధికార భాషగా హిందీని బలిష్ఠం చేసుకోవాలనే రాజ్యాంగ సూచనలతో పాటు అనధికారికంగా ఆంగ్లం కూడా హిందీలోకి సర్దుకుంటోంది. ఇదంతా హిందీ అధికారభాషగా నిలబడటానికి ఎంతో దోహదం చేస్తున్నాయి.

ఇదే సమయంలో–కొత్త జాతీయ విద్యావిధానం ప్రకారంగా గాని, ఇతర ఉత్తర్వుల ప్రకారంగా

గాని, అన్ని ప్రాంతీయభాషలనూ కేంద్రం ప్రోత్సహిస్తున్నప్పటికీ భీమభాగం ప్రోత్సాహం హిందీకి అందుతున్నది. పైగా మాటలేగాక, చేతల్లో కూడా తన లక్ష్యాలను సాధించుకోవడానికి కంకణం కట్టుకున్న భాజపా ప్రభుత్వం ప్రత్యేకంగా హిందీనే జాతీయ భాషగా వీలైనంత త్వరగా ప్రకటిస్తే ఆశ్చర్యపోనక్కరలేదు.

ఈ పరిస్థితుల్లో మనకు రెండు ప్రత్యామ్నాయాలు కన్పిస్తున్నాయి. హిందీతో పాటు తెలుగు, కన్నడం, తమిళం, మలయాళం వంటి హిందీయేతర ద్రావిడ భాషలను కూడా జాతీయ 'అధికార' భాషాలుగా అధికారికంగా గుర్తించాలని పట్టుబట్టడం వాటిలో ఒకటి. రాజ్యాంగంలో గుర్తించబడిన అన్ని దేశీయ భాషలనూ అధికారికంగా జాతీయ అధికార భాషలుగా గుర్తించాలని కోరడం మరొకటి.

ఈ విధంగా మనం సాధించుకోగలిగితే హిందీతోబాటు మన భాషలకూ సమన్యాయం చేకూరుతుంది. దేశంలోని ప్రజలూ, కేంద్ర చట్టసభల్లోని ప్రజా ప్రతినిధులూ అందరికీ గౌరవం దక్కుతుంది.

భాషాపరమైన హక్కులు- ఎవరో ఒకరిస్తే వచ్చేవి కావు. 1978లో ఐక్యరాజ్యసమితి ప్రకటించిన సార్వత్రిక మానవహక్కుల ప్రకారంగాగానీ, మన రాజ్యాంగపరంగా గానీ, ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థల పరంగానూ-సర్వత్రా గుర్తించబడిన హక్కులివి. ఈ హక్కులను రక్షించుకోవడం మన బాధ్యత. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పరచుకోవడానికి మౌలికమైన ఆధారం ఇదే.

భాషా రాష్ట్రాలను సాధించుకోవడానికి జరిగిన ఉద్యమాలకు స్ఫూర్తి కూడా తెలంగాణ,ఆంధ్ర ప్రాంతాల్లోని తెలుగువారు జరిపిన ఉద్యమాలే. కాని, ఇప్పుడు- బహుశా దేశంలోనే భాషాపరంగా లక్ష్యాల సాధనలో ఒక భాషాజాతిగా బలహీనమవుతోన్న రాష్ట్రాలు మన తెలుగు రాష్ట్రాలు. ఇందుకు బాధ్యులు అధికారమదాంధులైన మన పాలకులే. భాషా పరంగా ప్రజల హక్కులకు పూర్తి విరుద్ధంగా నడుస్తున్న రాష్ట్రాలు మనవి. భాషను కోల్పోతే మన జాతిఅస్తిత్వాన్ని కోల్పోయినట్లే అన్న సంగతిని పదే పదే గుర్తుచేసినా పట్టించుకోని పాలకులు మనవాళ్ళు. వారికి అధికారమే సర్వస్వం. కాని, ఒక భాషాజాతిగా మనం విఫలమైన తర్వాత మనవి తెలుగు రాష్ట్రాలుగా మిగలవు. స్వాభిమానాన్ని కోల్పోయిన జాతి పరభాషీయులకు బానిసగా బ్రతకడం తప్ప.గత్యంతరం ఉండబోదు.

చివరగా ఒక్కమాట. నిన్న తెలంగాణలో శాసనసభకు ఎన్నికలు జరిగాయి. అక్కడ పాలక పార్టీగాని, ప్రతిపక్ష పార్టీలుగాని, ఆర్థిక విషయాలగురించీ అవినీతి గురించీ పరస్పర విమర్శలను రక్తి గట్టించాయే తప్ప ప్రజల భాషలో పరిపాలనను గురించిగాని, చదువుల గురించిగాని, ఆత్మగౌరవం గురించి గాని మాట్లాడలేదు. కేంద్ర చట్టసభల్లో తమ ప్రతినిధులు తెలుగులో మాట్లాడే హక్కు గురించి ప్రస్తావించలేదు. ఇక, మూడు నాలుగు నెలల్లో ఆంధ్ర రాష్ట్ర శాసనసభ ఎన్నికలూ, దానితోపాటే లోక్‌సభకు ఎన్నికలు జరుగనున్నాయి. వాటి గురించి అప్పుడే పెద్దఎత్తున రాజకీయ సంరంభం మొదలైంది. ఉచితాల గురించి, ఓట్లను తెచ్చిపెట్టే అంశాల గురించి మాట్లాడుతున్నారే తప్ప ప్రజల భాషా హక్కులకు సంబంధించి ఏమీ మాట్లాడడం లేదు. దేశస్థాయిలో మన పరపతి ప్రయోజనాల గురించి గానీ తెలుగుజాతి ఆత్మగౌరవానికి సంబంధించిన అంశాల ప్రస్తావనగానీ అసలేలేదు. ప్రజల భాషలో పరిపాలన, చదువుల విషయమై ప్రభుత్వాలు చేస్తున్న అన్యాయాన్ని గురించిన ఊసేలేదు.

ఆలాంటి పరిస్థితుల్లో తెలుగుజాతి ముందున్న సమస్యలపైనా, వాటి పరిష్కారానికి సంబంధించి చేయవలసిన ఉద్యమ కార్యక్రమం గురించీ చర్చించడానికి విస్తృతస్థాయి సమావేశం జరగాలి. చర్చలు జరిపి, వెంటనే చేపట్టాల్సిన కార్యక్రమాల రూపకల్పన చెయ్యాలి. తెలుగు స్వాభిమానోద్యమ దిశగా మనం అడుగులు వెయ్యాలి. రాజకీయాలను ప్రభావితం చేసే శక్తిని సాధించాలి.

తేది : 22-12-2023

# తెలుగు భాషోద్యమ సమాఖ్య

(ప్రభుత్వ నమోదు సంఖ్య1288/2003)

కేంద్ర కార్యాలయం : ప్లాటు నం. 89, ఇంటి నం.54-1/4, 1ఎ, పెట్రోల్ కాలనీ
4వ వీధి, 2వ అడ్డరోడ్డు, విజయవాడ - 520008, ఫోన్ నం.98661 28846
ఇ-మెయిల్: ammanudi@gmail.com, వెబ్‌గూడు: ammanudi.org,
హైదరాబాద్ కార్యాలయం : ఇంటి నెం. 1-6-180, చైతన్యపురి, హైదరాబాద్-500 060, ఫోన్ : 040-24047717, సెల్ : 9440624678


## రెండు తెలుగు రాష్ట్రాలలోని రాజకీయపక్షాలకు తెలుగుభాషోద్యమ సమాఖ్య విన్నపం

**1953లో భాషా ప్రాతిపదికన భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడిన సందర్భం మనందరికీ తెలుసు. తెలుగు వాళ్ళందరం కలిసి దేశచరిత్రలోనే మొట్టమొదటిసారిగా భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడ్డాం. దీని వెనుక మన పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యా విజ్ఞానాలు, మన జీవితాలను నడిపించే సుపరిపాలన, మనం చేసే చట్టాల్లో గానీ చర్యల్లో గానీ మంచిచెడుగుల్ని నిర్ణయించే న్యాయం ఇవిఅన్నీ ప్రజలకు గాలీ నీరు లాగా సులభంగా అందాలి అన్నదే ధ్యేయం.అందువల్ల భాష మన సమాజాన్ని నడిపించే ప్రాణవాయువుగా అర్థం చేసుకోవాలి. ఊపిరి తీసుకోకుండా ఒక్క క్షణం ఉండలేనట్టు మనం మాట లేకుండా ఉండలేం.**

**భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పరుచుకున్నా ఆనాటి ఆదర్శాలూ, ఆ నాటి స్వప్నాలకూ నెమ్మదిగా దూరం జరుగుతూ వచ్చాం. తెలుగు భాషోద్యమ సమాఖ్య 2003 నుండి జీవశక్తిని ఇచ్చే భాష, ప్రజా జీవితం నుంచి ఎలా దూరమవుతోందో అనుక్షణం రెప్ప వేయకుండా గమనిస్తూ వచ్చింది. వాటిల్లో కొన్నింటిని మీరు ఒక రాజకీయ పక్షంగా ప్రజలకి సమాధానం ఇవ్వవలసిన ఒక వ్యవస్థగా ఆలోచించాల్సిన విషయం గురించి తెలుగు భాషోద్యమ సమాఖ్య ఈ కింది విషయాలను మీ దృష్టికి తెస్తోంది.**

**1. పాలనా రంగం**

పాలనా రంగంలో అటు జిల్లా స్థాయిలోనూ, రాష్ట్ర సచివాలయ స్థాయిలోనూ ఇప్పటికీ ఇంగ్లీషే రాజ్యం ఏలుతోంది. రైతులకూ, పేదలకూ, కష్ట జీవులకూఅర్థం కాని భాషలోనే మన కార్యాలయాలు పని చేస్తున్నాయి.రాష్ట్రం ఏర్పడి 70 ఏళ్ళైనా పాలన తెలుగులో లేకపోవడం ఎవరి మంచికోసం. కొంతమంది ఉన్నతాధికారులూ చిన్న స్థాయి అధికారులూ కూడా పాలనా వ్యవస్థలో తెలుగుని విజయవంతంగా ప్రవేశపెట్టి కృతకృత్యులయ్యారు.అయితే, పదకోశాల్లేవు అని కొంత కాలం, కంప్యూటర్లు లేవని కొంత కాలం, అంతర్జాలంలో తెలుగు లేదని కొంత కాలం, ఇట్లా సాగదీస్తూనే ఉన్నాం కానీ అటు పాలకులకూ ఇటు ఉన్నతోద్యోగులకూ ఎవరికీ దీని మీద సంకల్పమూ, చిత్తశుద్ధీ లేదు అనిపిస్తోంది.

ఇప్పటికైనా దృఢసంకల్పంతో స్పష్టమైననిర్ణయాలు తీసుకుంటే ఒక్కఏడాదిలోపే పాలనప్రజలకి చేరువవుతుంది. ప్రజల భాషలో ఉత్తర్వులనూ, చట్టాలనూ చూసినప్పుడు జనంతో ప్రభుత్వం ఉందనే ఆలోచన వస్తుంది, నేరుగా పాలనలో పాలుపంచుకుంటారు. ప్రజాస్వామ్యంలో ఇంతకన్నా కోరుకోదగినది ఏముంది. కాబట్టీ, ఇప్పటికైనా దృఢ సంకల్పంతోమేంప్రజల కోసమే ఉన్నాం.అని మీరు మీ మానిఫెస్టోలో ప్రజలభాషకు పట్టంకట్టి 'ప్రజలకోసం నిలబడే నిజమైన ప్రభుత్వం మాది' అనిపించుకోండి.

**2. విద్యారంగం**

విద్యారంగంలో విధాన నిర్ణేతలకు ప్రధానంగా ఉండవలసినదూరదృష్టి కొరవడినకారణంగా సమసమాజ నిర్మాణంలో విద్యారంగ పాత్ర తగ్గిపోయింది. ప్రపంచవ్యాప్తంగా విద్యారంగం అనేది ఆ దేశ ప్రజల, ప్రజాసమూహాల సర్వతోముఖాభివృద్ధికి మూల కారణమని భావిస్తారు. ఉదాహరణకి ఒక శాస్త్రవేత్త, ఒక డాక్టర్, ఒక లాయర్, ఒక సాంకేతిక నిపుణుడు, ఒక పోలీస్, అందరూ విద్యారంగం నుంచే వస్తారు. ఆ విద్యారంగంలో వాళ్ళు నేర్చుకునే అంశాలు వాళ్ళ అనంతర జీవితంలో వాళ్లను ఆలోచనాపరులుగా, శక్తిమంతులుగా తయారు చేస్తాయి. నిజానికి చైతన్యశీలకంగా విద్యార్థులూ, అధ్యాపకులూ, ఒకరిని ఒకరు అర్థం చేసుకుంటూ నేర్చుకోవడం జరిగితే ఆ దేశంలో ప్రజల ఆరోగ్యం బావుంటుంది. కొత్తగా మరెన్నో పోలీస్ స్టేషన్లు, కోర్టులు పుట్టుకు రావాల్సిన అవసరం ఉండదు. పుష్టికరమైన ఆహారం తీసుకుంటారు, ఆరోగ్యకరంగా ఆలోచిస్తారు. కానీ ఇవాళ మన తెలుగు రాష్ట్రాల్లో ఇంగ్లీషు మీడియం పేరుతో తరగతిగది వ్యవహారం సర్వం ఇంగ్లీషులోనే జరుగుతున్నది. పైగా ఇంగ్లీషు చదువుకుంటే ఉపాధి అవకాశాలు దొరుకుతాయని ప్రభుత్వాలే ప్రచారం చేస్తున్నాయి. ఉపాధి దొరకడం, డబ్బులు సంపాదించడం మాత్రమే

విద్య లక్ష్యం కాదు. పైన చెప్పినవన్నీ సమకూరాలి.

ఇలా అన్నప్పుడల్లా పేదవాళ్ళకు ఇంగ్లీషు రావద్దా అంటారు. ఇక్కడే మీకు ఒక విషయం చెప్పాలి. మనం ఇంగ్లీషులో చదువుకోవడం గురించి మాట్లాడుకొంటున్నాం, ఇంగ్లీషును నేర్చుకోవద్దు అనడంలేదు. ఇంగ్లీషులో చదువుకోవడం వేరు. ఇంగ్లీషు నేర్చుకోవడం వేరు అన్న ఆ స్పష్టత ప్రభుత్వాన్ని నడిపే రాజకీయ పక్షాలకు ఉండాలనే విషయాన్ని మేం గుర్తుచేస్తున్నాం.

ముఖ్యంగా అటు విషయ పరిజ్ఞానం, ఇటు భాషా రెండూ రాని కొత్త తరాన్ని మనం ఇంగ్లీషు మాధ్యమం పేరుతో సృష్టిస్తున్నాం. ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థల సర్వేలన్నీ మన విద్యా ప్రమాణాలు ఎలా పడిపోతున్నాయో దానికి ఇప్పుడు ఉన్న ఇంగ్లీషు మాధ్యమం ఎలా కారణమో స్పష్టంగా చెబుతున్నాయి. మాతృభాషలో సామాజిక జీవభౌతిక గణిత శాస్త్రాలను బోధిస్తే ఎంతో క్లిష్టమైన విషయాన్ని కూడా పిల్లలు అతి సులభంగా నేర్చుకుంటారు. దీని పట్ల బోలెడంత అధ్యయనం జరిగింది. మీరు కూడా మీకు తెలిసిన ఏ స్కూల్లోనైనా ఒక గంటలో అధ్యయనం చేసి నిరూపించవచ్చు.

పిల్లలకు విజ్ఞానం ఇవ్వడమనేది జగ్గులో నీళ్ళు, గ్లాసులో నింపడం లాంటిది కాదు. నేర్చుకొనేవాడు, నేర్పేవాడు కలిసిమెలిసి పని చేయాల్సిన ప్రక్రియ. అది మాతృభాషలో మాత్రమే సహజంగా, ఉత్సాహంగా ఉంటుంది. ఇప్పుడు, పిల్లలు దాన్ని కోల్పోతున్నారు.

మరి పిల్లలకు ఇంగ్లీషు రానక్కరలేదా అన్నదానికి – ఇంగ్లీషుని భాషగా నేర్పేటప్పుడు నాలుగు కీలకమైన అంశాలున్నాయి – వినడం, మాట్లాడడం, రాయడం, చదవడం. మన మాతృభాషతో సహా ఏభాషనైనా సరే ఇలాగే నేర్చుకుంటాం. కానీ మన ఇంగ్లీషు తరగతులలో నాలుగు పద్యభాగాలు, ఐదు గద్యభాగాలు పెట్టి అదే ఇంగ్లీషు అని నమ్మబలుకుతారు. పైన పేర్కొన్న నాలుగురకాల నైపుణ్యాలు సుమారు వెయ్యి గంటలు వెచ్చించి చదువుకొన్నా కూడా రావటం లేదని సర్వే ఫలితాలు వెల్లడి చేస్తున్నాయి.

భాషలనునేర్చుకోవడంఒక శాస్త్రీయ ప్రక్రియ అనిప్రపంచవ్యాప్త పరిశోధనలు నిరూపించిన అంశం. అందువల్ల మన ఇంగ్లీషును నేర్పే పండితులు, ఇంగ్లీషు వాచకాలు, పాఠ్యప్రణాళికల నిర్మాణం, చురుగ్గా ఇంగ్లీషుని మాట్లాడ్డం, అర్థం చేసుకోవడం, వినడం, రాయడం లాంటి నైపుణ్యాలను నేర్పాలి.ఇంగ్లీషు 'మీడియం' కాదు అమలు చేయాల్సింది.

**3. న్యాయ పాలన**

జిల్లా స్థాయి కోర్టుల్లో, పోలీస్ స్టేషన్లలో, రెవెన్యూ కోర్టుల్లో న్యాయపాలన ప్రజల భాషల్లోనే అమలుచేస్తున్న వైనం మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ మొదలైన చోట్ల మనం చూస్తాం. అతి కీలకమైన పత్రాలు కూడా అక్కడిప్రజల భాషల్లోనే ఉంటాయి. తెలుగు రాష్ట్రాలూ ప్రజలకోసం ప్రజలచేత ఎన్నికయ్యే ప్రభుత్వాలు అయినపుడు మనకోర్టుల్లో న్యాయపాలన ప్రజల భాషలోఎందుకు ఉండకూడదు. అలా అయినపుడేసామాన్య ప్రజలు వివాదాల నుంచి సులభంగా బయట పడగలుగుతారు.భాష అనేది ఎవరో కొద్ది మంది భాషాభిమానులకోసం కాదు ప్రజల కోసం, ప్రజల భాషలోప్రజా వ్యవస్థలు పని చేయాలని అంటున్నాం. **తెలుగు కేవలం భావోద్వేగం కాదు, తెలుగుజన జీవనానికి ఊపిరి.**

తెలుగు గురించి మాట్లాడుతున్నామంటేతెలుగు జాతి జనుల బాగోగులు, తెలుగు పిల్లల భవిష్యత్తు, తెలుగువారి అభివృద్ధిని గురించి మాట్లాడుతున్నామని గమనించండి.

**మేము మాట్లాడుతున్నది తెలుగు చుట్టూ అల్లుకున్న జన జీవితంతో, జన జీవనంతో పెనవేసుకున్న భాషా బంధం. అంతిమంగా మేం మాట్లాడుతున్నది తెలుగు సమాజం అభివృద్ధి గురించే.**

**మీ పార్టీ అధికారాన్ని చేపట్టేందుకు ఈ కింది అంశాలను పరిగణించి అమలు చేస్తాం అని మీ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఈ కింది అంశాలను చేర్చాలనితెలుగు భాషోద్యమ సమాఖ్య(తెభాస) కోరుకుంటోంది:**

**1.ప్రజల చెంతకు పాలన, ప్రజల భాషలో సాగాలి. అది అన్ని రంగాల్లోనూ, అన్ని స్థాయిల్లోనూ సాగాలి.**

ఇదే భాషా రాష్ట్రాల లక్ష్యం. ఏడు దశాబ్దాలు దాటుతున్నా ఈనాటికీ పూర్తి ఫలితాలను సాధించలేకపోవడం పార్టీల వైఫల్యంగా తెలుగు భాషోద్యమ సమాఖ్యభావిస్తోంది. వెంటనే ఈ విషయమై ఈ ఎన్నికల సందర్భంగా మీ పార్టీ ఎన్నికల ప్రణాళిక ప్రజలకు హామీ ఇవ్వాలని తెలుగు భాషోద్యమ సమాఖ్య కోరుకుంటున్నది.

**2.తెలుగు మాధ్యమంలో చదువుకున్న వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో 20% రిజర్వేషన్ కల్పించాలి.**

తెలుగురాష్ట్రాలలో తెలుగులో చదువుకున్న వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ లేకపోవడం పూర్తిగా ప్రజా వ్యతిరేక పాలనగా తెలుగు భాషోద్యమ సమాఖ్యభావిస్తోంది. తమిళనాడు లాంటి పొరుగు రాష్ట్రాల్లో మాతృభాషా మాధ్యమంలో చదువుకున్నవారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో 20% రిజర్వేషన్ అమలులో ఉంది, ఈ విషయాన్ని హైకోర్టు సైతం సమర్థించింది.

**3.పాలనలో తెలుగును అమలు చేసే సిబ్బందికి తగిన ప్రోత్సాహకాలను ప్రకటించాలి.**

మన పొరుగు రాష్ట్రాలలో స్పష్టమైన నిర్ణయాలు తీసుకొని, పాలన పూర్తిగా ప్రజల భాషలో చేస్తుండగా తెలుగు రాష్ట్రాలలోమాత్రం మన పాలకులు విఫలమవుతున్నాయి అధికారంలోకి రావాలనుకునే పార్టీలు ఈ విషయమై స్పష్టంగా తమ

**(తరువాయి.......17 వ పుటలో)**

# ఇవీ సంగతులు!

**1. వాషింగ్టన్ విశ్వవిద్యాలయంలో తెలుగు పీఠం ఏర్పాటు చేసిన కొడవళ్ళ దంపతులు.**

తెలుగు భాషను సాహిత్య, సాంస్కృతిక అంశాల్లో పరిశోధించేందుకు కొడవళ్ళ హనుమ, వారి భార్య అనురాధ వాషింగ్టన్ విశ్వవిద్యాలయానికి విరాళమిచ్చారు. ఆ విరాళంతో విశ్వవిద్యాలయం వారు తెలుగు భాషాధ్యయనానికి ఒక పీఠాన్ని ఏర్పాటు చేయనున్నారు. అమెరికాలో 2017 నాటికి నాలుగు లక్షల తెలుగు కుటుంబాలున్నాయని, ఈ పీఠం అలా వచ్చిన తెలుగు వారిలో తెలుగు భాషాధ్యయనం పట్ల ఆసక్తి ఉన్నవారికి సహాయపడుతుందని విరాళమిస్తున్న సందర్భంలో హనుమ అన్నారు.

**2. జనవరి 5, 6, 7 తేదీల్లో రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభలు**

ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్తంగా జనవరి 5, 6, 7 తేదీలలో రాజమహేంద్రవరంలో రాజరాజనరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాల్లో భాగంగా రెండో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నారు.

**3. అట్టహాసంగా బాలోత్సవ్ - 'సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి'**

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే లక్ష్యంగా జరుగుతున్న బాలోత్సవ్-2023 వేడుకలు బుధవారం ముగిశాయి. గుంటూరు జిల్లా నంబూరులోని వీవీఐటీ VVIT కళాశాలలో సోమవారం నుంచి బాలోత్సవ్-2023 వేడుకలు జరుగుతున్నాయి. మూడు రోజులుగా వైభవంగా జరిగిన బాలోత్సవ్ తెలుగు బాలల పండుగ బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి తెలుగు అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి. విజయబాబు, వీవీఐటీ కళాశాల ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు. 20 అంశాల్లో 61 విభాగాల్లో మూడు రోజుల పాటు జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పి. విజయబాబు, వాసిరెడ్డి విద్యాసాగర్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన విజయబాబు మన సంస్కృతి, సంప్రదాయాలు, భాషను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో వీవీఐటీ కళాశాల ప్రతి సంవత్సరం బాలోత్సవ్ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందిస్తూ, వారి మానసిక వికాసానికి దోహదపడేలా ప్రపంచ తెలుగు బాలల పండుగ 2023ను బాలోత్సవ్ పేరిట నిర్వహించామని వీవీఐటీ కళాశాల ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వచ్చిందని విద్యాసాగర్ తెలిపారు. ముగింపు వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో తెలుగు రాష్ట్రాల నుంచి 15వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

**4. NATS తెలుగు భాష, తెలుగు చిత్ర కళపై 'నాట్స్' వెబినార్**

భాషే రమ్యం .. సేవే గమ్యం నినాదంతో ముందుకు సాగుతున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం నాట్స్ అమెరికాలో తెలుగు వారి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. తెలుగు భాష పరిరక్షణ కోసం తెలుగు లలిత కళా వేదిక ఆధ్వర్యంలో ప్రతి నెల ఆన్‌లైన్ వేదికగా సదస్సులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే తెలుగు భాష, చిత్రకళా వైభవంపై వెబినార్ నిర్వహించింది. ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, సాహిత్య విమర్శకురాలు డాక్టర్ కొండపల్లి నీహారిణి ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేశారు.

**5 భావితరాలకు తెలుగు భాష తియ్యదనం తెలియజేసేందుకు కృషి చేస్తా: నవీన**

నవీనది మారుమూల ప్రాంతంలోని ఓ చిన్న కూలీ కుటుంబం. ఎన్నో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంది బాపట్ల యువతి నవీన. అయినా అవేవి తన లక్ష్య సాధనకు అవరోధాలుగా నిలవలేవంటూ ముందుకు సాగింది. ఒకప్పుడు తెలుగు అంటేనే భయపడేది ఇప్పుడు ఎంఏ తెలుగు పూర్తి చేసి బంగారు పతకాలు సాధించిన నవీన నేడు బెంగుళూరు విశ్వవిద్యాలయంలో పి. హెచ్.డి. లో భాగంగా తెలుగు భాషపై పరిశోధన చేయనుంది.

**6. డల్లాస్‌లో తెలుగు గ్రంథాలయం ప్రారంభం**

అమెరికాలో తెలుగువారు అధికంగా నివసించే నగరాల్లో ఒకటైన డల్లాస్‌లో శుక్రవారం సాయంత్రం తెలుగు గ్రంథాలయాన్ని ప్రారంభించారు. డల్లాస్ శివారు లూయిస్‌విల్‌లో ప్రవాసాంధ్రుడు మల్లవరపు అనంత్ R2 Reality కార్యాలయంలో దీన్ని ఏర్పాటు చేశారు. ఈ గ్రంథాలయాన్ని గాయని ఎస్పీ శైలజ, గాయకుడు ఎస్పీ చరణ్, తానా మాజీ అధ్యక్షుడు డా. తోటకూర ప్రసాద్‌లు ప్రారంభించారు.

**7. చాట్‌జిపిటి తరహాలో దేశీయ లార్జ్ లాంగ్వేజ్ మోడల్ 'కృత్రిమ్‌ఏఐ'**

చాట్‌జిపిటి ఏఐ రంగంలో ఒక విప్లవం, ఒక వ్యక్తి అడిగిన ప్రశ్నకు ఆ వ్యక్తికి అనుకూలంగా సమాధానం ఇవ్వటం ఈ ఏఐ సాంకేతికత విశేషం. అలాంటి చాట్‌జిపిటి తరహా లార్జ్ లాంగ్వేజ్ మోడల్ ను బెంగుళూరు సంస్థ ఒకటి కృత్రిమ్‌ఏఐ పేరుతో జనవరిలో విడుదల చేయనుంది. ఈ యంత్రం 22 భారతీయ భాషల్లో ప్రశ్నలు తీసుకొని 10 భాషల్లో సమాధానమివ్వగలదు.

**8. శాస్త్ర సాంకేతిక విభాగాలతో సహా అన్ని కేంద్రప్రభుత్వ సంస్థలలో హిందీ వాడుక పెరిగిందన్న కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రి డా. జితేంద్ర సింగ్.**

ప్రధానమంత్రి మోదీ చొరవ వలన ఆంగ్ల స్థానంలో అనేక కేంద్ర ప్రభుత్వ సంస్థలలో హిందీ వాడకం పెరిగిందని కేంద్ర మంత్రి అన్నారు. ఇందుకు ప్రధానంగా ఆంగ్లంలో ఉన్న అన్ని పారిభాషిక పదాలను హిందీలోకి అనువదించి, ఆ నిఘంటువులను అందరికీ అందుబాటులోకి తేవడం ప్రధాన కారణంగా చెప్పారు.

**9. కనుమరుగవుతున్న భాషలను కాపాడేందుకు పోరాటాలు చెయ్యాలి.**

మన దేశంలో చిన్న భాషలను పెద్ద భాషలు ఎప్పుడూ చంపేస్తూ వచ్చాయి. నేడు ఎన్నో సంచారతెగల వారు మాట్లాడే భాషలు కనుమరుగు అంచున ఉన్నాయి. ఆ భాషలకు లిపి లేకపోవడం ఒక పెద్ద సమస్య. ఆ భాషల వాళ్ళు పని కోసమో, మరే సందర్భంలోనో

నగరాలకు, పట్టణాలకు, గ్రామాలకు వచ్చినపుడు అక్కడి ప్రజలు ఈ తెగల వారి భాష పట్ల చూపే చులకన వలన వీరు తమ భాషంటే చిన్నచూపు తెచ్చుకుని, అది కనుమరుగైనా పట్టించుకోవడం లేదు. NT-DNT(నొమాడిక్ & డీనోటిఫైడ్ ట్రైబ్స్) తెగల్లో అన్నిటినీ 1871 నాడు అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం పుట్టుకతో నేరప్రవృత్తి ఉన్న తెగలుగా ముద్ర వేసింది. భారతదేశ ప్రభుత్వం 1952లో మరొక చట్టం చేసి వీరిని పుట్టుకతో నేరస్థులు కారు అని చెప్పదలుచుకున్నా, నేటికీ బ్రిటిష్ కాలం నాటి దృష్టితో జనాలు వీరిని చూడటం వలన, తమ తెగకు సంబంధించిన అంశాలు ముఖ్యంగా భాషను వదిలేస్తే తమను నాగరికులు గుర్తిస్తారనే భ్రమలో ఈ తెగల వారు ఉన్నారు. అందువలన కనుమరుగవుతున్న వీరి భాషలను కాపాడాలంటే పోరాటాలు, ఉద్యమాలు జరగాల్సిందే.

**10. భాషను పిల్లలు గర్భంలోనే నేర్చుకోడం మొదలుపెడతారు : సరికొత్త పరిశోధన**

మనం పురాణాల్లో చదువుకున్నాం, ప్రహ్లాదుడు తన తల్లి కడుపులో ఉండగానే నారదుడు చెప్పే విష్ణు భక్తి కథలు విని నేర్చుకున్నాడని, అభిమన్యుడు తన తల్లి గర్భంలో ఉండగా చక్రవ్యూహాభేదన గురించి విని నేర్చుకున్నాడని. అవి కేవలం పురాణ కథలని కొట్టి పారేయకూడదు. నేటి పరిశోధనల్లో బిడ్డ తల్లి పొత్తికడుపులో నుండి భాషను ఆకళింపు చేసుకుంటాడని సరికొత్త పరిశోధనలో తెలిసింది. ఇటలీలోని పదువా విశ్వవిద్యాలయంలో జరిగిన ఒక అధ్యయనంలో పొత్తిళ్ళలో ఉన్న పసిపాప తన తల్లి గొంతును, ఆమె మాట్లాడిన భాషను విని ఆకళింపు చేసుకుంటాడని, బయటకు వచ్చాక తన తల్లి గొంతును తిరిగి గుర్తుపడతాడని తెలిసింది.

**11.ఐఐటీల్లో చేరే కొత్త విద్యార్థులకు ఇకపై ఆంగ్ల భాష నేర్చుకునేందుకు బ్రిడ్జ్ కోర్సులు**

ఐఐటీల్లో చేరే చాలా విద్యార్థుల్లో ఆంగ్ల భాషలో కనీస పటుత్వం ఉండటం లేదని, రాయటం మినహా ఆంగ్లం చదవటం, వినడం, పలకడం లాంటి నైపుణ్యాల్లో విద్యార్థులు వెనుకబడి ఉన్నారని అక్కడి బోధన సిబ్బంది గ్రహించి వారికి ప్రత్యేక బ్రిడ్జ్ కోర్సును ప్రవేశపెట్టింది, ఈ కోర్సు పూర్తి చేసాక విద్యార్థులు మరింత మెరుగ్గా ఆంగ్లంలో సంభాషించగలుగుతున్నారని తెలుస్తోంది.

–రహ్మానుద్దీన్ షేక్




**తెలుగు మాధ్యమంలో చదువుకున్న వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో 20% రిజర్వేషన్ కల్పించాలి.**

తెలుగురాష్ట్రాలలో తెలుగులో చదువుకున్న వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ లేకపోవడం పూర్తిగా ప్రజా వ్యతిరేక పాలనగా తెలుగు భాషోద్యమ సమాఖ్యభావిస్తోంది. తమిళనాడు లాంటి పొరుగు రాష్ట్రాల్లో మాతృభాషా మాధ్యమంలో చదువుకున్నవారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో 20% రిజర్వేషన్ అమలులో ఉంది, ఈ విషయాన్ని హైకోర్టు సైతం సమర్థించింది.

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మూడు బహిరంగ లేఖలు

## గౌరవ ముఖ్యమంత్రి శ్రీ జగన్మోహన్ రెడ్డి  గారికి బహిరంగ లేఖ

అయ్యా!

ది. 01-12-2023 న తమరు విద్యాశాఖపై జరిపిన సమీక్ష లోని అంశాలు పత్రికల లో ప్రచురితమయ్యాయి.  అందులోని రెండు ముఖ్యమైన అంశాలపై  వాస్తవాలు మీకు తెలియజేయడం కోసం ఈ బహిరంగ లేఖ వ్రాస్తున్నాను.

1. విద్యా శాఖ సమీక్షా సమావేశంలో తమరు ఈ క్రింది విధంగా ఆదేశించారూవచ్చే విద్యాసంవత్సరం నుంచి 6వ తరగతి, ఆ పై తరగతులకు 3ఫ్యూచర్స్ స్కిల్స్‌పై' పై పాఠ్యాంశాల బోధన.

**'వాస్తవం' :** గడచిన కొన్ని సంవత్సరాలుగా ఆంధ్ర ప్రదేశ్ లో పాఠశాల విద్యావిధానాలు  బడి ఈడు పిల్లలు నేర్చుకునే తీరుతెన్నులు, వారి స్వభావాలు (learning attitudes & Behaviours), Learning Necessities, ప్రస్తుత వాస్తవ అభ్యసనా స్థాయిలను (Actual Learning levels) పరిగణలోకి తీసుకోకుండా :  పిల్లల మరియు  జాతి భవిష్యత్ ను గాలికి వదిలేసి.....   పార్టీ ల యొక్క రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే  విధివిధానాలను రూపొందించి, తల్లిదండ్రులకు అరచేతిలో స్వర్గాన్ని చూపిస్తున్నారు విద్యాశాఖ 2022 జూలై  అన్ని  ప్రభుత్వ బడుల్లో బేస్ లైన్ పరీక్ష నిర్వహించింది. గడచిన 25 సం. రాలలో విద్యాశాఖ మరియు ఉపాధ్యాయులు నిజాయితీగా నిర్వహించిన ఏకైక పరీక్ష ఇది. ఈ పరీక్ష sample సర్వే కాదు. ప్రభుత్వ బడికి రోజూ హాజరయ్యే ప్రతీ విద్యార్థి బేస్ లైన్ పరీక్ష వ్రాసారు .

– బేస్ లైన్ పరీక్ష ఫలితాల ప్రకారంగా 6,7,8 తరగతులు చదివే విద్యార్థుల్లో

అ)  41.5 % మందికి సరళమైన తెలుగు వాక్యాలు ఉన్న ఈ  క్రింద పేరా కూడా చదవటం రాదు.

'మా పొలం చాలా పెద్దది. నాన్న రోజూ పొలానికి వెళ్తారు. మా పొలంలో వరి వేశాము. ఈ సంవత్సరం ధాన్యం బాగా పండింది.'

ఆ) 65.2% మందికి మూడు సరళ ఇంగ్లీషు పదాలు మాత్రమే ఉన్న ఈ క్రింది చిన్న  వాక్యాలు  కూడా చదవటం రాదు.

a) What is the time?
b) This is a large house
c) I like to read
d) she has many books

ఇ)  58.6% మంది కి ఈ క్రింద ఇచ్చిన చిన్నపాటి భాగాహారాలు కూడా చేయడం రాదు.

a) 37/2   b) 58/4   c)79/6

ఇవి ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థుల వాస్తవ సామర్థ్యాలు . కనీస సామర్థ్యాలు అయిన చదవడం , వ్రాయడం , చిన్న చిన్న లెక్కలు కూడా రాని విద్యార్థులకు ఫ్యూచర్ స్కిల్స్‌లో ట్రైనింగ్ ఇస్తామని చెప్పడం 'తల్లితండ్రులను, సమాజాన్ని మోసం చేయడమే !!

కనీస సామర్థ్యాలు లేని పిల్లలు 'బడిలో కానీ , బడి బయట కానీ ఆధునిక టెక్నాలజీ – ఫ్యూచర్ స్కిల్స్ నేర్చుకోవటంలోనూ , వాటిని అందిపుచ్చుకోవటంలోనూ వెనుకబడే ఉంటారు. ఇదే విషయాన్ని ప్రపంచ బ్యాంక్ 2018 లో విడుదల చేసిన రిపోర్ట్ Learning: To realise Education`s promise 77 వ పేజీ లో ఈ విధంగా ఉంది' ధారాళంగా చదవలేని వ్యక్తులు మార్కెట్ లోని ఉపాధి అవకాశాలు అందుకోలేరు, తదుపరి విద్యావకాశాలు కూడా ఉపయోగించుకోలేరు త్వరితగతిన అభివృద్ధి చెందుతున్న ఆధునిక మార్కెట్‌లలో వచ్చే అత్యధిక జీతాలు ఇచ్చే ఉద్యోగాలను వీరు పొందలేరు, ఎందుకంటే ఉద్యోగ శిక్షణకు కూడా సాధారణంగా చదివే స్థాయి కన్నా మెరుగైన నైపుణ్యాలు  (reading competency beuyond minimum proficiency ఎంతో అవసరం. కనీసం చదవడం, వ్రాయడం కూడా రాని పిల్లలకు 'ఫ్యూచర్  skills నేర్పుతామని ప్రకటనలు ఇవ్వడం సమాజాన్ని, ముఖ్యంగా తల్లిదండ్రులను  మోసం చేయడమే !

ప్రభుత్వం బేస్ లైన్ పరీక్ష నిర్వహించి ఇప్పటికి 16 నెలలు దాటింది. అయినా ఇప్పటికీ తల్లిదండ్రులకు వారి బిడ్డల చదువుల స్థాయి ఎక్కడ ఉందో చెప్పలేదు॰॰ అంటే వాస్తవాలు సమాజానికి చెప్పే ధైర్యం ఈ రాష్ట్ర విద్యాశాఖ కు లేదు . వారికి తెలిసిందల్లా ... బుకాయించడం, అబద్దాలు చెప్పడం,  మాస్ కాపీయింగ్, జవాబులు వ్రాసినా వ్రాయకపోయినా మార్కులు కుమ్మరించడం!!

తమరు బాధ్యతాయుతంగా ఆలోచించి తల్లిదండ్రులకు , సమాజానికి బేస్ లైన్ పరీక్ష ఫలితాలు తెలియచేయమని విద్యాశాఖ ను ఆదేశించగలరని మనవి.

2. ఇంగ్లీష్ మాధ్యమాల్లో పరీక్షలు రాసే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, మూడు నుంచి తొమ్మిదో తరగతి వరకూ యూనిట్ పరీక్షల్లో 87శాతం మంది ఇంగ్లీషు మాధ్యమంలో పరీక్షలు రాస్తున్నారని చెప్పారు. దేశం మొత్తంమీద సగటున 37.03 శాతం మంది మాత్రమే ఇంగ్లిషు మాధ్యమంలో పరీక్షలు రాస్తుంటే, ఏపీలో మాత్రం 84.11 శాతం మంది పరీక్షలు రాస్తున్నట్టు గా అధికారులు తెలియజేసినట్లు చెప్పారు.

**'వాస్తవం':** మూడు పదాల ఇంగ్లీషు వాక్యాలు చదవడం రాని పిల్లలు ఇంగ్లీషులో పరీక్షలు ఎలా వ్రాస్తున్నారో మీ దృష్టికి రాలేదేమో!! వాస్తవం ఏమిటంటే టీచర్లు సమాధానాలు ఇంగ్లీష్‌లో బోర్డ్ మీద వ్రాసి, పిల్లలను జవాబు పత్రాలలో వ్రాయమని చెప్పి వ్రాయిస్తున్నారు. నిజంగా బడిలో పరీక్షలు ఎలా జరుగుతున్నాయో 'సిసిటివి కెమెరా'లు పెట్టి తల్లులకు చూపించండి.... తద్వారా ప్రభుత్వ నిజాయితీని నిరూపించుకోవాలి . ప్రభుత్వ చర్యల్లో నిజాయితీ లేదని చెప్పడానికి రెండు ఉదాహరణలు.

అ) 2020లో 10 వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో సిసిటీవి కెమెరాలు, వెబ్ కెమెరాలు ఏర్పాటు చేయాలని విద్యాశాఖ కమీషనర్ సర్క్యులర్ విడుదల చేశారు. అది ఈరోజుకు కూడా అమలుకు నోచుకోలేదు.

ఆ) సిసిటివి కెమెరాలకు అయ్యే ఖర్చు సముద్రంలో కాకి రెట్టంత :

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులపై సుమారు 36,000 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు (అమ్మ ఒడి, విద్యాకిట్‌లు, నాడు-నేడు, ట్యాబ్‌లు , బైజూస్ వగైరాలు). సుమారు 30 కోట్లు ఖర్చు పెడితే అన్ని బడుల్లో సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేయవచ్చు. అయినా ప్రభుత్వం ఏర్పాటు చేయడం లేదు.... కారణం? విద్యార్థుల వాస్తవ సామర్థ్యాలపై తల్లితండ్రులకు, సమాజానికి నిజాలు చెప్పగల ధైర్యం .. ఈ ప్రభుత్వానికి, బడులకు, ఉపాధ్యాయ వర్గాలకు లేదు. పరీక్షలు సిసిటీవి కెమెరాల పర్యవేక్షణలో జరిపి, తల్లిదండ్రులకు లైవ్ ఇచ్చి....87% మంది పిల్లలు ఇంగ్లీషు మీడియంలో పరీక్షలు ఎలా వ్రాస్తున్నారో చూపించి... ప్రభుత్వ చిత్త శుద్ధిని నిరూపించుకోవాలని మనవి.

**డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్ .**
**03/12/2023.**

## 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాజకీయ నిర్ణయాలు - బడి ఈడు పిల్లల బంగారు భవిష్యత్తును అంధకారం చేస్తున్నాయి

## పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ గారికి సూటి ప్రశ్నలు !

గడిచిన నాలుగు సంవత్సరాలుగా హైకోర్టు తీర్పును కూడా కాదని, విద్యార్థులు నేర్చుకునే స్వభావాన్ని - వారి అభ్యసనా స్థాయిలను పరిగణలోకి తీసుకోకుండా చేసిన 'నిర్బంధ ఇంగ్లీష్ మీడియం' అనే రాజకీయ నిర్ణయాన్ని అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, విద్యార్థుల వాస్తవ సామర్థ్యాలను 'తల్లిదండ్రులకు, సమాజానికి తెలియజేయకుండా మోసం చేస్తూ' విద్యార్థుల భవిష్యత్తును అంధకారం' చేస్తుంది.

తరగతి గదిలో జరిగే పాఠాలను విద్యార్థులు ఎంతగా అవగాహన చేసుకుంటున్నారో తెలుసుకోవడానికి 'పరీక్షలు ఒక సాధనం' నిజానికి ఇవి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇరువురు తమ తమ తప్పులు సరిచేసుకోవడానికి, తద్వారా మార్పులు చేసుకోవడానికి చక్కటి అవకాశం.

ఆంధ్రప్రదేశ్‌లోని నిర్బంధ ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన ఎలా సాగుతుంది? విద్యార్థులకు నిర్బంధ ఇంగ్లీష్ మీడియంలో పాఠాలు ఎంత బాగా అర్థమవుతున్నాయి? పిల్లలు ఎంతగా ఆకళింపు చేసుకుంటున్నారు? ఆకళింపు చేసుకున్న విషయాలను ఎలా రాయగలుగుతున్నారు? అనే విషయాలను తెలుసుకోవడానికి పరీక్షలు ఒక కొలమానం.

గౌరవ ముఖ్యమంత్రి గారు 01/12/ 2023న జరిపిన విద్యాశాఖసమీక్షలో రాష్ట్రంలో 87% మంది విద్యార్థులు ఇంగ్లీష్ మాధ్యమంలో పరీక్షలు రాస్తున్నారు అని చెప్పారు.

ది.06/05/2023 న పదవతరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాలు విడుదల చేస్తూ విద్యాశాఖా మంత్రి శ్రీ బొత్స సత్యనారాయణ గారు తెలుగు మీడియంలో కన్నా ఇంగ్లీష్ మీడియంలో 80% పైబిలుకు విద్యార్థులు పాసయ్యారని, ఇంగ్లీష్ మీడియంలో బాగా ఉత్తీర్ణత రావడానికి ప్రభుత్వ చర్యలే కారణమని చెప్పారు .

ది. 10.10. 2022న జరిగిన పత్రికా సమావేశంలో అప్పటి విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ బి. రాజశేఖర్ గారు 'పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తెలుగు మీడియం(43.97%)లో కన్నా ,ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు (77.55%)అత్యధికంగా పాసయ్యారని .....ఇంగ్లీషులో ఒక చిన్న వాక్యం కూడా చదవడం రాకపోతే అంత మంది ఎలా పాస్ అవుతారని' ప్రశ్నించారు.

**'సామాన్య ప్రజలకు, తల్లిదండ్రులకు, రాజకీయ పార్టీలకు అంతుబట్టని విషయం' :**

సమస్యను సమగ్రంగా అర్థం చేసుకోకుండా, కనీసం ఆ దిశగా ప్రయత్నించకుండా.... అబద్ధాలను, అసత్యాలను, అర్థ సత్యాలను ప్రశ్నించకుండా నమ్మడానికి అలవాటుపడిన అచేతనస్థితిలో నేటి మన సమాజం ఉంది.

ఒకవైపున సర్వేలు రోజురోజుకీ విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయని ఘోషిస్తుంటే, మరొకవైపు మార్కుల మోతలు !!! ఇందులో ఏది నిజమో సామాన్య ప్రజలకు, తల్లిదండ్రులకు, రాజకీయ పార్టీలకు, పౌర సమాజానికి సరిగా అంతుబట్టడం లేదు.

భారతదేశ చరిత్రలో .... వేద కాలం నుండి ఆధునిక యుగం వరకు ...... విద్యా వ్యవస్థలో ఎన్నడూ జరగనటువంటిది , ప్రస్తుత ప్రజాస్వామ్య పరిపాలనలో జరుగుతున్నది

'గడచిన కొన్ని సంవత్సరాలుగా.....బడులు నిరక్షరాస్యులను తయారు చేస్తున్నాయి. 10 సంవత్సరాలు బడికి వెళ్ళిన వారికి కనీసం చదవడం, రాయడం, చిన్నపాటి లెక్కలు కూడా నేర్పలేని/నేర్పని బడులు .... schooled illiterates ను తయారుచేసే కార్ఖానాలుగా మారాయి'.

2022 జూలై లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన బేస్ లైన్ పరీక్షల్లో సరళమైన 3 పదాలు ఉన్న ఇంగ్లీషు వాక్యాలు తప్పులు లేకుండా చదవడం రాని వారు 6,7,8 తరగతులలో 65.2% పైగా ఉన్నారు. (what is the time?,this is a large house, I like to read, she has many books)

**'మార్కులతో మోసం' :-**

'సాధారణ తల్లిదండ్రులను విద్యావ్యవస్థలు, ప్రభుత్వాలు, బడులు' మార్కులతో' మోసం చేస్తూ .... విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేస్తూ, రాష్ట్ర భవిష్యత్తు వినాశనానికి కారకులవుతున్నారు. తద్వారా పేదలను పేదరికపు విషవలయం నుండి బయటకు రాకుండా చేస్తున్నారు.

వడ్డించేవాడు మనవాడు అయితే ఎక్కడ కూర్చున్నా ఒకటే!! అన్నట్లుగా, విద్యార్థులు పరీక్షల్లోని ప్రశ్నలకు-రాసిన జవాబుకు సంబంధం లేకపోయినా, జవాబులలో ఎన్ని తప్పులు ఉన్నా, అసలు జవాబులే వ్రాయకపోయినా .....మార్కులు కుమ్మరించడం (లేదా) జవాబులు బోర్డు మీద రాయడం, మాస్ కాపీయింగ్ చేయించడం అనే విధానాలతో తల్లిదండ్రులను, సమాజాన్ని మోసం చేస్తున్నారు. ఇంకా స్పష్టంగా అర్థం అవ్వడం కోసం ఒక ఉదాహరణ ( గుంటూరు జిల్లా, మేడికొండూరు మండలం, సిరిపురం... జిల్లా పరిషత్ హైస్కూల్)

**ఉదా:**

ఇప్పుడు బడులలో జరుగుతున్న (02/12/2023న జరిగిన SA-1 పరీక్షలలో జవాబు పత్రాల మూల్యాంకనం ఎలా ఉందో చూడండి. ఇంగ్లీష్ ప్రశ్నాపత్రంలో 7వ ప్రశ్న 'జంతువులు, వాటి ప్రాముఖ్యత గురించి మిత్రుడికి లేఖ వ్రాయండి? ' అయితే విద్యార్థి leave letter ను సమాధానంగా రాశాడు. అందులో కూడా ఎన్నో తప్పులు. అయినా టీచర్ ఆ తప్పులను గుర్తించకుండా టిక్కు కొట'10 కి 7' మార్కులు వేశారు.(ఇంగ్లీష్ ప్రశ్నా పత్రం, మూల్యాంకనం చేసిన జవాబు పత్రం కాపీలు జత చేశాను.)

ప్రస్తుతం మూల్యాంకనం చేసిన తర్వాత జవాబు పత్రాలు ఇంటికి ఇచ్చినా కూడా... తల్లిదండ్రులకు ఇంగ్లీషు రాదు కాబట్టి ... ఇంగ్లీష్ మీడియంలోని జవాబు పత్రాలలోని మార్కులు మాత్రమే చూస్తున్నారు. ఒక వేళ ఇంగ్లీష్ వచ్చినా ... అన్ని సబ్జెక్టు లలో సరైన సమాధానాలు, తప్పులు తెలిసే ఆస్కారం తక్కువ (ముఖ్యంగా హైస్కూల్ లెవల్ సబ్జెక్టులు). మరొకవైపు పిల్లలు రాసిన అన్ని జవాబులకు (తప్పా / సరైనదా అన్న దానితో సంబంధం లేకుండా) ఉపాధ్యాయులు టిక్కులు (రైట్ లు) కొడుతున్నారు. కాబట్టి ఇంగ్లీష్ తెలియని తల్లిదండ్రులుకు ... వారి పిల్లల జవాబుపత్రాలు ఇంగ్లీష్ తెలిసిన తమ చుట్టు పక్కల వారికో / బంధువులకో చూపించడం కూడా చేయడం లేదు. అలా ఈ విద్యా వ్యవస్థ తల్లిదండ్రులను ఘోరంగా మోసం చేస్తుంది.

**విద్యా వ్యవస్థకు పట్టిన ఈ వేరుకుళ్ళు పోవాలంటే రెండు మార్గాలు ఉన్నాయి.**

1. జవాబు పత్రాలను విధిగా సోషల్ ఆడిట్ చేయడం.
2. మూల్యాంకనం చేసిన తర్వాత జవాబు పత్రాలను, మోడల్ జవాబు పత్రాల (Principles of valuation) కాపీలను

తల్లిదండ్రులకు ఇవ్వాలి. ఇన్ని లక్షల మందికి మోడల్ జవాబు పత్రాల(Principles of valuation) కాపీలను ఖర్చుతో కూడుకున్న పని అని వాదిస్తున్నారు. నిజానికి లక్షల కోట్లు సంక్షేమానికి ఖర్చు పెడుతున్న ప్రభుత్వానికి, 5 లేదా 6 లక్షల రూపాయలతో మోడల్ జవాబు పత్రాల (Principles of valuation) కాపీలు తల్లిదండ్రులకు ఇవ్వడం అనేది... 'ఎంగిలి చేతితో కాకిని తోలినట్లు!! మాత్రమే'

ప్రభుత్వ ప్రైవేటు బడులలో విద్యార్థులు రాసిన జవాబుపత్రాలను విధిగా సోషల్ ఆడిట్ నిర్వహించే విధంగా మూల్యాంకనం చేసిన జవాబు పత్రాలతో పాటు...మోడల్ జవాబు పత్రాల(Principles of valuation) కాపీలు పిల్లలకు ఇంటికి ఇచ్చి తల్లిదండ్రుల సంతకం విధిగా తీసుకునేలా' రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలను మార్చాలి.

మునుపటి కార్యదర్శులు ఎవ్వరూ చేయని విధంగా ప్రవీణ్ ప్రకాష్ గారు పిల్లల ఇళ్లకు వెళ్లి 'హోమ్ వర్క్ ను టీచర్లు కరెక్ట్ చేశారా లేదా అని!! పరిశీలిస్తున్నారు. ఇది వేల పాఠశాలలలో, లక్షలాది పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి తగినంతగా దోహదం చేయదు. నిజానికి మీరు చేయవలసింది చేయవలసినంతగా, చేయవలసిన రీతిలో చేయడం లేదు. దీని గురించి నా సూటి ప్రశ్నలు..

1. ప్రతీ బడిలో, ప్రతీ నెల ప్రత్యక్ష classroom teaching observation తో కూడిన అకడమిక్ inspection లు విధిగా జరిగేలా నిబంధనలు ఎందుకు అమలు చేయడం లేదు?

2. మూల్యాంకనం చేసిన తరువాత..జవాబు పత్రాలు ఎందుకు ఆడిట్ చేయడం లేదు? మీరు పిల్లల ఇళ్లకు వెళ్లినప్పుడు పరీక్షల జవాబు పత్రాల కాపీలు ఎందుకు అడగటం లేదు?

**డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్.**
**09/12/2023.**

## 'ట్యాబ్' ల గురించి విద్యాశాఖా మంత్రి శ్రీ బొత్స సత్యనారాయణ గారికి బహిరంగ లేఖ :

ది 14 /12/ 2023 న జరిగిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇవ్వటం గురించి మీరు ఇచ్చిన వివరణ పై సూటి ప్రశ్నలు.

1.యునెస్కో 2023 లో విడుదల చేసిన Technology in education:A Tool on whose terms అనే 'నివేదికలో పాఠశాలల్లో స్మార్ట్ ఫోన్ లాంటి డిజిటల్ పరికరాలు వాడటం వలన విద్యార్థులలో ఏకాగ్రత తగ్గి అభ్యసనా స్థాయి కుంటుపడుతుందని, 14 దేశాల్లో జరిగిన పరిశోధనలు కూడా ఇవే దుష్ప్రభావాలను ధృవీకరించాయని' తెలిపింది.

ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్(IAP) 2021 రిపోర్టులో పాఠశాలలకు ఈ విధంగా సూచించింది 'డిజిటల్ పరికరాలను ( స్క్రీన్ బేస్డ్ డివైస్‌లను) బోధన– అభ్యసన ప్రక్రియలకు ఏకైక మార్గాలుగా ప్రచారం చేయవద్దని' ఈ పరికరాలు తరగతి గదిలో పాఠాల బోధన, వ్యాయామాలకు ప్రత్యామ్నాయం కాదనిబీ హోంవర్క్ – పరీక్షలు సంబంధిత ఇతర అవసరాలకు కూడా అత్యంత తక్కువగా వీటిని వాడాలని సూచించింది. కారణం ఏమిటంటే ఇవి పిల్లల సమగ్ర ఎదుగుదలపై ప్రభావం చూపుతున్నాయని తెలిపింది.

అంతర్జాతీయ సంస్థ అయిన యునెస్కో, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ లాంటి వైద్య సంస్థల సూచనలను కాదని మన రాష్ట్ర ప్రభుత్వం ఏ కమిటీ రిపోర్టు ఆధారంగా పిల్లలకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తుంది? ఆ కమిటీలోని నిపుణులు ఎవరు? ఆ కమిటీ రిపోర్టును ఇంతవరకు ఎందుకు ప్రజలకు అందుబాటులో ఉంచలేదు? (లేదా) ఎటువంటి విద్యారంగ కసరత్తు లేకుండానే ప్రభుత్వ పెద్దల యొక్క అనాలోచిత రాజకీయ నిర్ణయమా ఇది?

**2.ఫౌండేషన్ లిటరసీ– న్యూమరసీ V/S డిజిటల్ లిటరసీ :**

విద్యాశాఖ 2022 జూలైలో అన్ని ప్రభుత్వ బడుల్లో బేస్ లైన్ పరీక్ష నిర్వహించింది. గడచిన 25 సం. రాలలో విద్యాశాఖ మరియు ఉపాధ్యాయులు నిజాయితీగా నిర్వహించిన ఏకైక పరీక్ష ఇది. ఈ పరీక్ష sample సర్వే కాదు. ప్రభుత్వ బడికి రోజూ హాజరయ్యే ప్రతీ విద్యార్థి బేస్ లైన్ పరీక్ష వ్రాసారు.

– బేస్ లైన్ పరీక్ష ఫలితాల ప్రకారరా 6,7,8 తరగతులు చదివే విద్యార్థుల్లో

అ) 41.5% మందికి సరళమైన తెలుగు వాక్యాలు ఉన్న ఈ క్రింద పేరా కూడా చదవటం రాదు.

'మా పొలం చాలా పెద్దది.నాన్న రోజూ పొలానికి వెళ్తారు.మా పొలంలో వరి వేశాము. ఈ సంవత్సరం ధాన్యం బాగా పండింది.'

ఆ) 65.2% మందికి మూడు సరళ ఇంగ్లీషు పదాలు మాత్రమే ఉన్న ఈ క్రింది చిన్న వాక్యాలు కూడా చదవటం రాదు.

a) What is the time?
b) This is a large house
c) I like to read
d) she has many books

ఇ) 58.6% మంది కి ఈ క్రింద ఇచ్చిన చిన్నపాటి భాగాహారాలు కూడా చేయడం రాదు.

a) 37/2 b) 58/4 c)79/6

తెలుగు, ఇంగ్లీషులలోని సరళ వాక్యాలు, చిన్నపాటి లెక్కలు కూడా చేయలేని విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ట్యాబ్‌లు వారి యొక్క అభ్యసనా ఫలితాలను ఏ విధంగా ప్రభావితం చేశాయి? వారి అభ్యసనా ఫలితాలను మెరుగుపరచడానికి ఏ విధంగా దోహదం చేశాయి? చదవడం, రాయడం, చిన్నపాటి లెక్కలు కూడా చేయలేని (schooled illiterates) ఈ ట్యాబ్లు ఏ విధంగా దోహదపడ్డాయి? మీరు చెప్పే డిజిటల్ ఎడ్యుకేషన్ , డిజిటల్ లిటరసీ .. ఈ లక్షలాది మంది పిల్లలు నేర్చుకోవడం సాధ్యమేనా? ఒకవేళ సాధ్యమే అని మీరు వాదిస్తే .. అప్పుడు ఇళ్లల్లో నిరక్షరాస్యులైన వృద్ధుల ' టీవీ రిమోట్ తో ఛానెల్ మార్చడాన్ని, మొబైల్ ఫోన్ వాడటాన్ని' కూడా డిజిటల్ లిటరసీగానే పరిగణించాలి.

**3.ల్యాబ్ V/S ట్యాబ్ :**

ప్రపంచ ఐటీ దిగ్గజం అయిన బిల్‌గేట్స్The Road Ahead నే పుస్తకంలో ఈ విధంగా రాశారు' కంప్యూటర్ స్క్రీన్ పై కనిపించే రసాయన ప్రక్రియ, ల్యాబ్‌లో ప్రయోగం చేసే విద్యార్థికి కాన్సెప్ట్ అర్థం చేసుకోవడానికి కొద్దిగా దోహదపడుతుంది. కానీ స్వహస్తాలతో కెమిస్ట్రీ ప్రయోగం చేయటానికి ఎన్నటికీ, ఎప్పటికీ అది ప్రత్యామ్నాయం కాదు.

అంతర్జాతీయ సర్వేTIMSS-2019 లో 8వతరగతి చదివే విద్యార్థులలో చక్కటి సైన్స్ ల్యాబ్‌లు ఉన్న పాఠశాలల్లో ప్రయోగాలు చేసిన వారికే అత్యధిక స్కోరింగ్ వచ్చింది. అంటే సైన్సు, లెక్కలలో విద్యార్థుల యొక్క అభ్యసనా ఫలితాలు learning outcomes మెరుగుదలకు ల్యాబ్‌లు మాత్రమే దోహదం చేస్తాయి .. ట్యాబ్ లు ఏ విధంగానూ సహాయపడవు. రాష్ట్ర ప్రభుత్వం ల్యాబ్‌లను నెలకొల్పకుండా, ట్యాబ్‌లు ఇచ్చి విద్యార్థులను ఉద్ధరిస్తున్నామని చెప్పడం తల్లిదండ్రులను, సమాజాన్ని తప్పుదారి పట్టించడమే!

14 దేశాలలో జరిగిన ప్రోగ్రామ్ ఫర్ ఇంటర్నేషనల్ స్టూడెంట్ అసెస్మెంట్ (PISA) స్టడీ బడిలో ఐ సి టి (I.C.T) వాడుతున్న విద్యార్థుల యొక్క అభ్యసన ఫలితాలు తక్కువగా ఉన్నాయని తేటతెల్లం చేసింది.

**4. CBSE– కంప్యూటర్ ల్యాబ్‌లు :**

CBSE- నిబంధనల ప్రకారం బడిలో కంప్యూటర్ ల్యాబ్‌లు విధిగా ఉండాలి. రాష్ట్ర ప్రభుత్వం 1300 బడుల్లో CBSE- విద్యా విధానం అమలు చేస్తున్నామని చెప్తూ.... కంప్యూటర్ ల్యాబ్ లాంటి నిబంధనల అమలు మాత్రం మర్చిపోయారా!! (అసలు నిబంధనలే లేవన్నట్లుగా నటిస్తున్నారా?)

**5.బడిలో డిజిటల్ ఎడ్యుకేషన్ పై ప్రభుత్వం యొక్క విధానం ఏమిటి ?**

'బడి ఈడు పిల్లలు ట్యాబ్‌లు వాడకపోవడం వెనుకబాటుతనంగా 'విలేకరుల సమావేశంలో అభివర్ణించటం చాలా హాస్యాస్పదంగా ఉంది. అసలు ప్రశ్న డిజిటల్ ఎడ్యుకేషన్ అంటే ఏమిటి? వాటి ప్రమాణాలు ఏమిటి? ఏ ఏ తరగతుల విద్యార్థులకు, ఏ ఏ డిజిటల్ నైపుణ్యాలు నేర్పాలనుకుంటున్నారో ఇంతవరకు రాష్ట్ర విద్యాశాఖ ప్రజలకు కానీ, తల్లిదండ్రులకు కానీ, చట్ట సభలకు కానీ తెలుపలేదు.

ప్రపంచంలో ఐదు నైపుణ్యాలను ప్రధానంగా పాఠశాల డిజిటల్ ఎడ్యుకేషన్ లక్ష్యాలుగా చెప్తారు

1. ఇన్ఫర్మేషన్ అండ్ డేటా లిటరసీ,

2. కమ్యూనికేషన్ అండ్ కొలాబరేషన్, 3. డిజిటల్ కంటెంట్ క్రియేషన్, 4. సేఫ్టీ, 5. ప్రాబ్లమ్ సాల్వింగ్'
ఇందులో మీరు ఏ నైపుణ్యాలను విద్యార్థులకు నేర్పుతున్నారు? నేర్పటానికి ఎటువంటి పాఠ్యపుస్తకాలను ప్రచురించారు? ఇవి నేర్పటానికి ఎంతమంది కంప్యూటర్ నిష్ణాతులను ఉద్యోగంలోకి తీసుకున్నారు? వీటిపై ప్రభుత్వం 'తల్లిదండ్రులకు, సమాజానికి' సమాధానం చెప్పాలి.
ట్యాబ్‌లు ఇచ్చి .. డిజిటల్ ఎడ్యుకేషన్ అని చెప్పడరా తల్లిదండ్రులను, ప్రజలను మోసం చేయడమే !

**6. తల్లిదండ్రులు- ట్యాబ్ లు :**

బడిలో కంప్యూటర్ ల్యాబ్‌లు , లాంగ్వేజ్ ల్యాబ్‌లు నెలకొల్పి టీచర్ల పర్యవేక్షణలో వాటిని వాడే విధానం కాకుండా: విద్యార్థులకు వ్యక్తిగతంగా ట్యాబ్‌లు ఇవ్వడం గురించి తల్లిదండ్రుల ఆమోదం ఉందని తమరు చెప్పటం వాస్తవానికి చాలా దూరం.
ఎందుకంటే ట్యాబ్‌లు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, డిజిటల్ బోర్డులు, స్మార్ట్ టీవీలు ప్రభుత్వ బడులలో ఏర్పాటు చేసిన తర్వాత కూడా, లక్షలాదిమంది పిల్లలు ప్రభుత్వ బడిని వీడి.... ఇవేవీ లేని ప్రైవేటు బడుల్లో చేరి చదువుకుంటున్నార్ఫే ఫీజు రీయింబర్స్మెంట్ ను కొనసాగించాలని ప్రభుత్వంపై కేసు వేసి పోరాడి గెలిచారు. ట్యాబ్ లు , డిజిటల్ స్క్రీన్స్ లేని ప్రైవేట్ బడులు మంచి పాఠశాలలని నమ్మిన ఆయా సంఘాల వారు న్యాయపోరాటం చేశారు.

**7.బాధ్యత మరచిన రాష్ట్ర ప్రభుత్వం :**

ప్రభుత్వం అనేది ఒక గొప్ప తల్లిలాగా ఆలోచించాలని, ఆ దిశగా పనిచేయాలని ప్రముఖ సోషలిస్ట్ మేధావి స్వతంత్ర సమరయోధుడు అయిన డాక్టర్ రామ్ మనోహర్ లోహియా చెప్పారు. కానీ ట్యాబ్‌ల విషయంలో ప్రభుత్వం తల్లిలాగా బాధ్యతాయుతంగా ఆలోచించకుండా, రాజకీయ లబ్ధిని మాత్రమే చూసింది.

ఐటీ దిగ్గజాలైన బిల్ గేట్స్, స్టీవ్ జాబ్స్ లాంటి వారు ఎందరో తమ పిల్లలకు 14 సంవత్సరాలు నిండే వరకు స్మార్ట్ ఫోన్లు కానీ, ఇతర డిజిటల్ పరికరాలు కానీ ఇవ్వలేదు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించి వ్యక్తిగత ట్యాబ్‌లు కాకుండా, బడిలో టీచర్‌ల పర్యవేక్షణలో కంప్యూటర్ ల్యాబ్‌లు, లాంగ్వేజ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని మనవి.

**డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్. 15-12-2023**

డా.గుంటుపల్లి శ్రీనివాస్-అమ్మనుడి పాఠకులకే కాదు, పత్రికా వార్తలను గమనించే చైతన్య వంతులైన పౌరులందరికీ పరిచయం వున్న వ్యక్తే. వృత్తి రీత్యా వైద్యులైనా, తెలుగు సమాజం- ముఖ్యంగా విద్యార్థుల మేలుకోరి, న్యాయస్థానాల్లో తనంతట తానుగా పూనుకొని పోరాటం చేస్తున్న వ్యక్తి. తెలుగు భాషోద్యమ సమాఖ్య కార్యదర్శి మండలి సభ్యులు కూడా..

## సమాఖ్య విన్నపం (9వ పుట తరువాయి)

వైఖరిని ప్రకటించి ప్రజల చెంతకు పాలనకోసం ప్రభుత్వ సిబ్బందితో ప్రజలభాషలో ప్రభుత్వ కార్యకలాపాలను చేయించేందుకు ప్రోత్సాహకాల హామీని తమ ఎన్నికల ప్రణాళికలో చేర్చాలి.

**4.జిల్లా స్థాయి వరకైనా న్యాయస్థానాల్లో తీర్పులూ, కార్యకలాపాలూ తెలుగులోనే జరిగేలా ప్రకటించండి.**

జిల్లా స్థాయి కోర్టుల్లో ప్రాంతీయ భాషల్లో తీర్పులతో సహా అన్ని వ్యవహారాలు నిర్వహించాలని జిల్లా న్యాయస్థానాలను శాసిస్తున్న 1974 నాటి ఉత్తర్వు - జీ.ఓ. ఎమ్.ఎస్.నం. 485, తేదీ 29-3-1974 (హోం) ఉన్నది. కానీ దానిని కోర్టులూ, ప్రభుత్వాలూ పట్టించుకోవడం లేదు.అక్కడక్కడ కొందరు న్యాయమూర్తులు ఉత్సాహంగా తెలుగులో తీర్పులిచ్చినా అవి ఇంగ్లీషు తీర్పులకు అనువాదాలు మాత్రమే. మీ పార్టీ అధికారంలోకి వస్తే-కోర్టుల్లో ప్రజల భాషలోనే తీర్పులతో సహా అన్ని వ్యవహారాలూ నిర్వహించబడతాయని ప్రకటించండి.

**5.విద్యాహక్కుచట్టం (2009) ప్రకారంప్రాథమిక విద్యలో బోధనా భాషగా మాతృభాషను అమలుచేయాలి.**

విద్యాహక్కు చట్టాన్నీ, జాతీయ విద్యా విధానాన్నీ అనుసరించి ప్రైవేటు, కార్పొరేటు యాజమాన్యాల కింద ఉన్న పాఠశాలలకు గుర్తింపు ఇచ్చేటప్పుడు 8వ తరగతి వరకూ మాతృభాషా మాధ్యమాన్ని వర్తింప చేయాలి అనే నిబంధనను అమలు చేస్తామని ప్రకటించండి.

**6.శాస్త్రీయ భాషా బోధనా పద్ధతులు నాలుగింటిలో ఇంగ్లీషు భాషనునేర్పించే ఏర్పాట్లు చేయాలి.**

విద్యార్థులకు ఒక భాషా విషయంగా సులువుగా సజావుగా తగిన నైపుణ్యాలతో ఆధునిక పద్ధతుల్లో ఇంగ్లీషును నేర్పవచ్చు. ఇంగ్లీషంటే ఇప్పుడు ఉన్న భయం పోతుంది. ఇంగ్లీషు మాధ్యమం బోధనా భాషగా ఉండాల్సిన అవసరమే లేదు. అ

# 45వ అంతర్జాతీయభాషాశాస్త్రజ్ఞుల సంఘ సదస్సు కీలక నిర్ణయాలు



ప్రారంభోత్సవ కార్యక్రమ సమావేశంలో ప్రముఖులు

**అలీఘడ్‌లో జరిగిన 45వ అంతర్జాతీయ భాషా శాస్త్రజ్ఞుల సంఘ సదస్సు మూడు రోజుల సదస్సు ముగింపు కార్యక్రమ సమావేశంలో ఒక నిర్ణయాన్ని ప్రకటించింది. దాని ప్రకారం విద్యారంగంలోనూ, పాలన లోనూ, న్యాయపాలన లోనూ భారతీయ భాషా వైవిధ్యాన్ని కాపాడుతూ ప్రజల భాషా హక్కులను గుర్తిస్తూ వీలైనచోట ప్రజల భాషలను వాడేందుకు సరైన చట్టాలను చేసేదిశగా భారత ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ ఒక వినతి పత్రాన్ని పంపేందుకు నిర్ణయం తీసుకొంది.**

భారతీయ భాషాశాస్త్రజ్ఞుల సంఘం(లింగ్విస్టిక్ సొసైటీ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో, అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయ భాషాశాస్త్ర విభాగం, కేంద్రీయ భారత భాషా సంస్థ(సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్) వారి సహకారంతో నవంబర్ 20–22, 2023 మధ్య మూడురోజులపాటు45వ అంతర్జాతీయభాషాశాస్త్రజ్ఞుల సంఘ (ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ ది లింగ్విస్టిక్ సొసైటీ ఆఫ్ ఇండియా) సదస్సును (ICOLSI-45) నిర్వహించింది. 200కు పైగా ఎంపికైనపరిశోధకులు తమపరిశోధనా పత్రాలను ప్రకటించారు. దీనిలో నాలుగు వందల మందికి పైగా భారతీయ, విదేశీయ భాషాశాస్త్రజ్ఞుల పాల్గొన్నారు. ఈ పరిశోధనా పత్రాలలో అధిక శాతం సైద్ధాంతిక, అనువర్తిత భాషాశాస్త్ర పరిధిలోజరిగిన జరుగుతున్న అన్ని అంశాలపైనాఇప్పటివరకూ ప్రచురించని పరిశోధనల తాలూకు విషయాలకు సంబంధించినవీ ఉన్నాయి.

సదస్సు సంచాలకులు ఆచార్య జహంగీర్ వార్సీ ఆహ్వానంపై భారతప్రభుత్వ ఉన్నత విద్యా మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ కే.సంజయ్ మూర్తి సందేశంతోప్రభుత్వ రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ, డిప్యుటీడైరెక్టర్ జనరల్, శ్రీ గంగా కుమార్ ఐఏఎస్, ప్రముఖుల సమక్షంలో వైస్–ఛాన్సలర్ ప్రొఫెసర్ మహ్మద్ గుల్రేజ్ ఈ సదస్సును ప్రారంభించారు. భారత భాషాశాస్త్రజ్ఞుల సంఘం (లింగ్విస్టిక్ సొసైటీ ఆఫ్ ఇండియా) అధ్యక్షుడు, ఆచార్యగారపాటి ఉమా మహేశ్వర రావు, (ప్రెసిడెంట్ లింగ్విస్టిక్ సొసైటీ ఆఫ్ ఇండియా) ప్రారంభోపన్యాసం




**అమెరికా భాషాశాస్త్రజ్ఞుల సంఘం అధ్యక్షుడు జాన్ బో: న్యాయ అన్వేషణలో భాషాశాస్త్రం**

చేయగా, అమెరికా భాషాశాస్త్రజ్ఞుల సంఘం(లింగ్విస్టిక్ సొసైటీ ఆఫ్ అమెరికా (LSA)అధ్యక్షుడు, ఆచార్యుడూ అయిన జాన్ బో, ఆచార్య యూనస్సే టార్బొని, యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్, USA ఆచార్య శిరీష్ చౌదరి, IIT మద్రాస్, అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయ రిజిస్ట్రారు శ్రీ ఇమ్రాన్ ఖాన్,IPS ఇంకా భారత భాషా శాస్త్రజ్ఞుల సంఘం ఉపాధ్యక్షురాలు ఆచార్యశోభా సత్యనాథ్ గార్ల ఉపన్యాసాలతో ప్రారంభోత్సవ కార్యక్రమం ముగిసింది.

**అమెరికా భాషాశాస్త్రజ్ఞుల సంఘం అధ్యక్షుడు జాన్ బో:**

అమెరికా భాషాశాస్త్రజ్ఞుల సంఘం(లింగ్విస్టిక్ సొసైటీ ఆఫ్ అమెరికా (LSA) అధ్యక్షుడూ, ఆచార్యుడూ అయిన జాన్ బో, వైశ్విక దృక్కోణంలో భాషాపరక చిత్రణ: ప్రపంచవ్యాప్తమవుతున్న దురదృష్టకర భాషా సశస్త్రీకరణ (లింగ్విస్టిక్ ప్రొఫైలింగ్ ఇన్ ఎ గ్లోబల్ పెర్స్‌పెక్టివ్: ది రిగ్రెటబుల్ వెపనైజేషన్ ఆఫ్ లింగ్విస్టిక్స్) అనే అంశంపై ప్రత్యేక ప్రసంగం చేశారు.ఆయన తన ప్రసంగంలో గడిచిన నాలుగు వందల ఏండ్లలో తప్పనిసరి పరిస్థితిలో రూపుదిద్దుకున్న సమాజమూ – భాషాపరమైన హక్కులు కోల్పోతున్న జనాభా అనే అంశంపై విస్తృత చర్చ చేశారు.

జాన్ బాగ్ సెయింట్ లూయిన్‌లోని వాషింగ్టన్ యూనివర్సిటీలో ఆర్ట్స్ అండ్ సైన్సెస్‌లో మార్గరెట్ బుష్ విల్సన్ ప్రొఫెసర్. ఆయన టెంపుల్ యూనివర్శిటీలో స్నాతకుడిగా ప్రసంగం, వాక్చాతుర్యం, కమ్యూనికేషన్‌లో ప్రావీణ్యం సంపాదించాడు. పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయంలో భాషాశాస్త్రంలో ఎం.ఏ.ఆపైనపిఎచ్.డి.చేశారు. భాషాపరమైన రేఖాచిత్రణ అనేసిద్ధాంత భావనను రూపొందించడంలో పేరుపొందాడు. యునైటెడ్ స్టేట్స్, బ్రెజిల్, కరేబియన్, ఇంగ్లాండ్, ఫ్రాన్స్,దక్షిణాఫ్రికా మొదలైన దేశాలలో ఆ అంశంపై పరిశోధనలు చేశాడు. ఆ పరిశోధనకు ది ఫోర్డ్ ఫౌండేషన్, ది నేషనల్ సైన్స్ ఫౌండేషన్, యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్, యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ ఇంకా రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ విరాళాలను అందించాయి. ఇతని పరిశోధనలో ఎక్కువ భాగం సమానత్వాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ప్రపంచవ్యాప్తంగా మానవ స్థితిని మెరుగుపరచడానికి భాషా శాస్త్రాన్ని ఉపయోగించే

మార్గాలను కనుగొనడానికి అంకితమయింది. ఇటీవలే, ఆయన ప్రచురించిన పుస్తకం న్యాయ అన్వేషణలో భాషాశాస్త్రం(లింగ్విస్టిక్స్ ఇన్ పర్స్యూట్ ఆఫ్ జస్టిస్, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్, 2018) అత్యధిక ప్రజాదరణ పొందింది. గతంలోఆయన అమెరికన్ మాండలికాలసంఘానికి అధ్యక్షుడుగా పని చేసి ఇప్పుడు లింగ్విస్టిక్ సొసైటీ ఆఫ్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

ఫిలడెల్ఫియా, లాస్ ఏంజిల్స్‌లోని నగర పరిసరాల్లో పెరుగుతున్న నల్లజాతి పిల్లవాడిగా, జాన్ బాగ్ చిన్న వయస్సులోనే జాతి వివక్షను చవిచూశాడు. అతను భాషలూ జాతుల మధ్య సహసంబంధాలను గమనించడం ప్రారంభించాడు. కళాశాలలో చదువుతున్నప్పుడు, అతను ఆఫ్రికన్ అమెరికన్లకోసం పనిచేసే చాకిరేవు(లాండ్రోమాట్)లో పనిచేశాడు. వారు తరచూ పోలీసుల క్రూరత్వానికి గురవటం చూశాడు. ఈతని ఈపరిశీలనలే సమానత్వం కోసం అభివృద్ధి చెందుతున్న పౌర హక్కుల ఉద్యమానికి భాషా వైవిధ్యం ఎలాంటి సంబంధం కలిగి ఉండవచ్చనే విషయంపై ఐరోపా, ఆఫ్రికా, ఆసియా, ఆస్ట్రేలియా, కరేబియన్, దక్షిణ అమెరికాలలో భాషా వివక్షత ప్రత్యామ్నాయ రూపాలను కనుగొనేందుకు బాగ్ ను ప్రేరేపించాయి. అతను గృహవసతుల పంపిణీ వివక్షలో ప్రయోగాత్మక అధ్యయనాల ఆధారంగా భాషాపరక రేఖాచిత్రం (linguistic profiling) అనే పదబంధాన్ని రూపొందించటమేకాక విద్య, ఉపాధి, వైద్యం మొదలైనవాటిగురించి చట్టంలో సమానత్వాన్ని ప్రోత్సహించడానికి తన పరిశోధనలను విస్తరించాడు. ఈ పుస్తకం ప్రపంచవ్యాప్తంగా సమానత్వ న్యాయాన్ని ముందుకు తీసుకెళ్లడానికి అంకితమైన అనేక అధ్యయనాల ఫలితమే.

అమెరికా నల్లవారి భాషాపరక రేఖాచిత్రణ గురించి చర్చిస్తూ, తనలోనూ తెల్ల రక్తం ఉందని పేర్కొంటూ, తన కుటుంబంలోని తెల్ల రక్తం చాలా కాలం క్రితమే కుటుంబంలోకి వచ్చిందనీ నా శ్వేతరక్తానికి కారణమైన పూర్వీకులు కుటుంబంలో ఇరువైపులా ఉన్నారనేది తనకు తెలియదనీ, మా నాన్న కుటుంబీకులు, అలాగే మా తల్లి కుటుంబీకులు తమ పూర్వీకులను కనుగొనడానికి చాలా ప్రయత్నించి చివరకు తెలుసుకున్న ఆశ్చర్యకర విషయమేమంటే ఆ నాటి నల్లజాతి బానిసల యజమానులైనశ్వేతజాతీయులు తమ ఆడ బానిసల ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా గర్భవతులను చేయడం పరిపాటిఅనీ, తమలోని తెల్లరక్తం ఏ శ్వేత జాతీయుడి ద్వారా సంక్రమించినదో కనుగొనలేనిపరిస్థితి అనీ పేర్కొంటారు. నల్లజాతీయుల నల్లఇంగ్లీషు వారి భాషాస్వేచ్ఛకూ భాష హక్కులకూ సంకేతం. అది ఏవిధంగానూ ప్రామాణిక ఇంగ్లీషుకు తక్కువకాదు అనీ పేర్కొంటారు.

ఈ సదస్సులో సుమారు పది ప్రత్యేక ఆహ్వానిత ప్రసంగాలూ, రెండు చర్చా గోష్ఠులూ జరిగినై. ఆచార్య ఉమారాణి పప్పుస్వామి ప్రవేశపెట్టిన చర్చా గోష్ఠిలోని చర్చావిషయం: దేశీయ భాషలలో సాంఖ్యిక సాధికారత కోసం సవాళ్లు: ఈశాన్య భారతదేశం నుండి దృక్కోణాలు కాగా, ఆచార్య శోభా సత్యనాథ్ ప్రవేశపెట్టిన చర్చావిషయం భారతీయ బహుభాషా వ్యవస్థలోని విద్యారంగంలో మాతృభాషలో విద్యపై పునరాలోచన: సాధ్యత-సవాళ్లు అనే అంశంలో మాతృభాషామాధ్యమంలో ప్రాథమిక విద్య అనే అంశంతో భారతదేశం వంటి బహుభాషా దేశంలో భాషా-విద్యా విధానాలను చట్టబద్ధం చేయడం ఎలా? విద్యారంగంలో 'భాష'ల వైవిధ్యం, వాటిని చట్టబద్ధం చేసే సందర్భాలను పరిశీలించడం ఎలా? అనే ప్రశ్నలను స్పృశిస్తూ మాతృభాషలో విద్య ఒక సమస్యగావలసానంతర దేశాల సందర్భంలో లేవనెత్తడం సాధారణమే. ఇక్కడ అది న్యాయమే. సాధికారత, సమానత్వం మొదలైనవిఎన్నో ఉపన్యాసాలలో వింటుంటాం. ఏదేమైనప్పటికీ, వలసానంతర దేశాలలో ఇటువంటి ఉపన్యాసాలు చాలా అరుదుగా చర్చకు రావడమేకాదు, దాదాపు ఎన్నడూ గుర్తింపు పొందలేదు. మార్కెట్ ఆర్థిక వ్యవస్థ, ప్రపంచీకరణసందర్భంలో, బోధనా మాధ్యమంగా ఆంగ్లాన్ని ఉపయోగించడం అనేది ఒక సమస్యగా గుర్తించదగినదిగా మారుతోంది. భాషలు అంతరించిపోవడానికీ ఆర్థిక మార్పులకూఏ మేరకు దీనితో సంబంధం ఉందో పరిశోధించవలసిన అత్యవసర పరిస్థితి ఏర్పడిందని గారపాటి ఉమామహేశ్వరరావుగారు చర్చలో భాగంగా తమ ప్రసంగంలో పేర్కొన్నారు. దీనిలో భాగంగానే, భాష-ఆర్థిక శాస్త్రంపై అధ్యయనాలు రెండు వేర్వేరు డిమాండ్ల ద్వారా ప్రేరేపించబడ్డాయి: 1. రెండవ భాషగా నేర్చుకోవాల్సిన భాషలూ వాటి ఆర్థిక ప్రయోజనాలు 2. ఒక దేశం లేదా జాతీయతకు తగినటువంటి భాషా విధానం, ఆర్థిక పరంగా పురోగతి సాధించడానికి వనరుగా ఎలాఉండాలి? అనే ప్రశ్నలతో పాటు భాషా సమస్యలు తరచుగా ఆర్థిక అంశాలకు సంబంధించిన సమాచార వినిమయానికి సంబంధించినవే. మానవ ఆర్థిక కార్యకలాపాలలో భాష ఒక అనివార్య సాధనంగా భావించబడుతోంది. భాషలకు తగిన విలువ, ప్రయోజనాలవంటివి వాటి ఆర్థిక లక్షణాలుగా మారినై. అనేవి చర్చలో వచ్చిన కొన్ని ముఖ్యాంశాలు.

వివిధ ఖండాలనుంచి వచ్చిన భాషాశాస్త్రజ్ఞులు తమ ప్రసంగ పాఠాలలో పేర్కొన్న భాషలూ వాటి స్థితిగతులూ ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలలో వెలువడుతున్న భాషా విజ్ఞానం నేటి మార్కెట్ విధానాల వలనా రాజకీయ విధానాల వలనా ఉపేక్షకు గురికావడంతో భవిష్యత్తులో ఇది సామాజిక పరంగా అనర్థదాయకంగా పరిణమిస్తుందని పలువురు వక్తలు తమ తమ ప్రసంగాలలో పేర్కొనడం గమనించాలి.

ఆలీఘడ్‌లో జరిగిన 45వ అంతర్జాతీయ భాషా శాస్త్రజ్ఞుల సంఘ సదస్సు మూడు రోజుల సదస్సు ముగింపు కార్యక్రమ సమావేశంలో ఒక నిర్ణయాన్ని ప్రకటించింది. దాని ప్రకారం విద్యారంగంలోనూ, పాలన లోనూ, న్యాయపాలన లోనూ భారతీయ భాషా వైవిధ్యాన్ని కాపాడుతూ ప్రజల భాషా హక్కులను గుర్తిస్తూ వీలైనచోట ప్రజల భాషలను వాడేందుకు సరైన చట్టాలను చేసేదిశగా భారత ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ ఒక వినతి పత్రాన్ని పంపేందుకు నిర్ణయం తీసుకొంది. అ

**మాతృభాష కాని భాషలో విద్యాభ్యాసం విద్యార్థి చదువుకు అడ్డంకిగా మారుతుంది**
**-యునెస్కో**

**పరిశోధనా పత్రం**

బి.మాధవిలత, ఆచార్య జి.నరసింహన్
8125638895, 9000127115

# కర్నూలు జిల్లా అత్తాకోడళ్ళ గేయాలు : ఒక పరిశీలన

**వ్యాససంగ్రహం:** జానపదగేయాలు ఆయా జాతులకు తరగని ఆస్తులని పెద్దల మాట. మనసుకు ఆనందాన్ని కలిగించేవి జానపదగేయాలు.ఇవి చాలా ప్రాచీనమైనవిగా పరిశోధకులు గుర్తించారు. ఈ గేయాలకు కవి కర్తృత్వాలు ఉండవు . జానపద నోళ్లలో ప్రచారాన్నిపొందుతాయి. ఈ గేయాల్లో వారి కష్ట సుఖాలు ఉంటాయి.వీళ్ళకు ఆనందం వచ్చినా ఆవేశం వచ్చినా గేయాలను పాడుకుంటారు. పుట్టుకతో మొదలై శ్మశానం చేరుకునే వరకు అడుగడుగునా ఆయా సంఘటనకు తగినట్లు జానపదులు గేయాలను పాడుకొనేవారు. జానపద గేయాలలో కుటుంబ సంబంధ గేయాలు అత్తాకోడళ్ళ పాటలు. అందులో ఒక విభాగానికీ చెందినవి. కర్నూలు జిల్లాలో అత్తా కోడళ్ళ పాటలు విరివిగా కనిపిస్తాయి. వివాహ అనంతరం అత్తారింటిలో ఉండే ఆడపిల్లలకు పుట్టింటిపై మమకారం ఏవిధంగా ఉంటుంది,అత్త కొడలిని పెట్టె అగచాట్లు,పుట్టింటికి వెళ్లాలనుకునేకోడళ్ళుఅత్తగారినిఅనుమతితీసుకునేవిధానాలను,అత్తాకోడళ్ళ సామరస్యమును ఇక్కడ చెప్పడం జరుగుతుంది. ఈ క్రమంలో కర్నూలు జిల్లాలోని అత్తాకోడళ్ళ గేయాలను వివరించడం జరిగింది.

**కీలకపదాలు:** ఏడుకాడల ఎద్దు, ఖద్దరు చొక్కా, గుట్ట, నిమ్మోలబావి, పట్టుపంచ, బంగారుకొడవాండ్లు, వంశమీరిన, శీరంగం, సంసారం.

**ఉపోద్ఘాతం :** అత్తాకోడళ్ళు తల్లీబిడ్డల మాదిరిగా కలసిఉంటే ఆ సంసారం బాగా ఉంటుంది. లేకపోతేనరకమే. ప్రాచీన సాహిత్యమైన ఇతిహాసాల్లో కనిపిస్తాయి. కౌసల్య సీతలు,కుంతిద్రౌపతి ఇరువురు అరమరికలు లేనివాళ్ళుగా కనిపిస్తారు. కాని తెలుగు నేలలో దంపుడు గేయంగా ప్రచారంలో ఉన్న 'అత్త లేని కోడలు ఉత్తమురాలు ఓయమ్మా కోడలు లేని అత్త గుణవంతురాలు ఆహా ఆహా'నే గేయం అందరికీ తెలిసిందే. ఈ గేయం అత్త కూడా ఒకనాటి కోడలే కదా. స్త్రీకి స్త్రీయే శత్రువు అన్న సామెతకు కారణం అయినట్లు చెప్పవచ్చు. నాటి అత్తా కోడళ్ళ బంధాలు కర్నూలు జిల్లాలో ఏ విధంగా ఉన్నాయో తెలుసుకుందాం.

ఈ పరిశోధన కోసం కర్నూలు ప్రాంతంలో క్షేత్ర పర్యటన చేశారు. మరికొంత సమాచారాన్ని ప్రామాణిక గ్రంధాల నుంచి తీసుకున్నారు . ఈ వ్యాసం వివరణాత్మక పద్ధతిలో కొనసాగుతుంది.

'అత్తా కోడళ్ళ స్వభావం' అత్త అనే పిలుపు అనుబంధానికి గుర్తు. శాతవాహన రాజైన హాలుడు రాసిన గాధాసప్తశతిలో 'అత్త'అనే తెలుగు పదం కనిపిస్తుంది. మన తెలుగింటి సాంప్రదాయంలో దాదాపుగా అత్త గడుసరి స్వభావంతో ఉంటుంది. ఇంటిలో అందరినీ చక్కదిద్దే ప్రయత్నం చేస్తుంది. కోడలి విషయంలో పెత్తనం,కొద్దిగా బెట్టు కూడా చేస్తుంది. కోడళ్ళు అత్త మాటనే వినాలని వారు ఏది చెబితే అదే చేయాలనుకుంటారు. భార్య చెప్పిన మాటలు విని కొడుకులు తమ మాట వినరేమో,ఎక్కడ వారు దూరం అవుతారో అని కోడళ్ళపైన అధికారం చెలాఇస్తారు.కొంతమంది అత్తగార్లు తల్లితండ్రులు తమ బిడ్డలకు అత్తవారింట్లో ఏ విధంగా మెలగాలో చెప్పి పంపుతారు. ఆడపిల్లలు కూడా అదేవిధంగా మెలగడానికి ప్రయత్నం చేస్తారు. వివాహం అయిన స్త్రీలకు పుట్టినింటిపై మమకారం ఎక్కువగా ఉంటుంది. తల్లితండ్రుల దగ్గరకు వెళ్లాలంటే ఎనలేని సంతోషంతో కాళ్ళకు చక్రాలు కట్టుకొని పోతారని చెబుతారు. ఇందుకు ఒక ఉదాహరణ

'డీల్లీ కెళదామంటే కదలవే కాళ్ళు
బొంబాయి కెళదామంటే కదలవే కాళ్ళు
నారాచ పుట్టింటి కదలవే కాళ్ళు
నా కాళ్ళు పన్నెందు రథములై నదుచూ
నా చేతు లుయ్యాల చేరులై యూగు' 2

పై గేయం లో అత్తారింటికీ రావాలంటే ఏదో డీల్లీ, బొంబాయి పోయినట్లు బాధతో వస్తారు.

**అత్తా కోడళ్ళ పాటలలో కోడలి యొక్క అణకువ:**

మన హైందవ సమాజంలో స్త్రీలు వివాహం అయ్యాక అత్తింటికి వెళ్లడం సంప్రదాయం. మెట్టినింటిలో పెద్దలను, పిల్లలను, భర్తను, బావగార్లను, తోడికోడళ్లను, పిల్లలను తన ప్రవర్తనతో ఎంతో వినయంగా చూసుకుంటుంది. అందరినీ తన వైపుకు తిప్పుకునే ప్రయత్నం కూడా చేస్తుంది. ఉమ్మడి కుటుంబం నుంచి వచ్చిన ఒక స్త్రీని తన అన్నదమ్ములు పుట్టినింటికి పిలుచుకపోవడానికి వచ్చినప్పుడు అత్త మామలను అనుమతి తీసుకొని పోవడం క్రింది గేయంలో ఎంతో వివరంగా ఉన్నదో గమనించవచ్చు.

వంటింటిలోన వంటలు చేసే ఓ అత్తగారు
మా యన్నలు వచ్చారు మమ్ము అయిన వంపగలరా
మీ అన్నలు వచ్చింటే ఇంకేడ ఉన్నారు
మీ అన్నలు వచ్చింటే ఇంకేడ ఉన్నారు
నిమ్మోలబావి కాడ నీడనున్నారు
నిమ్మోలబావి కాడ నీడనున్నారు
నన్నేమో అడిగావు మీ మామను అడిగిపోవమ్మ
ఊరందరి పంచాయితీలు చెప్పే ఓ మామగారు
మా యన్నలు వచ్చారు మమ్ము అయిన వంపగలరా
మీ అన్నలు వచ్చింటే ఇంకేడ ఉన్నారు
నిమ్మోలబావి కాడ నీడనున్నారు
నన్నేమో అడిగావు మీ బావను అడిగిపోవమ్మ
ఏడుకాడల ఎద్దుల చూసుకొనే ఓ బావగారు
మా యన్నలు వచ్చారు మమ్ము అయిన వంపగలరా
మీ అన్నలు వచ్చింటే ఇంకేడ ఉన్నారు
నిమ్మోలబావి కాడ నీడనున్నారు

నన్నేమో అడిగావు నీ భర్తను  అడిగిపోవమ్మ
పట్టుపంచ ఖద్దరు చొక్కా వేసుకునే ఓ మొగుడుగారు
మా యన్నలు వచ్చారు మమ్ము అయిన వంపగలరా
పోతే పోవుదువు గాని తిరిగి ఎప్పుడు వస్తారు
ఏకాదశి పండుగకు తిరిగి వస్తాను 3

పై గేయం లో  ఇల్లాలు తన పుట్టినింటికి పోవటానికి అందరి అనుమతి తీసుకుంటుంది. ఇటువంటి కోడలు ఉంటే సంసారం సాఫీగా సాగుతుంది. ఎటువంటి కలతలు,కలహాలు ఉండవు. కలసిఉంటే కలదు సుఖం అన్నారు. ఉమ్మడి కుటుంబంలో కలసి జీవించడం వలన పెద్దల సలహాలు తీసుకోవచ్చును. ఇంటిని చక్కదిద్దడంలో పెద్దలు చెప్పే మెళకువలు తెలుసుకుంటారు. అత్త మామ,బావ,మరుదులకుసేవ చేయడం ఒక అదృష్టంగా చెపుతారు. జానపద గేయాలు అర్థం వస్తువు చెడకుండా అక్కడక్కడా మార్పులతో కనిపించడం సహజం. కర్నూలు  జిల్లాలో పాడుతున్న ఈ గేయ చరణాలలోనే  మాటల మార్పులో నేదనూరి గంగాధరం సేకరించిన మీన్నేరు సంకలన గ్రంథంలో ఇలా ఉంది.

**'కలవారి కోడలు కలికి కామాక్షి, కడుగుచున్నది పప్పు కడవలో పోసి'** 4

అంతలో వచ్చారు ఆ అన్నగారు, పెట్టుకో సొమ్ములు, కట్టుకో చీరేలు అంటూ తమ ఊరుకి పయనం అవ్వమని చెప్పడం జరిగింది. ఈ గేయం లో అరుగుపై కూర్చున్న ఓ యత్తగారు, భారతంచదివేటి పెదబావగారు,రచ్చపై కూర్చున్న రాజేంద్ర భోగి అన్నమాటలు కనిపిస్తాయి. ఇది కోస్తా ప్రాంతంలో సేకరింపబడిన గేయం. ప్రస్తుతం చర్చిస్తున్న గేయం కర్నూలు ప్రాంతం కాబట్టి  ఈ గేయంలో వంటింట్లో అత్త, పంచాయితీ చెప్పే మామ,  ఏడుకాడల ఎద్దుల  చూసుకొనే ఓ బావ, పట్టుపంచ ఖద్దరు చొక్కా తొడుక్కున్న భర్తలుగా  మారినారు. నిమ్మోలబావి ఈ పాట పాడిన వ్యక్తి సంబంధమైన స్థలమని భావించవచ్చు.

**అత్త, ఆరాళ్ళు, కోడళ్ళ వేదనలు :**

కోడలు ఎన్ని సపరిచర్యలు చేసిన అత్త మెప్పుపొందడం చాలా కష్టం,కోడళ్ళని కష్టాలు పెట్టని అత్తలు చాలా అరుదుగా కనిపిస్తారు. కోడలు వస్తే అత్త స్వభావం బయటపడుతుంది. అని నానుడ్డి కూడా ఉంది. ఇరుగు పొరుగు వారు తమ కోడలిని ఎవరైనా గొప్పగా పొగిడితే ఓర్చుకోలేని అత్తగార్లు కోకొల్లలు. కోడలిగా మెట్టినింటికి వచ్చినప్పటినుంచి ఇంట్లోని వస్తువులు, ధనం, అన్నింటిని ఇతరుల పాలు కాకుండా శాయశక్తులా కాపాడుతుంది. తమ కుటుంబంలో ఉన్న ధనం దాయాదుల పాలుకావడం భరించలేని ఓ కోడలు తన ఆవేదన,ఆక్రోశం క్రింది గేయంలో ఏ విధంగా వ్యక్తీకరిస్తుందో  చూడండి.

శీరంగం సుబ్బయ్య జాబులంపినాదత్త
శీరంగం సుబ్బయ్య జాబులంపినాదత్త
జాబు చూసి నా మనసు జ్వరమెక్కినాదత్త
వోత్త నాకు సాలు సంసారం
వోత్త నేను పోతాను శీరంగం
ధాన్యాలు సిరులు దాయాదుల పాలత్త
ధాన్యాలు సిరులు దాయాదుల పాలత్త
శీరంగం సుబ్బయ్య జాబులంపినాదత్త
శీరంగం సుబ్బయ్య జాబులంపినాదత్త
వోత్త నాకు సాలు సంసారం
వోత్త నేను పోతాను శీరంగం
చీరల్లు, రైకల్లు బంధువుల పాలత్త
చీరల్లు, రైకల్లు బంధువుల పాలత్త
వోత్త నాకు సాలు సంసారం
వోత్త నేను పోతాను శీరంగం
శీరంగం సుబ్బయ్య జాబులంపినాదత్త
శీరంగం సుబ్బయ్య జాబులంపినాదత్త
జాబు చూసి నా మనసు జ్వరమెక్కినాదత్త
వోత్త నాకు సాలు సంసారం
వోత్త నేను పోతాను శీరంగం 5

పై గేయంలో ఓ కోడలు తన ఇంటిలోని ధనము,సిరులు, చీరలు,రైకలు దాయాదులు తీసుకవెళ్లారని బాధపడుతుంది. ఆమె ఎంత కాపాడుకోవాలని ప్రయత్నం చేసిన తన సొమ్ము ఇతరుల వశం అయ్యింది ఇంత కష్టపడ్డా ఏమి మిగిల్చుకోలేకపోయాను ఇక సంసారం వద్దు అని అత్తతో బాధ వెల్లగక్కుతుంది. తన ఊరిలో వారు జాబు రాసినారు ఇక చాలు నాకు సంసార బాధలు ఇంటి నుంచి వెళ్లిపోతాను అని ఆక్రోశంతో ఓ కోడలు బాధపడిన విధం వర్ణనాతీతం.

**అత్తా కోడళ్ళ సరదా పాటలు :**

దాదాపుగా అత్తా కోడళ్ళు సరదాగా,సామరస్యంగా ఉండటం నూటికి ఒక్కశాతం మాత్రమే కనిపిస్తుంది. ఇంటిలో పురుషులకంటే స్త్రీలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. వారు మంచి చెడులను చూస్తారు.  మానవ జీవితంలో  ఎప్పుడు సంతోషంతో ఉంటారో ఎప్పుడు దు:ఖంఉంటారో తెలియదు అటువంటప్పుడు ఒకరిని బాధపెట్టడం మంచిది కాదు అని తెలుసుకొనే నారీమణులు చాలా తక్కువ. ఇంటికి వచ్చిన కోడలిని తన కూతురిలా భావించి చూసుకుంటుంటారు. అంతలా చూసుకునే అత్త దొరికినప్పుడు కోడలు కూడా అత్తలో అమ్మను  చూసుకుంటుంది. ఇటువంటి అత్త కోడళ్ళ మధ్యన సాగిన గేయంను క్రింద చూడవచ్చు.

చెట్టు చెట్టు నీవు తిరిగి చెలరేగాల్  కోడలా
చెట్టు చెట్టు నీవు తిరిగి చెలరేగాల్  కోడలా
గుట్ట గుట్ట నీవు తిరిగి గులార్ అయ్యావు అత్తమా
గుట్ట గుట్ట నీవు తిరిగి గులార్ అయ్యావు అత్తమా
ఒకటి అంటే రెండు అంటావు వంశామీరిన కోడలా
ఒకటి అంటే రెండు అంటావు వంశామీరిన కోడలా
ఒకటి రెండు తీరిపోతే ఒకటి ఉంటుంది అత్తమా
ఒకటి రెండు తీరిపోతే ఒకటి ఉంటుంది అత్తమా 6

పై గేయంలో అత్త కోడలిని సరదాగా ఆటపట్టిస్తుంది. కోడలు కూడా అత్తను ఆటపట్టిస్తుంది. ఇంటికి వచ్చిన ఓ కొత్త కోడలా ఇల్లంతా నీదే అనుకోని బాద్యతగా చూసుకుంటూ చెలరేగిపోవాలి అని అత్త

అంటుంది. అప్పుడు కోడలు ఇంటి పెద్దరికం నాకిస్తే నువ్వు సన్నగా అయిపోతావేమో అత్త అని హస్యంగా అంటుంది. మా వంశంలో నీలాంటి కోడలు లేదు నువ్వు వచ్చి మా ఇంటిలో ఆనందం నింపావు అని అత్త అంటుంది.

**ముంగింపు :** అత్తా కోడళ్ళు ఎంత సమరస్యంగా ఉంటే ఆ సంసారం అంతా సాఫీగా సాగుతుంది. అలాంటి కుటుంబాలు ఆనంద నిలయాలు అవుతాయి. ఆ ఇంట్లో సంతోషాలే తప్ప దు:ఖంలు ఉండవు. పిల్లలు కూడా ఆహ్లాదకరమైన వాతావరణంలో పెరిగి మంచి భవిష్యత్తును అందుకుంటారు. పై గేయాలలో అత్తా కోడళ్ళ సంబంధాన్ని వారి మనస్తత్వాన్నిఈ గేయాలు తెలియజేస్తున్నాయి. ఇలాంటి బాంధవ్య గేయాలు వల్ల జానపదుల యొక్క జీవితాన్ని ,వారి జీవన విధానాన్ని తెలుసుకోవడానికి చాలా దోహదం చేస్తాయి.

**పాదసూచికలు:**

1. బిరుదురాజు రామరాజు,తెలుగు జానపద గేయ సాహిత్యం, పుట. 492.

2. ఆర్.వి .యస్ .సుందరం,ఆంధ్రుల జానపద విజ్ఞానం, పుట .62

3.రంగస్వామి, వయసు: 35, రామకొండగ్రామం, తుగ్గలి,మండలం, కర్నూలు జిల్లా

4. బిరుదురాజు రామరాజు,తెలుగు జానపద గేయ సాహిత్యం, పుట. 492

5.ఎల్లమ్మ, వయ్యస్సు: 45,అనుగొండగ్రామం,కర్నూలు జిల్లా.

6. రంగస్వామి,వయసు: 35, రామకొండ, గ్రామం, తుగ్గలి, మండలం, కర్నూలుజిల్లా

**ఉపయుక్త గ్రంథ సూచి:**


1. బిరుదురాజు రామరాజు,తెలుగు జానపద గేయ సాహిత్యం,కళాజ్యోతి ప్రాసెస్ ప్రైవేట్ లిమిటెడ్ 1990, తృతీయా ప్రచురణ.

2. ఆర్.వి .యస్ .సుందరం,ఆంధ్రుల జానపద విజ్ఞానం-2018

3. బిరుదురాజు రామరాజు,తెలుగు జానపద గేయ సాహిత్యం, కళాజ్యోతి ప్రాసెస్ ప్రైవేట్ లిమిటెడ్ 1990 -తృతీయ ప్రచురణ


---


రచయిత బి.మాధవిలత పరిశోధక విద్యార్థి, తెలుగు మరియు తులనాత్మక సాహిత్య శాఖ,శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం, ఆంధ్రప్రదేశ్.

రచయిత ఆచార్య జి .నరసింహన్, ఆచార్యులు, తెలుగు మరియు తులనాత్మక సాహిత్య శాఖ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం ,ఆంధ్రప్రదేశ్.





బోధనా మాధ్యమంగా మాతృభాష ఉండాలనేది నా ఖచ్చితమైన అభిప్రాయం. విద్యావ్యాప్తికి పరిశ్రమించడమే విద్యాలయాల కర్తవ్యం. విద్యాలయాల్లో బోధనా మాధ్యమంగా మాతృభాషను స్వీకరిస్తే తప్ప ఈ లక్ష్యం నెరవేరదు.

రవీంద్రనాథ్ ఠాగూర్

పరిశోధనా పత్రం

ఉప్పోరి హిమబిందు
9849840015

# కురవంజి కళారూపం
## సాంఘిక, సాంస్కృతిక అభివృద్ధి - ఒక విశ్లేషణ




ప్రపంచ వ్యాప్తంగా "ఆదిమ సంస్కృతి" పోలికలు కలిగే ఉంటాయి. ఆటవిక, జానపద, నాగరిక దశ అన్ని ప్రదేశాల జాతుల మనుష్యులకు సంభవించే ఉంటాయి. ఆటవిక జాతుల్లో ఆదిమ సంస్కృతి ఛాయలు ఈపాటికి కనిపిస్తాయి. ప్రపంచంలో ఆదిమ జాతుల్ని పరిశీలిస్తే వారి జీవితమంతా నృత్యమయం గానే కనిపిస్తుంది.

ప్రతి చిన్న పనికి. పెద్ద పనికి వారు నృత్యాన్నే ఉత్తమ అభివ్యక్తి సాధనంగా గ్రహిస్తారు . ఈ విషయం పరిశోధకులంతా అంగీకరించిన విషయమే ఆటవిక నృత్యానికి కొన్ని సాధారణ ధర్మాలుఉన్నాయి.

1. ఆచార తంత్రంతో ముడిపడి ఉండటం.
2. సామూహిక నృత్యంగా ఉండటం.
3. తమ వృత్తి ఐన వేటను అభినయాత్మకంగా ప్రదర్శించటం.
4. ప్రాకృతిక ప్రేరణలకు ఈ నృత్యం ఆంగిక ప్రతిక్రియగా.
5. కేవలం ఆనందం కోసం కాకుండా ఈ నృత్యం ఆటవిక జీవితంలో ఒక భాగంగా ఉండటం.

**కురవంజి:**

'కిరాత జాతికి ఆటపట్టైన అరణ్య ప్రదేశం సుందరమైన పర్వతాలు, నదులు, సరోవరాలు అందులో సరోజాలపై మకరందానికి మూగిన తుమ్మెదలు ! ఒకటేంటి? అంతా సుందర ప్రకృతే! అక్కడ నివసించేది "చెంచువారు" మగవారితో పాటూ అన్ని పనుల్లో పాలుపంచుకుంటారు 'చెంచతలు'. అంతులేని అడవి సంపద వారి సొత్తు.

అరణ్యాలలో నివసించే చెంచులు, కోయలు, కురవలు, మొ.. వీరు పూర్వ కాలం నుండి ఎరుకలసాని జ్యోతిష్యం చెప్పే వ్యక్తులుగా ప్రాముఖ్యత వహించారు. వీరి యొక్క ఎరుకలసాని వినోద కాలక్షేపానికి యదాలాపంగా ఆటలు, పాటలు జోడిరచి ప్రారంభించిన కళారూపం "కురవంజి".

'కురవలనే గిరిజనులు" ప్రదర్శించేది కాబట్టి దీనిని 'కురవంజి' లేక 'కొరవంజి' అని పిలుస్తారు. రాజుల కాలం నాటినుంచి నేటిదాకా ఏదో ఒక రూపంలో 'కురవంజి కళారూపం జీవించివుంది. ఇక ఆంధ్రదేశంలో 'సోదెమ్మో సోదె' అంటూ వచ్చే ఎరుకల వారిలో 'కురవంజి' జీవితరేఖలు కనిపిస్తాయి.

**కురవంజి నృత్యం:**

కురవంజి నృత్యం భారత దేశంలోని తమిళనాడు రాష్ట్రంలో ప్రదర్శించ బడుతుంది. భాగవత మేళా మాదిరిగానే తమిళనాడులోని కురవంజి నృత్యం కూడా ఆంధ్ర రాష్ట్రానికి చెందినది. కానీ ఇక్కడ తగినంత ఆదరణ లేని నృత్యంగా చెబుతారు. 'కుర' అనే పదం 'కురువాస్' లేదా 'చెంచులు' అనే తెగను సూచిస్తుంది. వీరు ఆంధ్రప్రదేశ్ లోని అరణ్య ప్రదేశాలలో నివసిస్తారు.

చెంచులలో పురుషులు 'సంచార వేటగాళ్ళు' ఐతే వారి స్త్రీలు 'జాతకాలను' చెప్పేవారు. 'అంజి' అనే పదం అడవులనుండి ఉద్భవించింది. అంటే కురవంజి' సాంప్రదాయ నృత్యాలు అడవుల నుండి ఉద్భవించాయి. ఈ రూపాన్ని " కురం మరియు కలువ' నాటకం అనికూడా అంటారు.

ఆంధ్ర దేశంలో పుణ్యక్షేత్రాలుగా వున్న సింహాచలం దేవాలయం, మంగళగిరి నృసింహ దేవాలయం, విజయవాడ కనకదుర్గ దేవాలయం, శ్రీశైలం మల్లికార్జున దేవాలయం, తిరుమల లలో సంవత్సరం పొడుగునా యాత్రా ఉత్సవాలు జరుగుతూ వండేవి.

ఈ ఉత్సవాలకు వచ్చిన యాత్రికుల వినోదం కోసం ఆటవికులైన కురవలు వినోద ప్రదర్శనలు ఇచ్చేవారు.

ఏమాత్రం నిర్మాణ పటుత్వం లేని అడుగలనే ప్రారంభదశలో వాడినా, క్రమేపీ వారి అడుగులు ఒక కళారూపంగా అభివృద్ధి చెందింది.

**కురవంజుల ఆహార్యము :**

వీరి వేషధారణలో అడవిజంతువుల చర్మాలూ, నెమలిఈకలు, పందిముళ్ళు, కోరలూ, పులిగోళ్ళూ, ఎలుగుబంటి వెంట్రుకలూ, మొదలైన వాటిని ధరించి నృత్యాలు చేసేవారు.

పుణ్యక్షేత్రాల మహోత్సవాల గురించి కథలల్లి వాటిని

ప్రదర్శించేవారు. ఈ కురవంజి కళారూపం ఒరవడినే 'జక్కులవారనే' కళావంతులు. కూడా ప్రదర్శనలు ప్రారంభించారు.

**కురవంజి నృత్య చరిత్ర :-**

కురవంజి అనేది తమిళులకు విలక్షణమైన నృత్య-నాటకము వినోదం వల్ల దాని ప్రాధాన్యత శాస్త్రీయ మరియు జానపద'కళల మధ్య సమతుల్యంగా ఉంటుంది. ఈ కళ 17వ శతాబ్దంలో ఉద్భవించింది. తమిళంలో వందలాది కురవంజీలు ఉన్నారు. ఈకళకు తొలి పోషకుడు 'రాజరాజచోళుడు'.

వార్షిక పండుగ సందర్భంగా (కురవంజి మేద్రై) కురవంజి ప్రదర్శనలు నిర్వహించడానికి 'తంజావూరులోని' పెద్ద దేవాలయంలో ఒక వేదికను నిర్మించాడుబీ ఇది "కురవంజి మేడాయి" అనే పేరుతో ఉంది. కొన్ని దశాబ్దాల క్రితం వరకు కురవంజిలను దేవాలయాలలో క్రమం తప్పకుండా ప్రదర్శించేవారు. ఈ కళాకారులు తమను తాము అందంగా మరియు మంచి ఆకృతిలో ఉంచుకునేవారు.

దేవాలయాలలో దేవదాసీల నృత్యాన్ని నిషేధిస్తూ శాసనం ఆమోదించడంతో కురవంజిలను ప్రదర్శించే అభ్యాసం కూడా నెమ్మదిగా తగ్గింది. 'కుట్రాల కురవంజి' తమిళ కవిత్వం యొక్క ఒక రూపం. ఈ కవిత రచయిత 'తిరుగూడరసాప కవి రాయార్'. ఈ కవిత్వం క్రీ.శ.1600-1700' లో రాయబడింది.

దీనిని అరవము నందు 'కురపై కూత్తు', మలయాళమందు. "కొఅత్తి యాట్టం" అని కూడా అంటారు. కురవై కూత్తు ప్రశంస **'శిలప్పదిగారం'** లో ఉన్నది. ఇది ఆనాడు కూడా నృత్య విశేషం మాత్రమే ప్రాచీన కావ్యాలలో కురవంజి పాత్ర వర్ణనలు,కురవంజి నృత్య వర్ణనలు మాత్రమే ఉన్నవి. అటు పిమ్మట "సింగి-సింగడు"ల కథా నాటకమైనది.

తరువాత యక్షగాన వీధి నాటకాలలో కురవంజి పాత్రకు ప్రవేశం లభించింది. ఇక ప్రత్యేకంగా కురవంజి అన్న పేరు రచన వెలయటం తెలుగులో 19వ శతాబ్దంలోనే జరిగింది. ఈ కురవంజి పాత్ర ప్రవేశం గల 'యక్షగానాలు', వీధి నాటకాలు "కురవంజులు" అనబడినవి. ఇవి తెలుగు - తమిళం- కన్నడ భాషలు మూడిరటను ఉన్నవి. కురవంజిలను '3' రకములని శ్రీ ముట్లూరి సంగమేశం గారు పేర్కొన్నారు.

1.కురవంజి, కురవ నాయకుల ప్రణయ వృత్తాంతాని వర్ణించేవి మొదటి రకం. ఇందులో చెంచులక్ష్మిని (కొరవంజి), నృసింహ స్వామిని (కొరవ నాయకుడు) వలచి వివరించిన గాథ వర్ణించ బడుతుంది. కొరవంజి 'సింగి' అని, కొరవ నాయకుని 'సింగడు' అని ఇందులో వ్యవహరిస్తారు.

2. నాయకుడు యెరుక వేషంలో పోయి, నాయికను కలసి, ఆమె హస్త రేఖలు పరీక్షించి, త్వరలో ఆమెకు అనుకూలుడైన భర్త దొరుకుతాడని చెప్పి, కొంత పూర్వ రంగం ప్రదర్శించినట్లు వర్ణించిన కొరవంజి రచనలలో రెండవ రకం.

3. ముఖ్య కథతో ఏ విధమైన సంబంధము లేకపోయిన, ఏదోవిధంగా ఎరుకత పాత్రకు ప్రవేశం కల్పించి, ఆమె చేత నాయికకు సోది చెప్పించడం, తదుపరి యెఱక రాజును ప్రవేశపెట్టి పరిహాసపూర్ణంగా వర్ణించడం, ఆపైన ఆ యెఱుక దంపతుల వాద వివాదాలు ముతకగా ఏకరువుపెట్టి ప్రదర్శించడం అనే ఘట్టాలు కల రచనలు మూడవ రకమైన కురవంజి రచనలు.

♦ కురవంజి నాటకములందు సంగీత, సాహిత్యాలు భాగవత మేళ నాటకము వలె పాండిత్యం కలిగినదిగా ఉండక వీధి నాటకమంత తేలికగా ఉండక మధ్యస్థంగా ఉండును.

♦ కొన్ని జానపదుల వలె ఉండక మరికొన్ని జాతులతోకూడి ఉండి, నృత్యమునకు అవకాశం కల్పించును. కొన్నిటి యందు హాస్య రసాలు కూడా కనిపించును.

♦ భాగవత మేళా నాటకములో పురాణ సంబంధమైన కథలు కలిగి ఉండి శ్రోతలలో దైవచింతనను ఏర్పరచును.

ఈ కురవంజి నాటకము ప్రేక్షకులకు సంతోషము ఇచ్చును. సామాన్య మానవుల నుండి జ్ఞానుల వరకు ఆనందించగల్గిన రచనలు కావున అందరికీ ఆహ్లాదం కలిగించుచున్నది.

కళా సంగీతము, లలిత సంగీతము, జానపద సంగీతము కూడా వాటి వల్ల అభివృద్ధి చెందినవి. ప్రజల్లో సాంఘీక, పౌరాణిక, సాంస్కృతిక పరంగా అవగాహన ఏర్పడుటకు దోహదపడు తున్నవి.

పైన పేర్కొన్నవి దృశ్య, శ్రవణ, కావ్యములు కనుక గొప్పగా ప్రజాదరణ పొందుచున్నది.


ఆధార గ్రంథాలు:

1. లలితకళా విలాసం -డా. మూల మల్లికార్జునరెడ్డి.
2. ఎ కురవంజి ఆఫ్ రిజివింటమ్-యమ్. మారుతముత్తు & యమ్.ఎస్. వెంకటాచలం
3. ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర డా. యస్. వి. జోగా రావు
4. జానపద నాటకాలు - ఆచార్య బాల అరుణకుమారి
5. ది ఎరుకల - మాన్ యత్నోగ్రఫిక్ స్టడీ- ఎ. పార్థసారథి



రచయిత శ్రీపద్మావతి మహిళా విశ్వ విద్యాలయములో సంగీత నృత్య లలిత కళల శాఖ సహాయ ఆచార్యులు, తిరుపతి.


**మాతృభాష ఆ భాషీయుడి సంప్రదాయ, సంస్కార మూలాల్ని నిత్యం తడుపుతూ, శుభ్రపరుస్తూ నవనవోన్మేషంగా పల్లవింపజేసే అంత:స్రోత్వస్విని. అది జలజలా నిత్యం పారుతుండకపోతే ఆ భాషీయుడి జీవనం శుష్కించిపోవటమే కాదు, ఏ చిన్న జీవన విషాదానికైనా గజగజ వణికి కుప్పకూలుతుంది. అట్లాంటి అంతశ్శక్తినిచ్చే సహజ పౌష్టికాహారం తల్లిభాష!**

**-సి. ధర్మారావు**

ఈమని శివనాగిరెడ్డి-స్థపతి
9848598446

# నా ఆత్మకూరు - కాజయాత్ర

ఒకరోజు, రెయిన్‌వాటర్ ప్రాజెక్టు ఎండి. శ్రీమతి కల్పనా రమేష్, మా ప్లీచ్ ఇండియా ఆఫీసుకొచ్చారు. సూర్యాపేట దగ్గరున్న ఆత్మకూరు మండల కేంద్రంలోని చెన్నకేశవాలయం ముందు కొనేరు పూడుకుపోయిందనీ, సూర్యాపేట శాసనసభ్యులు, తెలంగాణ విద్యుచ్ఛక్తి శాఖామాత్యులు శ్రీ జి. జగదీశ్వర రెడ్డి చొరవతో, అదనపు కలెక్టర్ ప్రియాంక, ఆ పూడుకుపోయిన మెట్లబావిని పునరుద్ధరించటానికి పూనుకొన్నారని, ఆ పనిని తన ఆధ్వర్యంలో నిర్వహించమని కోరారని, మెట్లబావి ఒక వైపున్న మండపం ఒక అంకణాన్ని కాంక్రీటుతో పునరుద్ధరించారని పూడికతీయటంతో పాటు, ఆ కాంక్రీటు కప్పులను తొలగించి, రాతితోనే దాన్ని మునుపటిలా తీర్చిదిద్దటానికి శిల్పుల్ని రప్పించి, ఆ పనిలో సహకరించమని కోరారు. అందుకోసం ఒకసారి, ఆ బావిని చూడాలన్నారు. అక్కడున్న బావి, పూడిక తీస్తున్న దృశ్యం, గ్రామంలోని చెన్నకేశవాలయం ఒక చక్కటి గణేశ విగ్రహం ఫొటోలు కూడా నాకు చూపించారు. ఇక ఆ వూరికి వెళ్లాలి. అందుకుగాను 20వ తేదీన వెళదామనుకొన్నాం. ఆ రోజు మంత్రి జగదీశ్వరరెడ్డి కూడా వస్తారని చెప్పారు. మా ప్రోగ్రాం ఖరారైంది.

ఇంతలోనే, 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ శ్రీలంకకు వెళ్లాలని తెలంగాణా పర్యాటక శాఖామాత్యులు శ్రీ వి. శ్రీనివాసగౌడ్ కూడా శ్రీలంకకు వస్తున్నారని బుద్ధవనం ప్రాజెక్టు ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య నాకు ఫోన్ చేశారు. హైదరాబాదు నుంచి కొలంబోకు 20న వెళ్లి, 26న తిరిగి వచ్చేలా టికెట్లు బుక్కైనాయి. దీంతో నేను 20వ తేదీన సూర్యాపేట దగ్గరి ఆత్మకూరు వెళ్లే కార్యక్రమానికి ఆటంకమొచ్చింది. ఈలోగా, లాంకోహిల్స్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, వాళ్లవూరు మంగళగిరి దగ్గర కాజకు రమ్మని ఆహ్వానించారు. అదే సమయంలో సెప్టెంబర్ 18, వినాయకచవితినాడు, విజయవాడలో ప్రముఖ హేతువాది డా. దేవరాజు మహారాజుకు సత్కారం. ఆయన పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం, ఎం.బి. విజ్ఞానకేంద్రంలో జరుగుతుందని, ఆవిష్కర్తగా నన్ను రమ్మని, విజయవాడ బుద్ధవిహార కార్యదర్శి, నా మిత్రుడు, శుభాకర్ మేడసాని ఫోన్ చేసి, నన్ను ఒప్పించారు. ఇక పండుగనాడు విజయవాడకు నా ప్రయాణం ఖాయమైంది. వెంకట్రామిరెడ్డి గారికి కూడా చెప్పాను. ఆయన సరేనన్నారు. ఈ విషయాన్ని కల్పనా రమేష్ గారికి చెప్పి, 18న ఆత్మకూరు వెళదామా అని అడిగితే తనకు కుదరదని, నన్ను వెళ్లి ఆ బావిని చూచి, శిల్పితో మాట్లాడమని చెప్పింది.

ఆ రోజు వినాయకచవితి. ఉదయం 9.00 గం.లకు ఖాజాగూడలో వెంకట్రామిరెడ్డి గారి కారులో బయలుదేరాం. చిట్యాల వెళ్లేసరికి మంత్రి జగదీశ్వరరెడ్డి గారి పి.ఎస్. శర్మ నాకు ఫోన్ చేసి, మిమ్మల్ని మంత్రిగారు వారింటికి రమ్మంటున్నారని చెప్పారు. మంత్రిగారి ఇంటికెళ్లేసరికి ఆయన, సతీమణితో కలసి వినాయకపూజలో ఉన్నారు. కొంచెం సేపటికి పూజ అయిపోయింది. మంత్రిగారితో టిఫిన్ చేసేప్పుడు, మనం ఆత్మకూరువెళ్లి మెట్లబావిని చూచొద్దామన్నారు. ఆయన కారులోనే వెళ్లాం. ఆత్మకూరులోని చెన్నకేశవాలయానికి వెళ్లాం. చరిత్ర అడిగారు. గర్భాలయంలోని చెన్నకేశవుడు క్రీ.శ.16వ శతాబ్ద విగ్రహమని, ఆలయం క్రీ.శ. 18వ శతాబ్ద నాటిదని చెప్పాను.

తరువాత, మెట్లబావి (కోనేరు) దగ్గరికెళ్లాం. దాదాపు 100 మందికి పైగా జనం అక్కడికొచ్చారు. ఈ బావిని బాగుచేద్దామను కొంటున్నామనీ కల్పనారమేష్ గారికి ఈ విషయంగా సహకరించమని జగదీశ్వర రెడ్డి గారు నాకు చెప్పారు. పై నుంచి బావిని చూచి, కిందికి దిగి, కోనేరు మండపాన్ని పరిశీలిస్తున్నాను. మంత్రిగారు కూడా కిందికి దిగి, కలియ జూశారు. ఆ మండపం, బావి కూడా క్రీ.శ. 18వ శతాబ్దినాటివేనని, అయితే మండప స్థంభాల్లో రెండు స్థంభాలు క్రీ.శ.13వ శతాబ్దివని చెప్పగా, మంత్రిగారు ఆ రెండు స్థంభాల్ని తడిమిచూశారు. దానిమీదున్న ఒక శృంగార శిల్పం కాకతీయ శైలికి అద్దం పడుతుందని చెప్పాను.



కోనేరు పైకొచ్చిన నేను, మంత్రిగారితో కలసి మరో వీధికెళ్లాం. అక్కడొక చక్కటి రెండు చేతుల వినాయక విగ్రహం రోడ్డు కంటే రెండు అడుగుల లోతున ఉంది. తలపై కిరీటం లేదు. లలితాసనంలో కూర్చొని, ఒక చేతిలో దంతం, మరో చేతిలో మోదకం (లడ్డు) పొట్టపై నాగయజ్ఞోపవీతంతో ఉన్నాడు. ఆ విగ్రహం, పక్కనే ఉన్న మరో బావిలో పూడిక తీస్తుండగా బయటపడిరదని గ్రామస్తులు మంత్రిగారికి వివరించారు. మంత్రిగారు, ఈ వినాయకవిగ్రహం ఎప్పటిదని అడిగారు. శిల్పశైలిని బట్టి ఇది రాష్ట్రకూటులు, కళ్యాణీ చాళుక్యుల మధ్యకాలమైన క్రీ.శ. 9వ శతాబ్దిని చెప్పాను. ఇప్పటికి 1200 సం? నాటిదని, ఆత్మకూరుకు 12 శతాబ్దాల చరిత్ర ఉందని



చెబుతున్నప్పుడు గ్రామస్తుల్లో ఆసక్తిరేగి, గుసగుసలు మొదలైనాయి. బావి దగ్గర చేపట్టాల్సిన పనుల్ని గురించి చర్చించుకొన్న తరువాత, సూర్యాపేట నుంచి విజయవాడ మీదుగా, కాజ గ్రామానికి ప్రయాణమైనాం.

మూడు గంటల తరువాత కాజ చేరుకొన్నాం. గ్రామం లోపల ఒక బజారు లోపల మా కారాగింది. ఇదే మా ఇల్లు. రండి లోపలికెళ్లి భోంచేద్దామన్నారు వెంకట్రామిరెడ్డి. ఇంటిముందు విశాలమైన ప్రాంగణం. పెద్ద పెద్ద చెట్లు. అటూ ఇటూ క్రోటన్లతో నడవ. చెట్ల నీడన కుర్చీలు. లోపలికొస్తున్న మాకు ఒక పొడవాటి చక్కటి పెంకుటిల్లు స్వాగతం పలుకుతుంది. వసారాలో ఉన్న ఫోటోల్లో కాజ గ్రామానికొచ్చిన అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డిగారు, ఒక సాదా



కొయ్య కుర్చీలో కూర్చొని ఉన్నారు. ఇంకా ఇద్దరో ముగ్గురో నాయకులతో పాటు ఆ గ్రామసర్పంచి వెంకట్రామిరెడ్డి గారి నాన్నగారు కూడా ఉన్నారు. కాజలో జరిగిన ఒక సభలో ముఖ్యమంత్రి మామూలు కొయ్యకుర్చీలో కూర్చొని
ఉన్నారు. పైనెలాంటి అచ్ఛాదనాలేదు. నాకు ఇప్పటి ముఖ్యమంత్రుల సభల హంగూ, ఆర్భాటాలు గుర్తుకొచ్చి, అలనాటికి, ఈనాటికీ గల తేడా కొట్టొచ్చినట్లు కనబడిరది. మరో పెద్దఫొటో ఫ్రేంలో చేతిలో తుపాకు, కోటు, తలపాగా ధరించి, మూతి మీద పౌరుషానికి ప్రతిరూపమైన పోతు మీసాలున్న వెంకట్రామిరెడ్డి గారి తాత గారి ఫోటో అలనాటి భూస్వామి హుందాతనాన్ని వెల్లడిస్తుంది. ఇంటిలోపలికెళ్లాం. అప్పటి భోషాణం పెట్టె, పందిరిమంచం, పిల్లల ఊయల, పూజగది, కొయ్యపలకలపై పెంకులతో కప్పు, ఎంతహాయిగా ఉందో. ఈ ఇంటిని మాత్రం ఇలానే కాపాడండని చెప్పేలోపే భోజనాలు సిద్ధమైనాయి. చాన్నాళ్ల తరువాత గుంటూరు జిల్లా దోసకాయ పచ్చడి, ఉప్పుకారం పప్పు, బెండకాయ ఇగురు, కాకరకాయ వేపుడు, పప్పుచారు, గట్టి పెరుగుతో దబ్బకాయ నంజుకొంటూ, మధ్యమధ్యలో ఊరమిరపకాయ కొరుకుతూ ఆరగిస్తుంటే, స్వర్గానికి బెత్తెడు ఎత్తులో విహరిస్తున్నట్లుంది. కూరగాయలన్నీ ఆ పెరట్లో పెరిగినవే. లేచి చేయికడుక్కుందా మనుకొంటే, చెట్టు మీద పండిన అరటి పండునందించారు. తినే లోపు జోరుతాగండని గాజుగ్లాసు నందించారు. పొట్ట ఇంకాస్త పొడుగు పెరిగితే బాగుండనిపించింది. చక్కటి ఇంటి భోజనాన్ని వండిపింపజేసిన వెంకట్రామిరెడ్డి గారిని నా కళ్లల్లో నిండిన ఆనందంతో కృతజ్ఞతలు చెప్పాను. ఇంట్లోంచి బయటికొచ్చిన నాకు



చెట్టు నిండాకాచిన ములక్కాయలు కవ్విస్తున్నాయి. పెరట్లో అరటి చెట్లకు సగం పండిన కాయలు, నేలమీద అల్లుకున్న దోసపాదుల్లో కోసుకోంఢ్రా అంటున్న దోసెడంతటి దోసకాయలు, కమ్మని సువాసన వెదజల్లుతున్న కరివేపాకు, నిజంగానే నాజుగ్గా, నవనవలాడుతున్న సన్నటి బెండకాయలు, తెలిసిందిగా మమ్మల్ని లేడీస్ ఫింగర్స్ అని ఎందుకంటారోనని కొంటెగా మమ్మల్ని టెంప్ట్ చేస్తుంటే, తట్టుకోలేక రెడ్డిగారూ, వీటన్నింటినీ నాకు మూటకట్టిస్తానని మాటిమ్మన్నాను. ఆతిథ్యానికి, ఆప్యాయతకు మారుపేరైన ఆయన చిరునవ్వును రువ్వారు. ఇక కాజలోని గుళ్లను చూడటానికి బయలుదేరాం.

ముందుగా మూలస్థాన అగస్త్యేశ్వరాలయానికి వెళ్లాం. చక్కటి ప్రవేశద్వారం, మహామండపంలో కాకతీయ స్థంభాలు, ద్వారంగోడలపై మకరతోరణం, చిన్న స్థంభాలు, ఆలయ నమూనా, కప్పు వరకూ ఎర్ర ఇసుకరాయి, ఆపైన ఆధునిక విమానము. ఆలయంవద్ద గల కాకతీయ సామ్రాజ్ఞి రుద్రమదేవి క్రీ.శ. 1269 నాటి నందిస్థంభ శాసనం, ఆ ఆలయాన్ని కాకతీయ వాస్తు శైలిలో నిర్మించినట్లు తెలియజేస్తుంది. విశాల ప్రాంగణం. అధిష్ఠానం రెండు వరుసలు భూమిలో కూరుకుపోయాయి. ఆలయానికి కుడి వైపున కాంపౌండు పక్కనే,

కాకతీయుల కాలపు మహిషాసురమర్ధిని, భద్రకాళి, కార్తికేయ, బ్రహ్మ, వీరభద్ర, చండీశ, క్రీ.శ. 16వ శతాబ్దికి చెందిన ఆంజనేయ, గణపతి శిల్పాలు, గ్రామ చరిత్రకు అద్దం పడుతున్నాయి. ఆలయం గోడపైన విజయనగర రాజ చిహ్నమైన కత్తి, వరాహాలున్నాయి. మరో పక్క భిన్నమైన సప్తమాతల విగ్రహాల్లో కొన్ని ఉన్నాయి.

ఆ తరువాత కోదండరామాలయానికెళ్లాం. ప్రవేశించగానే, ఎడమవైపుని నాలుగు స్తంభాల మండపం, విరిగిన భక్తాంజనేయ విగ్రహాలను చూచి గుడి చుట్టూ ప్రదక్షిణ చేస్తుంటే, ఆలయ గోడల కోష్టాల్లో క్రీ.శ. 12వ శతాబ్దినాటి చెన్నకేశవ, జనార్ధన, నారాయణ విగ్రహాలున్నాయి. నైరుతి దిక్కున ఒక నిలువెత్తు శాసనం. క్రీ.శ.1144వ సం? నాటి చందోలు నుంచి పాలించిన వెలనాటి చోళరాజు కులోత్తుంగ రాజేంద్రచోడ మన్మరాజు శాసనముంది. అందులో పిన్నమ్మ జియ్యంగారు కళ్యాణ కేశవస్వామి అర్చనలకు ఎర్ర చెరువు వెనుక 3 పుట్ల భూమిని దానం చేసిన వివరాలున్నాయి. ఈ శాసనాన్ని బట్టి ఈ దేవాలయం కోదండరామాలయం కాదని, కళ్యాణ కేశవాలయమని తెలుస్తుంది. కళ్యాణ కేశవాలయం, రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదొక్కటే.



అదే శాసన స్థంభంపైన క్రీ.శ.1269 నాటి కాకతీయ రుద్రమదేవి శాసనం కూడా ఉంది. అందులో, రుద్రమదేవి అంగరక్షకుడైన బొల్లినాయుడు, సానిమాన్య నిబంధన కోసం 10 పుట్ల భూమిని దానం చేసిన వివరాలున్నాయి. అగస్త్యేశ్వరాలయం లోను మరో శాసనంలో లింగమనేని మాదానేండు మొదలైన 24 కులాల వారికి పుణ్యంగా దొడ్డారెడ్డి వేమారెడ్డి, రాయ వినోది వీరపకొండయ్యల సంతకంతో దానం చేసిన వివరాలున్నాయి. ఈ శాసనంలో లింగమనేని వంశీకులు తొలిసారిగా ప్రస్తావించబడినారు. అంతేకాదు, రాయ వినోది అంటే రాజులకు వినోదాన్ని కలిగించటమే వృత్తిగా గల వారు ఉండేవారని తెలుస్తుంది.

ఆలయాలన్నీ తిరిగిన తరువాత, పోలేరమ్మ ఆలయాన్ని చూచిన నాకు కాజ గ్రామానికి చెందిన తరంగ సాహిత్యకారుడు నారాయణ తీర్థుల ఇల్లెక్కడ అని అడిగాను. వెంకట్రామిరెడ్డి, వాళ్లింటికెళ్లే దారిలో ఒక ఇల్లు చూపించారు. ఆ ఇంట్లో పెస్టిసైడ్ షాపు నడుస్తుందని తెలిసి అవాక్కయ్యాను. తరువాత నేషనల్ హైవే పక్కనున్న నారాయణ తీర్థుల ఆలయాన్ని చూచి కొంత ఊపిరిపీల్చుకొన్నాను. ఇంతలో విజయవాడలో మీటింగ్ టైమైందని ఫోన్ రాగా, కారెక్కేలోపల కూరగాయల మూటనిచ్చి, మాట నిలబెటుకొన్నారు వెంకట్రామిరెడ్డి. శాసనాల్లో కాజ పేరు క్రాంజపట్టణమని పేర్కొనటాన వెయ్యేళ్ల నాడు అదొక వ్యాపార కేంద్రమని తెలిసింది. అ

**కవిత**

## జీవన్మృతులు

పుట్టిన మట్టిని ప్రేమించలేనివాళ్ళకు
కన్నతల్లికి నమస్కరించలేనివాళ్ళకి
ఎలా చెప్తే అర్థమౌతుంది?

మూడురంగుల దేదీప్య దీపాలు
దేశమంతా వెలుగుపూలు పూయిస్తుంటే
ఆత్మీయంగా పులకరించని మనసుకు
ఇక్కడి గాలిని శ్వాసించే అర్హత ఉంటుందా...

తులతూచలేని పూర్వీకుల బలిదానాలను తలదాల్చకపోతే
ఇక్కడి నీటిని సేవించే నైతికత ఉంటుందా

మన సైనికుల యూనిఫాం అంటే
ప్రాణాలను జెండాధ్వజానికి మీదుకట్టటమేగదా...

మన పోలీసుల యూనిఫాం అంటే
ప్రజారక్షణకు సూత్రం కదా...

పుట్టిన ప్రతి మనిషి
ఒక కులాన్నీ..మతాన్నీ
రుద్దించుకున్న ఆజైలుగదిలోనే
అంగుళాల ప్రమాణంలో
అణగారి పోతున్నాడుకదా...

అమ్మనుడి అమృతంలా నాలుకపై
నర్తించకపోతే
బతికి ఉన్నట్లు ఋజువుంటుందా?

'నేను' అనుకున్నంత ప్రేమగా
'మనం' అనలేని స్వార్థబలహీనులను
ఈనుతున్న నేలమీద
అడుగులేస్తుంటే అవమానంగా ఉంది

ఈభూమిపై కొద్దికాలమే మనగలిగే మనిషీ
అమ్మనీ అమ్మనేలనీ అమ్మభాషనీ
హత్తుకోలేకపోతే శ్వాస ఆగిపోకపోయినా
జీవన్మృతులమే....
దేశానికీ చరిత్ర పుటలకూ బరువులమే!

డా.సి.భవానీదేవి కోటంరాజు 9866847000

సుంకర గోపాలయ్య
9492638547

# మన కాలపు విమర్శకులు

**పరిచయం:** తెలుగు సాహిత్యంలో విమర్శ లేదు అని అనుకుంటూ ఉన్న సందర్భంలో డాక్టర్ పాపినేని శివశంకర్, ఆచార్య మేడిపల్లి రవికుమార్ కె. పి అశోక్ కుమార్ లాంటి వారు తమదైన చూపుతో సాహిత్యాన్ని కొలిచే ప్రయత్నం చేశారు. పాపినేని ఇటు కవిత్వము, కథ రెండింటిలోనూ ద్రవాధునికత సిద్ధాంతం ద్వారా, మేడిపల్లి మార్క్సిస్టు, ప్రపంచీకరణ ద్వారా సాహిత్యంలో వచ్చిన పెను మార్పులను హెచ్చరించడం ద్వారా, అశోక్ కుమార్ సమకాలీన కథ, నవల ప్రక్రియలను అంచనా వేయడంలోనూ కృషి చేశారు.

"కవిత్వానికి కవి యివ్వాల్సిందేమిటి? బహుశః తన రక్తమాంసాలివ్వాలి. సొంత భాషనివ్వాలి. అంతిమంగా తన ప్రాణమివ్వాలి. కవితకి భావాలు, భావ చిత్రాలు, అలంకారాలు ఇవ్వటం వేరు. ఇవి బాహ్య విషయాలు మాత్రమే. కవి రక్తమాంసాల్ని హరించినప్పుడే కవిత జవజీవాలు పొందుతుంది. ఒక మహాశిల్పం రూపొందించిన తర్వాత అంతిమంగా దానికి ప్రాణరేఖ చెక్కే శిల్పిలాంటి వాడే కవి. ప్రతి గొప్ప కవిత ప్రాణమున్న వ్యక్తి"
– పాపినేని శివశంకర్.

పది కాలాలపాటు నిలబడే కవిత్వం గురించి శివశంకర్ వ్యాఖ్యానం ఇది. ఈ వాక్యాలు చెప్పడానికి శివశంకర్ గమనింపు ఏమిటి ? ఎక్కడ నిలబడి మాట్లాడుతున్నారు? ఎన్ని అధ్యయనం చేసి ఉండాలి? నాలుగు పుస్తకాలకు సమీక్షలు రాసి ప్రముఖ విమర్శకులుగా చెలామణీ అవుతున్న ఈ కాలంలో తెలుగు సాహిత్య 'విమర్శకు శివశంకర్' ఏమి ఇచ్చాడు? అనే ప్రశ్న వేసుకున్నప్పుడు 'సాహిత్యం– మౌలిక భావనలు సిద్ధాంత గ్రంథం, ద్రవాధునికతను తెలుగు సాహిత్యానికి అన్వయించడం, నిశాంత పేరు మీద అందించిన సాహిత్య తాత్విక వ్యాసాలను మనం పరిశీలించినప్పుడు... కొన్ని అన్వయాలను, కొన్ని భావనలను, ధిక్కారం నిసర్గత లాంటి సాహిత్య సారాంశాన్ని తవ్వితీసే సాధనాలను రూపొందించటానికి కృషి చేసినట్టు తెలుస్తుంది.

'మనిషి–ప్రకృతి–సమాజం' అనే త్రికానికి సంబంధించిన సారాంశాన్ని రచయిత అర్థం చేసుకొని, ఆవిష్కరించగలగాలి. అలాంటి విలువను కూడా విమర్శకులు వెలుగులోకి తేవాలి, విలువలేని సాహిత్యాన్ని తూర్పారబట్టగలగాలని శివశంకర్ అంటారు. ఏది మంచి రచనలో, ఏది కాదో, ఎందుకు కాదో అనే ఎరుక శివశంకర్ కి ఉంది.

'విమర్శకుడు అనగానే పనిగట్టుకొని లోపాలు వెతకడం కాదు. మంచిచెడుల వివేచన ఉండాలి. సంయమనం ఉండాలి. దారి తప్పిన రచనకు... మార్గదర్శనం చేయాలి. వస్తువు, శిల్పం, అభివ్యక్తి, రూపం లాంటి నాలుగు పడికట్టు మాటలతో రచనని చూడటం శివశంకర్ కి తెలియదు. ఆయన చదువుకున్న సిద్ధాంతాలకు, అధ్యయనం చేసిన రచనలకు సొంత ఆలోచన జోడించి తనదైన చూపుతో విమర్శ రాశారు.

**ఉదాహరణకు:**

కవిత్వీకరణకు సంబంధించి ప్రాచీనులు ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం అనే మూడు హేతువులు అవసరం అన్నారు. ఇవాళ కవిత్వం రాస్తున్నవారికి ప్రాథమికంగా మూడు మౌలిక విషయాలను శివశంకర్ సూచిస్తున్నారు. అవి 1. భావబలం 2. భావనాబలం 3. భాషాబలం ... కవిత్వ విమర్శకుడిగా ఆయన చేసిన మరికొన్ని పరిశీలనలు చూస్తే.

1. కవిత్వం వైయుక్తికాన్ని సామాజిక దృక్పథం నుంచి విలువ కట్టే ఆలోచనా ధోరణి ప్రవేశించింది. అంతిమంగా ప్రతి విషయంలో మానవీయతను మన్నించే సుగుణం ఇప్పటి కవిత్వంలో ఉంది.
2. ఇవాళ కవిత్వంలో కనబడే ఒక ప్రధాన లక్షణం బహుముఖీనత. ఇక్కడ మహాకవి పదవులు, ఏక నాయకత్వాలు లేవు. ఏక సమయంలో ఎన్నో గొంతులు కలివిడిగా, విడివిడిగా వినిపిస్తున్నాయి. వస్తువు విస్తృతమైనది. కవిత్వాకాశ వైశాల్యం పెరిగింది.
3. దేశీయత లేదా స్థానీయత ఇప్పటి కవిత్వంలో ఒక ముఖ్యాంశం అయింది.'విశ్వం నుంచి నాదాకా' అనే సూత్రం ముందుకొచ్చింది.
4. సొంత భాషని ఎంతగా లీనం చేసుకుంటే ఆ కవి కవిత్వం అంత నిసర్గంగా ఉంటుంది.
5. కవిత్వమంటే భాష యొక్క ఉన్నత వ్యక్తీకరణ కాదు. అందమైన అభివ్యక్తి కాదు. పదచిత్రాలు, భావ చిత్రాల పోహళింపు కాదు. జీవితాన్ని తార్కికంగా కాదు, తాత్వికంగా వివేచించాల్సిన కర్తవ్యమేదో కవిత్వానికుంది. ఇలా చాలా సూక్ష్మస్థాయి నుంచి ఉన్నతంగా ఆయన దృష్టి ఉంటుంది.

ఇకపోతే జిగ్మంట్ భౌమన్ చెప్పిన లిక్విడ్ మోడల్‌ని 'ద్రవాధునికతగ శివశంకర్ మనదైన జీవన విధానాలకు అనుగుణంగా అన్వయం చేశారు. శరవేగంగా మారుతున్న సమాజాన్ని అర్థం చేసుకోవడానికి 'ద్రవాధునికతను ఒక పరికరంగా మన ముందుంచారు. వ్యక్తి, ప్రకృతి, సమాజం.. వీటిని వ్యాపారమయం చేసిన తీరు తెలిపారు. మనం ఒక ప్రవాహంలో పడిపోయాం. అది క్షణక్షణం మారిపోయే ప్రవాహం. రూపం మార్చుకున్న ప్రవాహం. ఎక్కడా విలువలు కనిపించవు. కొత్తదనంపై తీవ్రమైన మోజు, అర్ధరాహిత్య జీవనం, అమానవీయత, మానవ దూరం.. ఇవన్నీ ద్రవాధునికతలో భాగం.

**ఆయన మాటల్లో ద్రవాధునికత లక్ష్యం ఇది –**

'ఇవాళ ముఖ్యంగా నాగరిక, విద్యాధిక, ధనాధిక, కార్పొరేట్ వర్గ జీవన విధానంలో ద్రవాధునికత తెచ్చిన సరికొత్త మార్పు తేలిగ్గా గుర్తించగలం. అది మ్రోగించే ప్రమాదఘంటికలు వినగలం. రకరకాల (అడ్డ)దారుల ద్వారా ఉరువైన నూతన సంపన్నవర్గం ఏర్పడింది. దానికి కరెన్సీ స్విమ్మింగ్ పూల్ లో ఈదడం మహానందం. స్వసుఖ జీవనంతో

తప్ప దానికి ఏ సామాజిక, వైయక్తిక విలువల పని లేదు”

'ద్రవాధునికత స్థితిని దాటేందుకు కూడా ఆయన కొన్ని పరికరాల్ని చూపారు. తెలుగు సాహిత్యంలో ద్రవాధునిక ప్రతిఫలనాలను జాబితాగా ఇచ్చారు. ప్రకృతిలో మైత్రి, సామూహికం, పురానవం, నిరహంకారం, నిబ్బరం, సృజనాత్మకత లాంటి విలువైన మార్గాలు చూపారు. ఆయన ద్రవాధునికతను ఒక పనిముట్టుగా చేసుకున్నారు. దాని సాయంతో సమాజంలోని స్థితిగతులను వ్యాఖ్యానించి, మనం ఇంకా ఎంత మంచి మనుషులుగా మారాల్సి వుంటుందో గుర్తు చేశారు. ఇందులో చాలా చక్కని ఉదాహరణలు ఇచ్చారు. అక్కడక్కడ తొంగిచూసే వ్యంగ్యం మనల్ని ముందుకు తీసుకుపోతుంది. మానవ జీవితం ఎట్లా ఉంది ? ఎట్లా ఉండాలి అనే వైరుధ్యాన్ని పరిష్కరించే దిశగా రచనలు సాగాలని ఈ విమర్శకుడి ఉద్దేశ్యం. ప్రపంచీకరణ సారాంశాన్ని, పతనీకరణ సారాంశాన్ని గుర్తించి ఎరుకతో ఎలా జీవించాలో హెచ్చరిస్తున్నారు. జీవితం పట్ల ప్రేమ, సామాజికాభ్యుదయం గురించి తపన, సిద్ధాంతబలం,సూత్రజాజ్ఞానం కలిగిన రచయితలు గొప్ప రచనలు చేయగలరని శివశంకర్ విశ్వసించారు. సాహిత్యంలో జీవితం గురించే కాదు, జీవితంలో సాహిత్యం గురించి కూడా మాట్లాడుకోవాల్సిన అవసరాన్ని గుర్తించిన విమర్శకుడు పాపినేని.

ఆయన తన విమర్శకు భూమికగా మార్క్సిజాన్ని చేసుకున్నారు. సాహిత్య పరిశీలనకు తత్వశాస్త్రం, చరిత్ర, సామాజిక శాస్త్రం మొదలైన శాస్త్ర సాధనాల్ని, పరిభాషని గ్రహించారు. సాహిత్యంలో మౌలికాంశాలను చాలా స్పష్టంగా నిర్వచించించారు. నిర్ధారణ చేశారు. అవిచ్ఛిన్నత, అస్పష్టత, సంక్లిష్టత లాంటి అంశాలను కూడా విశదీకరించే ప్రయత్నం చేశారు.

ఆయన దృష్టిలో భాషంటే కేవలం భావానికి మాధ్యమం కాదు. ఒక నోటి నుండి మరొక చెవికి, ఒక కలం నుండి మరొక కంటికి అక్షరాలను అందించే ఆధారం కాదు. ఒక జాతి ఉనికి నుంచి ,మనికి నుంచి వ్యక్తికందిన జీవన సంపదను ఇతరులకు అందించే పళ్లెం కూడా. కనుక కవిత్వం రాసే కవి భాష పట్ల ఎంత జాగురూకత తో ఉండాలో పదేపదే హెచ్చరిస్తారు. పాతమూసలను బద్దలు గొట్టాలని, సరికొత్త అభివ్యక్తిని సాధించాలని సూచనలు చేస్తారు. మంచి కవిత్వం ఒకప్పుడు అనుకోకుండా రావచ్చు. కానీ గొప్ప కవిత్వం గొప్ప అధ్యయనం తోనే వస్తుందని ప్రగాఢంగా నమ్ముతారు. నేటికవులు తల్లిభాషను, సొంత భాషను కచ్చితంగా ఆకళింపు చేసుకుని కవిత్వం రాస్తే పదికాలాల పాటు నిలుస్తుందని బాధ్యతగా దారి చూపుతారు.

**ఆయన రచయితలకు ఎంత స్పష్టంగా మార్గదర్శనం చేస్తారంటే**

నిజానికి రచయిత ఎప్పుడూ సాధకుడే గానీ బోధకుడు కాదు. రకరకాల వాదాల గురించి కవి ఆవేశంగా రాస్తున్నప్పుడు అంతిమంగా అవి పాఠకుడి మనస్సును విశాలం చేస్తున్నాయా లేక సంకుచితం చేస్తున్నాయా అని ఆలోచించాలి. ఏ వాదమైనా దేనిమీదైనా కోపించవచ్చు గానీ ద్వేషాగ్ని ని పెంచకూడదు. సంస్కార పరిణతిని పెంచాలి. పాఠకుడి లోని ఏకాకితనం తొలగించాలి, రచన చదివాక పాఠకుడు శక్తిమంతుడు కావాలని అంటారు.

విమర్శకుడిగా ఆయన ఎక్కడా సంయమనం కోల్పోడు. రచనలో ఉన్న గొప్పకి గానీ తప్పుకుగాని సాక్ష్యాలు చూపుతాడు. సత్యప్రకటన చేయగలరు. సమదర్శనం కలిగివుంటారు. గుణదోష విచారణ శక్తి ఉంది. ఆవేశంతో ఊగిపోడు. రచయిత శాసన కర్త కాదు. సూచనకర్త మాత్రమే అని కుండ కాదు కొండ బద్దలు కొట్టి చెప్పగలరు. జీవితం నుండి రచన జీవితంలోకి ఇంకిపోవాలని బలంగా నమ్ముతారు.కంటితడి, గుండెతడి లేని మనుషులు పెరుగుతున్న సందర్భంలో ప్రక్షాళన చేయగలిగే రచనలను విమర్శకుడి గా ఆయన ఆశిస్తున్నారు. ఆయన కథా విమర్శ కూడా చేసారు. ప్రస్తుతం కవిత్వ విమర్శ గురించి మాత్రమే రేఖా మాత్రంగా తెలిపే ప్రయత్నం చేశాను.

## విభిన్న విమర్శకుడు మేడిపల్లి:

విమర్శకుడిగా రవికుమార్ గారిది మైక్రోస్కోపిక్ దృష్టి. వేదిక ఎక్కాక ఉపన్యాసం గాలి వీచినంత సహజంగా అలలా సాగిపోతుంది. ఆయన ఉపన్యాసం విన్న ప్రేక్షకులు చాలా మెరుగుపడతారు. ఆలోచిస్తారు.

చేతిలో ఏ కాగితం లేకుండా మాట్లాడగలగడం, కోట్ చేసే కవితల్ని తడుముకోకుండా చెప్పడం, ఏ ప్రక్రియ లోనైనా విశ్లేషణ చేయగల శక్తి, శ్రీశ్రీ మీద ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఆయన ఉపన్యాసాలు గొప్పగా ఉండేవి. పరిశోధనాపర్యవేక్షణలో ఆయన చూపు మరీ స్పష్టం ఐపోతుంది. కొన్నిసార్లు కష్టం అనిపించినా, ఆయనేమీ మోహమాటానికి పోడు. ఆయన పర్యవేక్షణలో పరిశోధన చేస్తున్న పరిశోధకుడిని, వైవా జరిగే సమయంలో ఆశ్చర్యకరంగా ఆయన ప్రశ్నలు వేసేవారు. అదిగో అంత పుటం పెట్టేవారు. ఆయన పర్యవేక్షణలో జరిగిన పరిశోధనలు భీముని భాగం గొప్పవి. సమగ్రాంధ్ర సాహిత్య చరిత్ర నిర్మాణంలో ఆరుద్రతో కలిసి పనిచేసిన అనుభవం వారిది.

కేవలం కాలక్షేపం కోసమో సామాజిక హోదా కోసమో బిరుదులు, అవార్డులు పొందడం కోసమో కలం పట్టుకునేవాడు ఆధునిక కవి కాదు. సమాజం పట్ల బాధ్యత, విధానాల పట్ల ఒక నిబద్ధత కలిగి ఉండడం ఆధునిక కవి ప్రధాన లక్షణం అని రవికుమార్ భావిస్తారు. ఆయన ఆధునిక, ప్రాచీన కవిత్వాన్ని చాలా ప్రత్యేకమైన చూపుతో అంచనా వేయగలరు. కవిత్వాన్ని తూచే రాళ్లు చలం నా దగ్గర లేవన్నాడు గాని రవికుమార్ దగ్గర ఉన్నాయని కచ్చితంగా చెప్పవచ్చు. ఆయన నోటి వెంట, కలం వెంట కవిత్వ విమర్శ గురించి, కథ నిర్మాణం గురించి, నవల విశ్లేషణకు సంబంధించి ఒక వాక్యం వస్తే ఆషామాషీగా రాదు, అనేక తూకాలు లోలోపల ఆయనే వేసుకుని ఒక నిర్ధారణ చేస్తారు.

వస్తు వైవిధ్యం లోతుగాను, శిల్ప వైశిష్ట్యంఎత్తుగాను ఉండాలని ఆయన ఆశిస్తారు. అంతర్మథనంలో ఒక వస్తువు నలుగుతున్నంతవరకు, అది రూపం సంతరించుకునే అంతవరకు స్వీకరించింది,ఏదైనా అది కవి సొంతం. ఒక వస్తువు ఒక ఆకృతిని పొందాక, కావ్యలోకంలోకి కాలు మోపాక దానిని తర్వాత పాఠకుడు పర్యావలోకిస్తాడు అని గట్టిగా నమ్ముతారు. నిజమైన కవిత్వాన్ని పాఠకుడు సొంతం చేసుకుంటాడని, ఆ దిశగా కవి సాగాలని కోరుకుంటాడు.

పూటకో మాట మాట్లాడే సామాజిక బాధ్యత వహించని కవులను నిర్లక్ష్యం చేయమంటారు. సామాజిక ప్రయోజనాన్ని ఆశించి

కలం పట్టిన కవుల్లో వైవిధ్యం ఉండొచ్చు గానీ అంతర్ వైరుధ్యాలు ఉండకూడదు అని చెప్తూ సామాజిక వాస్తవాలను శాస్త్రీయంగా అర్థం చేసుకోవడం, వైక్తిక అస్తిత్వాన్ని వదులుకొని మానవుడు విశ్వ మానవుడు కావడం వంటి విషయాలను కవులు లక్ష్యంగా భావించాలని కోరుకుంటారు.

ప్రపంచీకరణ పంజరాల్లోకి మనం సుఖంగా వెళ్లిపోతున్న కాలంలో రవికుమార్ అనేక సభల్లోనూ సమావేశాల్లోనూ మానవ సంబంధాల పతనం, సాంస్కృతిక విధ్వంసం, ఆటపాటలను హైజాక్ చేసిన వస్తు సంస్కృతులు, సామ్రాజ్యవాదం, పరాయికరణ గురించి ఆ కాలంలో వెలబడిన కవులరచనల్ని, కథల్ని, నవలల్ని విశ్లేషిస్తూ చేసిన ప్రసంగాలు అద్భుతమైనవి. ప్రపంచీకరణ నేపథ్యంలో పొగ చూరిన ఆకాశం -అద్దేపల్లి విజన్ అనే 23 పేజీల వ్యాసంలో చాలా కీలకమైన విషయాలు ఆయన చర్చించారు.

మనుషుల కంటే మానవీయ విలువలు కంటే వస్తువులకు సరుకులకు ప్రాధాన్యం ఇవ్వడం, ఎక్కువగా వాటి మీదనే వ్యామోహం పెంచుకోవడం, మధ్యతరగతి జీవితాల్లో కూడా ఈనాడు ప్రవేశించింది. ఎవరైనా అతిథులు తమ ఇళ్లకు వచ్చినప్పుడు కుటుంబ సభ్యులను కాక ఇంట్లోని టీవీలను, ఫ్రిజ్ లను, సోఫాలను, డైనింగ్ టేబుల్స్ ను పరిచయం చేయడం వాటి విలువలను, ప్రాధాన్యతల్ని విశిష్టతల్ని గొప్పతనాన్ని వివరించడం ఈనాడు అతి సహజమైన అంశమైంది. వస్తు వ్యామోహ సంస్కృతి అంటే ఇదే అని చాలా సులభంగా ప్రపంచీకరణ పర్యవసనాలను తెలియజేస్తాడు.

మన ఓటు ద్వారా మనం ఎన్నుకున్న నాయకులు మనల్ని మన ప్రజాస్వామ్య దేశాన్ని పరిపాలిస్తున్నారని అనుకుంటాం కానీ వీళ్లంతా సామ్రాజ్యవాదం గుప్పెట్లోపెట్టుకున్న ఏజెంట్లు అని, మనకు వీళ్లు నాయకులు కావచ్చు కానీ వారి చేతుల్లో వీళ్లంతా కీలుబొమ్మలు మాత్రమే. ఆడేవాడు, ఆడించేవాడు అతడే. మనం కేవలం ప్రేక్షకులం మాత్రమే ఈ విషయం మనకు తెలియకపోవచ్చు. అలా తెలియకుండా ఉంచడమే ప్రపంచీకరణ ప్రధాన లక్షణం.

ప్రజల్ని కుహనా సంస్కరణ భ్రమల్లో ముంచి దేశాన్ని అతలాకుతలం చేస్తున్న ఈ ప్రపంచీకరణ విధానాల అసలు రంగు సామాన్య ప్రజలకు తెలియకపోవచ్చు, లాభాలను కూడపెట్టుకునే పెట్టుబడిదారులు స్వార్థం మూర్తీభవించిన నాయకులు తెలిసినా తెలియనట్లు నటించొచ్చు, కానీ మేధావులైన కవులు, కళాకారులు, రచయితలు ఈ పరిణామాలన్నిటినీ గమనిస్తూ దేశ ప్రజలను జాగృతం చేయాలని ఆయన అనేక సభల్లో పిలుపునిచ్చారు.

ఈనాటి సినిమా పాట స్వభావాలు-ప్రభావాలు (ప్రజాసాహితి- జూన్-2006) అనే వ్యాసంలో సినిమా కళగూడా పాలకవర్గాలకు పెట్టుబడిదారి వర్గాలకు అనుకూలంగానూ ప్రజా వ్యతిరేక కళారూపంగానూ మారడం ప్రపంచీకరణలో భాగమే అని చెప్పారు. పెట్టుబడిదారులను బడా పెట్టుబడిదారులుగాను, పేదలను నిరుపేదలుగాను రూపొందించి ప్రపంచీకరణ ప్రణాళిక ప్రభావం సినిమా రంగంపై ఎలా పడిందో సోదాహరణంగా వివరించారు. పురుషాధిపత్య భావజాలం, ఫ్యూడల్ భావజాలం, షకలక బేబీ సంస్కృతి, మార్కెట్ సంస్కృతి, మంటగలుస్తున్న మానవ సంబంధాలు, వికృతమైన పదబంధాలు సినిమా పాటల్లో ఎలా ఉన్నాయో విస్తృతంగా చర్చ చేశారు. సర్దార్ పాపారాయుడు సినిమాలోని '1980 వరకు ఇట్లాంటి ఒక పిల్ల నా కంట పడలేదు అనే పాట, 2002 లో జూనియర్ రామారావు ' రెండు వేల రెండు వరకు చూడలేదే ఇంత సరుకు' అని పాడుకున్నాడు. ఆ 40 ఏళ్ల కాలానికి 'పిల్ల సరుకు కావడమే ప్రపంచీకరణ' అని నివ్వెరపోయే సేట్‌మెంట్ ఇస్తారు.

జగదేకవీరుడు అతిలోక సుందరి సినిమాలోని అబ్బనీ తీయని దెబ్బ అనే పాట లో పురుషాధిక్యపు భావజాలం ఎలా ఉందో చూపుతారు. అలాగే నరసింహనాయుడు సినిమాలోని లక్స్ పాపా లక్స్ పాపా లంచ్ కొస్తావా అనే పాటలో నీ సోకులన్నీ లీజు కిస్తావా అని అడగడం లీజ్ అనేది వ్యాపార సంస్కృతికి చెందిన మాటని ఈ పాటలను నాయకుడు నాయిక అందాల లీజుకు మాత్రమే అడిగాడు. ఇది వ్యాపార సంబంధాలు పెనవేసుకొని పోవడం ప్రపంచీకరణ భావజాలంలోని పరాకాష్ట దశగా చూడాలంటారు. ఇలా ఆ కాలంలో విడుదలైన కొన్ని పాటలు తీసుకొని సమగ్రంగా ఆ వ్యాసంలో రవికుమార్ ఆవిష్కరించారు.

ప్రజాశక్తి ప్రచురించిన 'గమనం' అనే ప్రత్యేక సంచికలో వారు 'తెలుగు కవిత్వంలో మిథోపోయి' అనే వ్యాసంలో మిథో పోయి గురించి చాలా సమగ్రమైన విశ్లేషణ చేశారు. ఆ వ్యాసంలో వారు మైథాలజీ గాథలకి మిథోపోయికి ఉండే భేదాన్ని స్పష్టంగా చెప్పారు. దాని పూర్వాపరాలు చర్చించారు. తెలుగు కవిత్వ ఉద్యమాల్లో మిథో పోయి పద్ధతి ఎలా ఉందో ఉదాహరణలు చూపారు. కృష్ణశాస్త్రి రచించిన ఊర్వశి ఎలా మిథోపోయి పద్ధతికి చెందుతుందో వివరించారు. అలాగే నాయని సుబ్బారావు గారు రచించిన సౌభద్రుని ప్రణయ యాత్ర కూడా ఈ కోవకే చెందుతుందని చూపారు.

అభ్యుదయ కవిత్వంలో శ్రీశ్రీ మిథోపోయి అద్భుతంగా వాడుకున్నాడని తెలిపారు. శ్రీరంగం నారాయణబాబు రుధిర జ్యోతిలోని కపాల మోక్షం ఖండిక మిథోపొయి లక్షణాలు కలిగిన మొత్తం తెలుగు ఖండికల్లోనే ఎత్తుగా నిలబడగలిగిన కవిత అని తేల్చిచెప్పారు. ఇంకా దిగంబర విప్లవ దళిత మైనారిటీ వాదాల్లో ఈ పద్ధతి గురించి మంచి నిర్ధారణలు చూపారు. మిథో పోయి ఒక ఉద్యమంగానే వాదంగానే కాదు కవిత తన భావాన్ని వ్యక్తీకరించే ఒక పద్ధతి. అందులో ఉండే అనేక ప్రత్యేకమైన అంశాలను ఆ వ్యాసంలో మన ముందుకి తెస్తారు.

ఆయన అనేక సందర్భాల్లో అంబేద్కర్ దళిత తాత్వికతను గురించి మంచి వ్యాఖ్యానాలు చేశారు. కులరహిత సమాజం గురించి అంబేద్కర్ చేసిన హితబోధ దళిత వర్గాల్లో మాత్రం కొంత చైతన్యం కలిగించింది. ఇతరులు అంబేద్కర్‌ని ఇంకా అందుకోలేదు. విద్యావంతులు కొందరు గుర్తించినా అంబేద్కర్‌ను దళితోద్ధారకుడిగానే పరిగణిస్తున్నారు. మొత్తం సమాజానికి సంబంధించిన జాతీయ నాయకుడిగా ఇంకా గుర్తించలేదు. అంబేద్కర్‌ను గౌరవించడం అంటే దళితులను గౌరవించడం అని కుల నిర్మూలనను, కులరహిత సమాజాన్ని ఆశించడం అని ఆశించే స్థాయిలో మేధావులు భావించడం లేదని తెలియజేస్తారు. అలాగే దళిత దృక్పథానికి అంబేద్కర్ ఆలోచనలు ప్రధాన పునాదులు. ఏ సంస్కృతి దళిత జాతిని వివక్షకు గురి చేస్తూ ఉందో ఆ సంస్కృతిలో ఉన్నంతకాలం దళిత జాతి వివక్షల నుండి

విముక్తి కాలేదన్నది అంబేద్కర్ ఆలోచన. అందుకే ఒక ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించుకోవాలని అంబేద్కర్ దళిత జాతికి సూచించాడు. ఈ తాత్విక అంశాన్ని దళిత కవిత్వం రాసే కవులు గుర్తించాలని అంటాడు.

ఆయన అప్పుడప్పుడు కథలు మీద నవలలు మీద కూడా విస్తృతంగా మాట్లాడారు. కొన్ని కథ సంపుటాలకు నవలలకు ముందు మాటలు రాశారు. ఆ ముందు మాటల్లో కథ నిర్మాణం నవల నిర్మాణం గురించి గుర్తించదగిన ప్రతిపాదనలు చేశారు. రాసాని రచించిన చీకటి ముదులు నవలకు ముందుమాట రాస్తూ 'శాస్త్రీయత వాస్తవికత వంటి అంశాలు ఏ రచన కైనా దాని ఆయువు పట్టుకు ప్రమాణాలు. నవల, కథానిక వంటి కల్పనా సాహిత్యంలో శాస్త్రీయత కోసం అన్వేషించడం అత్యాశ అవుతుంది. అయితే వాస్తవికత అనేది మాత్రం ఈ ప్రక్రియలకు ప్రాణవాయువు వంటిదని అంటారు. వడ్డెర చండీదాస్ నవల అనుక్షణం గురించి ప్రజాసాహితి మే 2005లో రాసిన వ్యాసంలో నిజమైన అస్తిత్వవాద రచయిత ఎవరో, చండీదాస్ అస్తిత్వవాది ఎందుకు కాలేకపోయాడో చర్చించారు.

నవలా ప్రక్రియ మేధావులకు ఉద్దేశించింది కాదు. సాధారణ పాఠకుల కోసం రూపొందిన ప్రక్రియ .పాఠకుడు తానుగా వెళ్ళేది కావ్యం, పాఠకుడి దగ్గరకు తానుగా వచ్చేది నవల .రచయితలు చేసే సాహిత్య ప్రయోగాలు ఏవైనా అవి సామాన్య పాఠకులకు మరిన్ని మేళ్ళు కలుగజేయాలి. మరింత భయపెట్టకూడదు. ప్రయోజనం కోసం ప్రయోగం చేయాలి. ప్రయోగం కోసం ప్రయోగం చేయకూడదు. అలా చేసిన రచనలు చరిత్రలో ఒక భాగంగా ఉంటాయి. సాహిత్య పరిణామగతికి స్ఫూర్తిని, వారసత్వాన్ని అందివ్వలేవు. నిర్జీవ ప్రతిమల్లా సాహిత్య మ్యూజియములకు పరిమితం అవుతాయి .ప్రయోగం కోసమే ప్రయోగాత్మకంగా చేసిన రచనలు తెలుగులో కొన్ని వెలబడ్డాయి. చండీదాస్ అనుక్షణికం కూడా ఈ కోవకు చెందిందే. సామాజిక జీవితానికి దూరంగా ఉండేవాడు అస్తిత్వవాద రచయిత కాలేడు అని అంటారు. ఇదే వ్యాసంలో ఆయన నవలలో ఉండే పాత్రల గురించి వస్తువు గురించి నిర్మాణం గురించి అనేక వ్యాఖ్యానాలు చేశారు.

రవికుమార్ జాతశ్రీ కుట్ర అనే కథాసంపుటికి, శిరంశెట్టి కాంతారావు రచించిన కంచి మేక కథా సంపుటికి రాసిన ముందుమాటల్లోనూ, అలాగే వివిధ సందర్భాల్లో కథల మీద ఆయన ఉపన్యాసాలు ఇచ్చినప్పుడు లోతైన చూపుతో కొన్ని విషయాలు మీద మాట్లాడారు.

రచయితను కుదిపిన ప్రతి అంశము కథా వస్తువు కాలేదు. వస్తు స్వభావాన్ని బట్టి అది తాను ఇమిడిపోయే ప్రక్రియ నిర్ణయించుకుంటుంది. రచయితలు తమ రచనల ద్వారా పాఠకుల్లో ఉండే సెంటిమెంట్లను మూఢవిశ్వాసాలను, బలహీనతలను బలహీనం చేయాలి గాని వాటికి బలం పెంచకూడదు

కథ అంటే చిన్న కథ అని అర్థం ఏమి సంబంధించి కొన్ని పరిమితులు దానికి ఉంటాయి. సాధారణంగా కథను ఒక ఊపులో చదవగలగాలి. భాష విషయంలో కథా రచయిత డబ్బును పొదుపుగా అదుపుగా ఖర్చు పెట్టే లోభివాడిలాగా వ్యవహరించాలి. ప్రచురణకర్తలు పొరపాటున ఒక్క మాటను అచ్చు వేయడం మర్చిపోతే పాఠకుడికి ఆ కథ అర్థం కాకూడదు .కథలో కూర్పు అంత చిక్కగా ఉండాలి.

మానవుని అమానవుడిగా మార్చే పెట్టుబడిదారీ వ్యవస్థ పరిణామరూపం సామ్రాజ్యవాదం. దాని అంతిమ దశ ప్రపంచీకరణ ఈ వ్యవస్థలోని ప్రజా జీవితాన్ని క్లోజప్‌లో ఆవిష్కరించే బాధ్యత గలిగిన ఏ రచయితకైనా అవర్గీకరణ చెందడం అవసరం.

అరసం ప్రచురించిన ఈ తరం కోసం కథ స్రవంతి లో భాగంగా ఇనాక్ గారి కథా సంపుటికి ఆయన ముందుమాట రాస్తూ, ఇలా అంటారు.

కుల పీడన, ఆర్థిక దోపిడీ అనే ఈనాటి వర్గ శత్రువుకున్న రెండు ప్రధాన లక్షణాలు. ఏ ఒక్కదానితోనో పోరాడితే అది తాత్కాలిక విజయము పాక్షిక విజయము అవుతుంది. వర్గ శత్రువు ఒంటి కంటి రాక్షసుడులా ఉనికిలోనే ఉంటాడు. జరాసంధుడి లా తిరిగి నిరంతరం తన అస్తిత్వాన్ని పొందుతూనే ఉంటాడు. ఏకకాలంలో వర్గ శత్రువులోని రెండు పార్ట్స్ వాళ్ళపై యుద్ధం ప్రకటిస్తేనే సంపూర్ణ విజయాన్ని సాధించగలం. అందుకు రచయిత చేతిలోనే కలం కత్తికి రెండువైపులా బదులు పెట్టవలసిన అవసరం ఉంది.

రవికుమార్‌కి ఏ అంశం ఇచ్చినా అందులో ఎవరూ చూడని ప్రత్యేక కోణంలోంచి ఆయన చూడగలరు. ఆయన విశ్లేషణ, విమర్శ విన్న తర్వాత ఈ కోణంలో మనం ఎందుకు ఆలోచించలేకపోయాము అని మనం ఆలోచనలో పడతాం. విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అనేక జాతీయ అంతర్జాతీయ సదస్సులలో వారు కీలక ఉపన్యాసాలు చేశారు. రవికుమార్ మాట్లాడడానికి చూపేంత ఉత్సాహం రాయడానికి ఎందుకో చేయరు. ఆయా సమావేశాల్లోనూ, సభల్లోనూ, సదస్సులోనూ వారు చేసిన ప్రతిపాదనలు లోతైన కోణాలు చాలావరకు గాలిలో కలిసిపోయాయి. ఇప్పటికైనా అందుబాటులో ఉన్న ముందుమాటలు, వ్యాసాలు, జూమ్ వేదికగా, యూట్యూబ్ వేదికగా, ఫేస్బుక్ లైవ్ కార్యక్రమాలు లాంటివి ప్రచురణ రూపంలోకి తీసుకొస్తే చాలా బాగుంటుందని సాహితీ ప్రియుల అభిలాష.

## కదిలించే కథా విమర్శకులు కె. పి

ఏదో చెప్పాలన్న తపన, కదన వ్యూహంతోనే రచయితలు కథలు రాస్తారు. అంతమాత్రాన వ్యూహం అమలు కోసమే కథ రాయరు. కథ రాయడానికి వ్యూహం అవసరం గాని, వ్యూహం కోసం కాదు. అలాగే కథ కోసం శిల్పం గానీ, శిల్ప ప్రదర్శన కోసమే కాదు. ఒకవేళ ఇలాంటి ప్రయోగం జరిగినా, అది ప్రయోగం అనిపించకుండా పాఠకుని మనసు మీద బలమైన ముద్ర వేసినప్పుడు ఈ కథ ప్రయోజనం నెరవేరినట్టు.

**– కె.పి. అశోక్ కుమార్**

సాహిత్య విమర్శ భీముని భాగం కవిత్వం చుట్టూ తిరుగుతున్న, తిరిగిన సంగతి మనకు తెలుసు. కథలు ఉన్నాయి కానీ కథా విమర్శ పాళ్ళు తక్కువే అని చెప్పాలి. ఆ కాలంలో వచ్చిన కథల్ని చదివేవాళ్ళు కూడా తక్కువే. అశోక్ కుమార్ గారు కొన్ని లక్షల పేజీల్ని చదివారు. వేల కథల్ని పరిశీలించారు. ఆయన జీవితంలో చాలా క్షణాలు కథలు, నవలలు చదువుతూ వెనక్కి వెళ్ళిపోయాయి. కె.పి. కథా విమర్శలో ఆషామాషీగా దృష్టి పెట్టలేదు. దృష్టితోపాటు మేధని, హృదయాన్ని పెట్టాడు. ఆయన విమర్శ 'పరిపక్వత'తో

ఉంటుంది. పద్ధతిగా ఉంటుంది. కుదుపు లేకుండా ఉంటుంది. ఆయన దృష్టిలో సూక్ష్మంగా మంచి కథకు ప్రధాన లక్షణాలు ఇలా ఉన్నాయి: కథ పాఠకునితో చదివించడం, అతని ఆలోచనా ప్రపంచంలో, హృదయ సంస్కారంలో కదలిక తీసుకురావడం ఈ అంశాలను పరిశీలించినపుడు కె.పి. మొదట గొప్ప పాఠకుడు. ఆయన చదివిన కథ తీసుకువచ్చిన కదలిక మీద విమర్శకుడిగా స్పందిస్తాడు. ఒక గొప్ప పాఠకుడిగా అశోక్ కుమార్ తన పని తాను చేసుకుంటూనే పోతున్నాడు. స్వీయ కాంక్షలు, కిరీటాలు, గుర్తింపులు కోరుకోలేదు. ఆయన విమర్శకుడిగా వేషం వేసుకుని తిరగడం లేదు. విమర్శకుడి ప్రధాన లక్షణం ఏది మంచి రచన? ఎందుకు మంచి రచన ? ఏ రచన బాగా లేదు? ఎందుకు బాగా లేదు? అనే విషయాలకు సాక్ష్యాలు ఇవ్వాలి. పై ప్రశ్నలకు సరియైన జవాబులతో సంతృప్తి పరచగలగాలి. తన కథ మీద విమర్శను చదివిన రచయిత దాన్ని అంగీకరించగలిగే భాషలో చెప్పగలగాలి. ఈ లక్షణాలు ఆయనలో సంతృప్తికర స్థాయిలో ఉన్నాయి. కథ జీవన వాస్తవికతకు భిన్నంగా ఉండాలి. కళాత్మక రూపాన్ని సంతరించుకుని అభివ్యక్తమవ్వాలి. వస్తువు కోసం శిల్పాన్ని, శిల్పం కోసం వస్తువుని త్యజించడం మంచి కథ లక్షణం కాదు. ఇలా చేస్తే అది అసలు మంచి కథ కాదు. రచయిత దృక్పథం కథలో అంతర్నిహితమై ఇమిడిపోవాలని కె.పి. అంటారు. ఆయన చూపు ఎంత నిశితంగా ఉందో తెలిసిపోతుంది.

తన ఆరవ యేట మొదలైన పుస్తక పఠనం ఈ క్షణం వరకు సాగుతూనే ఉంది. అతన్ని సారవంతం చేసింది. చదివిన పుస్తకం తాలూకు మంచి, చెడుల చర్చ స్నేహితులతో నెరపడం ద్వారా విమర్శ వైపు దారితీసింది. కథా విమర్శకుడిగా, సమీక్షకుడిగా వందలాది వ్యాసాలు రాశారు. కథా విమర్శకు సంబంధించి రెండు పుస్తకాలు వెలువరించారు. అవి కథావలోకనం, కథావిష్కారం. ఈ రెండు పుస్తకాల్లోని ప్రతీ వ్యాసం కె.పి. ప్రత్యేకతకు దర్పణంగా నిలుస్తాయి. తెలుగు సాహిత్య విమర్శకు ఏమాత్రం పదును ఉందో వాటిని అధ్యయనం చేయడం ద్వారా తెలుస్తుంది.

ఉబుసుపోక రాసిన కథల్ని కె.పి. కథలుగా అంగీకరించరు. పాఠకుడిని ఒక్క బిగిన చదివించడం కథ ధర్మం. కథ మనసులో తిరుగాడాలి. పాత్రలు వెంటాడాలి. కథలోని సన్నివేశాలు కలవరానికి గురి చేయాలి.

సంభాషణలు లోలోపల తారట్లాడాలి. అప్పటివరకు చూడని దృశ్యమేదో చూసిన అనుభూతి కలగాలి. ఒక దిగ్భ్రమ కలగాలి. రచయిత ఊహాశక్తికి, కల్పనా చాతుర్యానికి మనసులోనే జోహార్లు అర్పించాలి. కదిలించిన కథ గురించి ఉత్సాహంగా పంచుకోవాలి. ఇదిగో ఇలాంటి కథలు పది కాలాలపాటు నిలబడతాయని కె.పి. విశ్వాసం.

కె.పి. చూపు చాలా ప్రత్యేకం అని చెప్పడానికి ఆధారాలు చాలా ఉన్నాయి. ఉదాహరణకు ఆలూరి భైరాగిని కవిగా గుర్తించిన సాహితీలోకం, కథకుడిగా పట్టించుకోలేదు. కానీ కె.పి. భైరాగి కథల్ని విశ్లేషించారు. కొన్ని నిర్ధారణల్ని చేశారు. భైరాగి కథల్లోని విశిష్టతను గుర్తించారు. భైరాగి చేయి తిరిగిన కథకుడని ప్రకటన చేశారు. అలాగే శ్రీశ్రీ, కాళోజి, జూకంటి జగన్నాథం లాంటి కవులు రాసిన కథల్ని ఎరుకతో చర్చించారు. కొనకళ్ళ వెంకటరత్నం కథల మీద వ్యాసం రాశారు.

కథావిమర్శ, నవలా విమర్శ విమర్శల మీద ప్రామాణిక గ్రంథాలు వెలువరించిన వల్లంపాటి వెంకట సుబ్బయ్య కథలు రాశారు. కథకుడిగా వల్లంపాటిని ఎలా చూడాలో మొహమాటం లేకుండా చూపారు.

కె.పి.ని కథా విమర్శకుడిగా ఎందుకు గుర్తించాలి? అనే ప్రశ్న వేసుకుంటే జవాబులు చాలానే చెప్పొచ్చు. ఎవరూ పట్టించుకోని కథల్ని, కథా రచయితల్ని గుర్తించడంలో వీరిది విలక్షణమైన చూపుగా కనిపిస్తుంది. తీవ్రమైన అధ్యయనం తరువాతే, ఆయన వ్యాఖ్యానాలు చేస్తాడు. కథా సంవిధానం, కథా కథనం, పాత్రలు, కథా ప్రయోజనం ఇలా ప్రతి అంశాన్ని పట్టి చూపగలరు. సమకాలీన వచన సాహిత్య విమర్శకు అశోక్ కుమార్ దారిదీపం లాంటివారు. పోరంకి దక్షిణామూర్తి, పాపినేని కథా విమర్శకులు కానీ వారు రాసిన కథల్లోని లోతుపాతుల్ని విశ్లేషించడం ద్వారా విమర్శకుడిగా, కె.పి సత్తా తెలుస్తుంది. ఆయన విమర్శనా వ్యాసాల్లో చాలా పరిశోధకాంశాలు దొరుకుతాయి. పాఠకుల పట్ల రచయిత ఎంత బాధ్యతతో వ్యవహరించాలో, కథకుడు కథన సౌందర్యాన్ని, కథని కళాత్మకంగా ఎందుకు మలచాలో చాలాచోట్ల సూచనలు చేశారు. సృజనకు శిక్షణ ఉంటుందా? అనే ప్రశ్న వేసుకొని, కొంత శిక్షణ అవసరం అని వారు భావిస్తారు. రచయిత నిరంతరం తనని తాను చెక్కుకోవలసిన అవసరం గురించి గుర్తు చేస్తారు.

కథావిమర్శ మీద రాసిన వ్యాసాలు చదివించేలా ఉండటం మంచి లక్షణం. అశోక్ కుమార్ మన ప్రక్కన కూర్చుని చెబుతున్నట్లే వాక్య నిర్మాణం ఉంటుంది. శిల్పం, శైలి, దృష్టి కోణం, ఎత్తుగడ అంటూ నాలుగు పడికట్టు మాటలతో విమర్శ రాయడం వీరి తత్త్వం కాదు. విమర్శకుడిగా గాక పాఠకుడిగా ఆయన ఏం ఆశిస్తున్నారు అనే ప్రశ్న వేసుకుంటే –

1. కథ చదివించాలి.
2. కథా నిర్మాణం శ్రద్ధగా చేయాలి.
3. కథన సౌందర్యం మిస్ కాకూడదు.
4. కథ చదవడం ఎలాగో నేర్పాలి.
5. కథని కళాత్మకంగా మలచాలి.
6. ప్రజాస్వామ్య, లౌకిక భావనలు పెంపొందే కథలు రావాలి.
7. ఉద్వేగం ఆపుకోలేని కుతూహలాన్ని కథలు కలిగించాలి.
8. లేనిపోని ఆదర్శవాద ధోరణులతో కథ అసహజంగా ఉండకూడదు.
9. ఇతివృత్తాల ఎంపికలో మూసధోరణిని బద్దలు కొట్టాలి.
10. కథకుడి దృష్టి వైశాల్యం పెరగాలి.

తెలుగు నేల మీద కథా విమర్శను నిబద్ధతతో ముందుకు తీసుకెళుతున్న విమర్శకులు చాలా తక్కువ. కానీ కె.పి. కథావిమర్శను బలంగా, వేగంగా కాకుండా శ్రద్ధగా చేస్తున్నారు. విభిన్నమైన వ్యాసాలు రాస్తూ ప్రత్యేకంగా కనిపిస్తున్నారు. వారి విమర్శ ద్వారా రచయితలు మరింత మెరుగు పడతారని, రాసిన వ్యాసాలు పరిశోధకులు పరిశోధనాంశాలుగా కొనసాగించాలనీ ఆశిస్తున్నాను.

**(తరువాయి.......45 వ పుటలో)**

పరిశోధనా పత్రం

డి.కె.ప్రభాకర్
7795444919,7892155603

# తెలుగు - కన్నడ జానపద గేయాలు - స్త్రీ చిత్రణ

తెలుగు -కన్నడ భాషలు ఇరుగు- పొరుగున వుంటున్నా సాహిత్యపరంగా జరగాల్సినంత తులనాత్మక పరిశోధన జరగకపోవడం చింతించాల్సిన సంగతే. ప్రాచీన తెలుగు కన్నడ సాహిత్యాలు సంస్కృత భాషా సాహిత్య ప్రభావంతో వర్ధిల్లి వికసించినవే. ఈ రెండు భాషలు నైసర్గికంగా, చారిత్రక, రాజకీయ, మత సాంస్కృతిక, భాషా సాహిత్య, వ్యాకరణ ఛందస్సు, వ్యాపారసంబంధాది విషయాలలో అత్యంత సన్నిహిత బాంధవ్యాన్ని కలిగి వున్నాయి. భాషాతత్వాన్ని బట్టి తెలుగు-కన్నడ భాషలు ద్రావిడ భాషా కుటుంబానికి చెందినవే. భాషకు స్థిరత్వాన్ని కలుగజేసే 'లిపి' తెలుగు కన్నడ భాషలు రెండిరటికి ఒకటే 'వేంగి చాళుక్య లిపి' క్రీ.శ.12వ శతాబ్ది వరకు వాడుకలో వుండేది. తదనంతరం రెండు లిపులుగా విడిపోయినాయి. వీటన్నింటిని అవలోకిస్తే తెలుగు కన్నడ భాషలు ఒకే గర్భమున పుట్టిన కవల పిల్లలవలె అవినాభావ సంబంధాన్ని కలిగి వున్నాయని చెప్పవచ్చు.

సాహిత్యపరంగా ప్రాచీన కాలం నుండి నేటి వరకు తెలుగు - కన్నడ భాషలు అత్యంత సాన్నిహిత్యాన్ని, పరస్పర ప్రభావాన్ని కలిగి వున్నాయి. పరస్పర ప్రభావంతో ఆయా భాషల్లో సాహిత్యాభివృద్ధి జరిగింది. కానీ తులనాత్మక అధ్యయనం జరగాల్సినంత జరగకపోవడం విచారకరం. ఇరుగు-పొరుగు భాషా సాహిత్యాల్లోని అనేక అంశాలపై తులనాత్మక అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. దీనివల్ల భాషాభివృద్ధితో పాటు భాషా విస్తృతి కూడా జరుగుతుంది. తెలుగు-కన్నడ భాషలు నైసర్గికంగా చాలా దగ్గరగా వున్నప్పటికి జానపద సాహిత్యంపై తులనాత్మక పరిశీలన జరగాల్సినంత జరుగలేదు.

జానపద సాహిత్యంలో అత్యంత సమృద్ధం, సంపన్నమైనది గేయ సాహిత్యం. నిత్యజీవితంలో మానవుడిలో ఆనందం పొంగిపొర్లినప్పుడు, ఎదలో గూడు కట్టుకొన్న బాధ మనస్సుని పిండినప్పుడు ఆనంద విషాదాలు పాటగా పరిణమిస్తాయి.

Folksong అన్న ఆంగ్ల పదానికి సమార్థకంగా తెలుగులో జానపద గేయాలు, పాత పాటలు, పల్లెపాటలనీ కన్నడంలో జనపద గీతె, హళ్ళి హాడు అనే పదాలు వాడుకలో వున్నాయి. జానపద గేయాల్ని అనేక మంది విద్వాంసులు వివిధ రకాలుగా వర్గీకరించారు. ఈ గేయాల్లో అనేక కోణాల్ని దర్శించవచ్చు.

జానపద గేయాలకు శోభను ఇచ్చేది, తెచ్చేది స్త్రీయే. సాహిత్యంలో వివిధ రచనల్లో ఏవిధంగా స్త్రీని చిత్రించారో, అదే విధంగా జానపద గేయాల్లో కూడా స్త్రీ చిత్రణను అనేక రూపాల్లో చూడవచ్చు.

దేవతా రూపాలుగా స్త్రీ :

ప్రకృతి దేవతగా స్త్రీ అనేక రూపాలలో కన్పిస్తుంది. ఎల్లమ్మ, గంగమ్మ, మారెమ్మ, సుంకులమ్మ, కల్లమ్మ, పోచమ్మ మరియు సీతమ్మ, గౌరి, లక్ష్మి, సరస్వతీ మున్నగు దేవతా రూపాలుగా స్త్రీ చిత్రీకరణ తెలుగు-కన్నడ జానపద గేయాలలో ప్రదర్శితమవుతుంది.

రైతులు సంపదలు పెంపొందాలని, రైతును ఆదుకోవాలని, అందరికీ మంచి జరగాలనే ఉద్ధేశంతో దేవుళ్ళను పూజించడం పరిపాటి. వాటిలో...

**1. ఎల్లమ్మ తల్లి :**

**తెలుగు :** ఏడేడు బోనాలతోనూ ఏడేడు జమిడికెలతోను
కొల్తురూ ప్రజలంత ఎల్లమ్మనూ
కల్లు లోట్లాతో కోడి పుంజులతో
సార సీసాలతో గొట్టె పోతులతో
ఎల్లమ్మను గొల్తురూ వేడుకాతోను

(జమిడికె-గేయాలలో వాడే వాయిద్యం)

ఈ గేయంలో తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు తగినట్లు ఎల్లమ్మను సేవించే విధానం కన్పిస్తుంది.

**కన్నడం :** ఏళ ఎల్లవ్వ తాయి ఎష్టోత్త మలగిదె
హూవెంజలాగి హుళ ముట్టి, కొళ్ళద
నీరెంజలాగి గిళి కుడిదు..

**ఎల్లమ్మ తల్లీ** లే.. ఎంత సేపు నిద్రపోతావు, పురుగు తాకి పూవు ఎంగిలవుతున్నది, చిలుక తాగిన కొలనులో నీరు ఎంగిలవుతున్నది అని అంటూ ఎల్లమ్మ జాతర సమయంలో ఎల్లమ్మ వేడుకోవడం కర్ణాటకలో కన్పిస్తుంది.

**2. గంగమ్మ తల్లి :**

గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు నిండిన, వర్షాలు ఎక్కువగా కురిసినా, కురవక పోయిన గంగమ్మను వేడుకోవడం, గంగమ్మ జాతర చేయడం పరిపాటి.

**తెలుగు :** నిలు నిలు గంగమ్మ తల్లి,
నిలువమ్మా గంగమ్మ తల్లి
నీవల్ల మేము బ్రతికేము...
విను విను గంగమ్మ తల్లీ వినమ్మా గంగమ్మ తల్లీ
కొమ్ములు తిరిగిన పొటేలి నిచ్చేనో
ఒక పుట్టి బీము దీపాలు పెట్టేను
కొమ్ములు తిరిగిన ఎనుపోతు నరికేను...

కపిల తోలేటప్పుడు ఎటువంటి ఆపదలు, బాధలు కలుగకుండా బావిలోని గంగమ్మతల్లిని వేడుకోవడం కన్పిస్తుంది.

**తెలుగు :** బాయి గంగా బళ్ళారి గంగా
భారమంతా మోపినాము
బాయిలోని సిరి బాలగంగా
బాల లెద్దులు నీ భారమమ్మా
ఏడు మట్ల బాయి కాడా

ఎద్దుల యీ బాధ సూడు
బక్క ఎద్దులు బారు కపిలి
భద్రమమ్మా బాయి గంగా...

ఓ బాయి గంగమ్మ తల్లీ నా భారమంతా నీపైన మోపాను, చిన్న వయస్సు, బక్కచిక్కిన ఎద్దులు, అవి పడేబాధ అంతాఇంతా కాదు, కపిల బాన చూస్తే చాలా పెద్దది... కావున నువ్వే కాపాడాలమ్మ అని చేప్పే ఈ గేయంలో రైతు బాధ కన్పిస్తుంది.

**3. కల్లమ్మ (రాయమ్మ) తల్లి :**

కర్ణాటక రాష్ట్రంలో ఒక జానపద స్త్రీ రాగుల్ని విసరేటప్పుడు "కల్లమ్మతాయి" (రాయమ్మ) అని రాయిని దేవతగా భావించి తన బాధను విన్నవిస్తుంది.

కల్లమ్మ మాతాయి మెల్లమ్మ రాగీయ
జల్లి జల్లినె ఉదురమ్మ నా నిగగె
నెల్లక్కి పడియ నడెసేను
కల్లమ్మ మాతాయి మెల్లవ్వ రాజనవ
జల్ల జల్లనె ఉదురవ్వ నా నినగె
బెల్లదారతియ బెళగేను. 4

ఓ రాయమ్మా (కల్లమ్మ) వేగంగా రాగి పిండిని ఉదురమ్మ, నేను నీకు బెల్లంతో చేసిన హారతి ఇస్తానని అంటుంది.

**4. సీతమ్మ తల్లి :**

సీతమ్మ పాతివ్రత్యానికి మారు పేరు. సీతంటే ప్రతి స్త్రీ పరవశిస్తుంది. సుగుణాలతో కూడిన సుందర మూర్తి సీతమ్మ.

అమ్మా సీతమ్మ మా తల్లి ముద్దులగుమ్మ
లేవె బంగరు బొమ్మ లేవమ్మా
లేచి వేగమె నీవు లేపుమీ రాముని
లోక రక్షణి రాణి లేవమ్మా – తెల్ల వార వచ్చెనూ
అత్త మామ మరదులు తోడి కోడళ్ళు
అపుడె లేచున్నారు లేవమ్మా
అదియేమె మాయమ్మ అలసి నిద్రించేవు
అత్తవారిల్లిది లేవమ్మా – తెల్లవార వచ్చెనూ....

ఈ గేయంలో స్త్రీలోని మంచి గుణాల్ని చేప్తూనే, కొత్త పెళ్లికూతురుకి ఇంటి బాధ్యతలను, కుటుంబ మర్యాదలను గుర్తుచేయడం జరుగుతుంది.

**తల్లిగా స్త్రీ స్వరూపం :**

సంస్కృతి సంప్రదాయాలకు, ప్రేమాభిమానాలకు, కుటుంబానికి మూలం తల్లి. ఇందులో భర్తపై ప్రేమ, పిల్లలపై ప్రేమ, అత్తమామలపై రాగద్వేషాలు, తోడికోడళ్లు, ఆడపడుచులపై ద్వేషాభిమానాలు వంటి పలు అంశాలు కన్పిస్తాయి.

**1. కూతురిపై ప్రేమ :**

కూతురికి పెళ్ళి చేసి అత్తారింటికి పంపించేటప్పుడు తల్లి చెప్పే మాటలు... కూతిరిపై తల్లికున్న ప్రేమ వ్యక్తమవుతుంది.

తెలుగు : పోయి రావమ్మా కూతూరా పోయిరావమ్మా
పోయి మీ అత్తింటికి కీర్తి దేవమ్మా
ఈశ్వరుని కృపచేత నిన్నుగంటి నమ్మా
రాముని కృప చేత అప్పగించితినమ్మా ? పోయిరా?
అత్త మామల మాట అడుగు దాటొద్దు
బావలను మరుదులను భక్తితో చూడమ్మా
పొరిగింటి కాడికి పోవద్దు తల్లిరో
మతిమంతురాలవై మంచి మాటదే
మాయమ్మ ? పోయిరా?

ఆ ఈశ్వరుని కృపచేత నిన్ను గన్నాను, అత్తారింట్లో ఎవరెవరితో ఎలా మెలగాలో బుద్ధి మాటలు చెప్పి, అత్తింటికి కీర్తిని, పుట్టింటికి మంచి మాట తెమ్మని తల్లి కూతురికి చెప్తుంది. ఇందులో తల్లి బాధ్యత కన్పిస్తుంది. ఇలాంటిదే కన్నడ గేయాల్లో కూడా కన్పిస్తుంది.

**కన్నడం :** అత్తీయ మనియాగ హత్తెంటు బేదార
హచ్చికో బ్యాడ నన మగళ ! జనవెల్ల
గంగవ్వనెందు కరెదార
అత్తీయ మనియాగ ముత్తాగి ఇరబేకు !
హొత్త నీడిదర ఉణబేకు! తవరవర !
ఉత్తమ హెసర తరబేక !

అత్తింట్లో అనేక సమస్యలుంటాయి వాటన్నింటిని పట్టించుకోబోకు, అత్తింట్లో ఒద్దికగా ఉండాలి, అన్నం పెడితే తినాలి, పుట్టింటికి మంచి పేరు తేవాలిని తల్లి హితబోధ చేస్తుంది.

**కన్నడం :** ఒంభత్తు తింగళు నిన్న తుంబికొండు తిరుగేన
హంబలిసి నిన్న హడదేన ? సో ?
హంబలిసి నిన్న హడదేన చిత్రద
గొంబి నినగొప్పిసి కొడలాంగ..

కూతుర్ని మెట్టినింటికి పంపే సమయంలో తొమ్మిది నెలలు నిను మోసి, నిన్ను పెంచి పోషించిన బొమ్మలాంటి నా కూతుర్ని నీకు అప్పజేప్పేదెలా? అంటూ తన దుఃఖం, కంగారు తల్లిలో నిండుకొని వుండటం కన్పిస్తుంది.

**2. కొడుకుపై ప్రేమ :**

ఏ తల్లైనా తన బిడ్డలు సక్రమ మార్గంలో నడవాలని, మంచి పేరుప్రతిష్ఠలు తేవాలని ఆశిస్తుంది. అయితే బిడ్డలు వక్రమార్గంలో నడుస్తుంటే సన్మార్గంలో నడిపించడానికి అన్ని విధాలా ప్రయత్నిస్తుంది.

**తెలుగు :** వద్దురా నీ కొద్దురా, పొరిగింటికీ పోవద్దురా
హద్దుమీరి నీవు బోతే, బుద్ధులూ తెగ జెప్పెదారు
వద్దురా కొడుకా వద్దురా, పోక పోకా ఒకరింటికి పోతే
రాక రాక ఒక మాట వచ్చు, పోయి నింటికి మళ్లి బోతే
లేని నిందలు బెట్టెదారు, వద్దురా కొడుకా వద్దురా....

**కూతురుగా స్త్రీ స్వరూపం :**

జానపద గేయాల్లో కూతురు స్వరూపం %తత% పుట్టింటిపై ప్రేమ, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ల పట్ల ప్రేమ, స్నేహితురాళ్ల పట్ల ప్రేమ వంటి అనేక కోణాలలో సాక్షాత్కారమవుతుంది.

**1. పుట్టింటిపై ప్రేమ :**

**తెలుగు :** కాశి కెళదా మంటె కదలవే కాళ్లు
డిల్లి కెళదా మంటె తిరగదే మనసు
నారాచ పుట్టింటి కెళదాము అంటె

నాకాళ్లు పన్నిన్న రథములై నడచు
నా చేతు లుయ్యాల చేరులైయూగు

కాశికి వెళదామన్నా, డిల్లీకి వెళదామన్నా కాళ్ళు, మనసు రావుగాని పుట్టింటికి పోదామంటే మాత్రం నా కాళ్లు రథాల్లాగ, నా చేతులు ఉయ్యాల చేరుల్లాగా అత్యుత్సాహంతో పని చేస్తాయని పుట్టింటిపై ఉన్న ప్రేమను వ్యక్తపరుస్తుంది స్త్రీ.

**2. తల్లిపై ప్రేమ :**

కొత్తగా పెళ్ళైనప్పుడు ఆమె క్షేమ సమాచారాన్ని ఎంతమంది విచారించినా, ఆమెకు సంతృప్తి కలగదు. తల్లి మీదే మనస్సుంటుంది. మాతృమూర్తి సరిలేరెవ్వరంటుంది.

**కన్నడం :** యారిద్దారు నన్న తాయవ్వ హోలార,
సావిర కొళ్ళి ఒలియాగ - ఉరిదారు
-జ్యోతి నిన్యారు హోలారు.

(హోలర-సరిసమానం కాదు / సాటిలేరు, కొళ్లి - కిరణాలు / జ్యోతి) ఎవ్వరున్నా, ఎంతమంది వున్నా నా మాతృమూర్తికి సాటిలేదు, సహస్ర జ్యోతులు వెలుగుతున్నా నీవంటి ప్రకాశవంతమైన జ్యోతి ఏదీ లేదని తల్లిపై ఉన్న వాత్సల్యం కూతురిలో కన్పిస్తుంది.

**కన్నడం :** ఆకళ కరు బందు అంబ అంబా ఎందు
తమ్మవ్వన మొలియ నలినలిదు ఉంబాగ
నమ్మవ్వన ధ్యాన ననగాగి. 5
(ఆకళ కరు - ఆవు దూడ, తమ్మవ్వ - తల్లి,
ఉంబాగ-తాగినప్పుడు)

లేకదూడ అంబ అంబా అంటూ ఆవు దగ్గర పాలుతాగుతున్న దృశ్యాన్ని చూస్తే అమ్మ జ్ఞాపకం వస్తుందని అమ్మపై కూతురికున్న ప్రేమ బయటపడుతుంది.

**కోడలిగా స్త్రీ స్వరూపం :**

జానపద గేయాల్లో కోడలి పాత్ర కూడా చాలా విశిష్టమైనది. ఆడమగ పిల్లల పట్ల ప్రేమ, భర్తపై అభిమానం, భర్త పెట్టే హింసలు, అత్తమామల పట్ల రాగద్వేషాలు, మరదళ్ళ పట్ల ద్వేషాభిమానాలు, అమ్మానాన్నలపై ప్రేమ వంటివి ఇందులో కన్పిస్తాయి.

**1. అత్తారింట్లో కష్టం :**

**తెలుగు :** దంపు దంపని యేరు అదియెంత దంపు
ధాన్యరాశుల మీద చెయ్యేసినట్లు
వంట వంటని యేరు అది యెంత వంట
వదినతో మరదళ్ళు వాదాడినట్లు ....

స్త్రీ మరొక ఇంటికి కోడలుగా వచ్చిన తర్వాత రోకటితో దంచే పని ఎక్కువగా వున్నప్పుడు, దంచే రాశిని చూసి భయపడకుండా అది నాకొక లెక్కా.... అంటూ స్వీయ స్ఫూర్తిని పొందుతూ కష్టసాధ్యమైన పనిని కూడా సులువుగా చేసేస్తుంది. అంతేకాక వదినతో మరదళ్ళకుండే ద్వేషాలు కూడా పెద్దలెక్కేమీ కాదన్నది ఈ గేయంలో బోధపడుతుంది.

**కన్నడం :** సుమ్మానె బీసిదరె బీళాదా ఈ కల్లు
నాగసారదంతె దని ఎత్తి హాడిదరె
గమ్మనె బీళ్వుదు ఈ కల్లు. 3

ఈ విసురు రాయి ఊరకే విసిరితే పిండి రాలదు, నాగ స్వరంలాంటి పాట పాడితే దానంతట అదే పడుతుందని తన కష్టాన్ని మరచిపోవడానికి గేయం ఎంత సహకరిస్తుందో ఇందులో కన్పిస్తుంది.

**2. భర్త హింస :**

భార్యను హింసించి, భార్య సంపాదనతో బ్రతికే భర్తలు ఎంతో మంది వున్నారు. ఎన్ని హింసలు పెట్టినా భర్త సుఖమే తన సుఖంగా భావించే భార్యలు కూడా వున్నారు.

**తెలుగు :**

అప్పు సప్పూ చేసి దుప్పాటి నేదెస్తే, తల గుడ్డలేదాని తన్ని నాడమ్మా మొలగుడ్డలేదాని మొత్తినాడమ్మా, కూలినాలీ జేసి కూడొండి పెడితేను కూరాకు లేదాని కుమ్మినాడమ్మా, బిచ్చమెత్తీ నేను బీడీలు దీసిస్తే వక్కాకు లేదాని కొట్టినాడమ్మా, పేడ సెత్తా దోసి పేయింటు దీసిస్తే దట్టీయి లేదాని కొట్టినాడమ్మా....

(పేయింటు - ప్యాంటు, దట్టీయి-బెల్టు)

**3. మరదళ్లపై ద్వేషం :**

**కన్నడం :** అణ్ణన హెండతి కణ్ణీగి ఒళ్ళెవళు
సుణ్ణద నీర ఒలి ముంద ! ఇటగొండు !
ఎమ్మి హాలెందు బడస్యాళ !

(హెండతి-భార్య, సుణ్ణద- సున్నము, ఒలి - పొయ్యి, ఎమ్మి-గేదె, హాలు-పాలు)

అన్న భార్య చూడటానికి చాలా మంచిదానిలా కనిపిస్తుంది, సున్నపు నీళ్ళను పొయ్యి ముందు పెట్టుకొని గేదె పాలని చెప్పి మాకు ఇస్తుందని వదినకు మరదళ్ళపై ఉండే ద్వేషాన్ని తెలియజేస్తుంది.

**3. స్త్రీ జీవితంపై విరక్తి :**

అత్తింట్లో కోడలికి అనేక సమస్యలు ఎదురైనప్పుడు స్త్రీ జీవితమే ఎందుకనిపిస్తుంది. కోడలు తన జీవితం అత్యంత దుర్భరమైనదని మనోవేదనతో పాడిన జానపద గేయం....

తెలుగు : మానన్న గ్గానైతి మంచె వేతూరు, చెట్టన్న గ్గానైతి
చెలగి వేతూరు
ఆకన్న గ్గానైతి మేకలారగించు, కాయన్న గ్గానైతి
కాకులారగించు
పండన్న గ్గానైతి పక్షులారగించు, బలుదు మా తండ్రి పాలు
బిండంగ
బంగారు చెంబులో ధారగ్గానైతి, సిరదేవి మాయమ్మ చల్ల
చేయంగ
చిల్లి పోయి కవ్వాన చితుపగ్గానైతి (బాంధవ్య గీతాలు)....

ఈ గేయంలో స్త్రీగా పుట్టడంకంటే చెట్టుగానో, పండుగానో పుట్టినా బాగుండేదని తన జీవన గాథను వ్యక్తపరుస్తుంది.

**కన్నడం :** హెణ్ణు ఆగుదకింత మణ్ణు ఆగుదు లేసు
మణ్ణిన మ్యాలె మరవాగి బెళెదార
బందవరిగెల్ల నెరళవ్వ..

**4. గయ్యాళి అత్త :**

కోడళ్లపై సవారి చేసే అత్తవుంటే కోడలి బ్రతుకు నరకమే.

**కన్నడం :** మాడబారద కెలస మాడెందళత్తెమ్మ
కరడీయ కట్టి హాల కరెయెందళు దేవరె

హులియ ముంగాల హిడి ఎందు

మా అత్త చేయకూడని పనిని చేయ్యమని, ఎలుగుబంటిని కట్టేసి పాలు పిండమని, పులి ముందర కాళ్ళు పట్టుకోమని చెప్పే అత్త హింసలు ఇందులో కన్పిస్తాయి.

**గొడ్రాలుగా స్త్రీ స్వరూపం :**

గ్రామలలో గొడ్రాలి పట్ల విముఖత, వాళ్ల నీడ ఇతర మీద పడినా సహించకపోవడం, ఏ శుభ కార్యానికి వాళ్ళను పిలవకపోవడం, సంఘంలో గౌరవం లేకపోవటం వంటి దయనీయ స్థితి జానపద గేయాల్లో కన్పిస్తుంది.

**తెలుగు :** పసుపు కుంకుమలకు పోలేను నేను, పసి
బిడ్డలను నేను ఎత్తుకోలేను
ఇల్లు కలకలలాడ చూడంగ లేను, ఒక్క బిడ్డనైనా
ముద్దాడ లేను
గొడ్రాలి బతుకయ్యో గౌరవం లేదయ్యో...

**కన్నడం :** బాలకరిల్లద బాలీద్యాతర జన్మ
బాడీగి ఎత్తు దుడిదంగ
బాళెలెయ హాస్యుండు బీసి ఒగెదంగ .

(ఎత్తు - ఎద్దు, బాళెలె-అరిటాకు)

పిల్లలు లేని జన్మ ఒక జన్మేనా, బాడుగకు ఎద్దు కష్టపడినట్లు, తిని పారేసిన అరటాకు వంటిదట గొడ్రాలి జన్మ. ఈ గేయాలలో సమాజంలో పిల్లలు లేని స్త్రీని ఏ భావంతో చూస్తారో అనేది వ్యక్తమవుతుంది. ఇందులో మాతృత్వానికున్న మహత్వాన్ని, గొడ్రాలి జీవితం దారుణాన్ని ఈ గేయాం విశదీకరిస్తుంది.

**సారాంశం :**

జానపద గేయాలు మన పూర్వీకుల వారసత్వ సంపద. తెలుగు - కన్నడ జానపద గేయాల్లో స్త్రీ కేంద్ర బిందువుగా ప్రతిబింబితమవుతుంది. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు వారధి స్త్రీ. ప్రపంచీకరణ ప్రభావంవల్ల జానపద గేయాల పుట్టుక, జానపద గేయాల చలనశీలతలకు ముప్పు దాపురించింది. సమాజంలో వచ్చిన సాంకేతికత, సామాజిక మాధ్యమాల ప్రభావం వల్ల జానపద సాహిత్యపు మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. యాంత్రీకరణ ప్రభావంతో పనిపాటల ప్రస్తావనే రావడం లేదు. మనుషుల స్థానాన్ని యంత్రాలు ఆక్రమించడం వల్ల విత్తనాలు, నాట్లు, కోతలు, కూలీ వంటి పనులకు మనుషుల అవసరమే లేకపోయింది. రోకటి పాటల అవసరమే రావటం లేదు. ఈ తరం వారికి రోకలి, విసురురాయి అంటేనే తెలియని పరిస్థితి. ప్రపంచీకరణ ప్రభావంతో ఉన్న బంధుత్వాలే ఊడిపోతున్న ప్రస్తుత సమాజంలో బాంధవ్య గీతాలు ఎక్కడి నుండి వస్తాయి. అత్యాధునిక సమాజంలో వలపు వాడిపోయింది, హాస్యం అలసిపోయింది, కన్నీరు కనుమరుగయింది. అందువల్ల జానపద గేయాల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. అయితే జానపద గేయాల్లో సాహిత్యంతో పాటు జీవితానుభవాలు, విలువలు, ఆవేదన, ఆలోచన, ఆప్యాయత, అనురాగం, ఆవేశం, సుఖం, దుఃఖం, దైవం ఇలా అనేక జీవితమూల్యాలెన్నో నిబిఢీకృతమై వున్నాయి. కాబట్టి వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన వుంది.

**ఉపయుక్త గ్రంథసూచి**


1. డా.శివశంకర్ చక్కెరె. (2012). జానపద ప్రవేశ. కన్నడ సాహిత్య పరిషత్, బెంగళూరు.
2. డా.శివశంకర్ చక్కెరె. (2012). జానపద ప్రవేశ. కన్నడ సాహిత్య పరిషత్, బెంగళూరు.
3. హలసంగి గెళెయరు. (2014). గరతియ హాడు. కన్నడ సాహిత్య పరిషత్, బెంగళూరు.
4. హలసంగి గెళెయరు. (2014). గరతియ హాడు. కన్నడ సాహిత్య పరిషత్, బెంగళూరు.
5. హలసంగి గెళెయరు. (2014). గరతియ హాడు. కన్నడ సాహిత్య పరిషత్, బెంగళూరు.
6. హలసంగి గెళెయరు. (2014). గరతియ హాడు. కన్నడ సాహిత్య పరిషత్, బెంగళూరు.
7. శ్రీ బి.రామరాజు (సం.). (2006). త్రివేణి. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.
8. ఆచార్య ఆర్వీయస్.సుందరం. (1979). తెలుగు-కన్నడ జానపద గేయాలు, జానపద విజ్ఞాన భారతి, మైసూరు.
9. ఆచార్య ఆర్వీయస్.సుందరం, జి.అశ్వత్థనారాయణ, ఆచార్య.టి.వి.సుబ్బారావు (సం.). (1972). అలిచిప్పలు-ఆణిముత్యాలు.
10. శ్రీ బి.రామరాజు. (1958). తెలుగు జానపద గేయ సాహిత్యము.



రచయిత సహాయ ఆచార్యులు, తెలుగు అధ్యయన శాఖ, బెంగళూరు విశ్వవిద్యాలయం, జ్ఞానభారతి ఆవరణ, బెంగళూరు


**విజ్ఞాన శాస్త్రాన్ని అమ్మభాషలో బోధించాలని ఉపాధ్యాయులను కోరుతున్నా. దానివల్ల చిన్నారుల్లో 'సైన్స్ సృజనాత్మకత' పెరుగుతుంది. పాఠ్యాంశాన్ని త్వరగా అర్థం చేసుకునే శక్తి సమకూరుతుంది. నేను పదో తరగతి వరకూ మాతృభాషామాధ్యమంలోనే చదువుకున్నా. తర్వాత ఆంగ్లం నేర్చుకున్నా. ప్రాథమిక పాఠశాల స్థాయిలో పిల్లలు చూపించే సృజనాత్మకతే వారి భవిష్యత్తుకు పునాది. ఆ సృజనాత్మకత అమ్మభాషలో చదవువల్లే సాధ్యం.**

**డా.ఎ.పి.జె.అబ్దుల్ కలామ్**

లక్ష్మీహరిబండి, కోకిల కాలేకర్

# సాహిత్యఅనువాదాలలోభాష: ఒకపరిశీలన

అనువాదమనగానే తలెత్తే మొదటిప్రశ్న అనువాదాన్ని మూలానికి విధేయంగా మక్కికి మక్కీ చేయాలా లేక స్వేచ్ఛానువాదంచేయాలా అని? ఒకవేళ స్వేచ్ఛానువాదం అయితే ఎంతమేరకు స్వేచ్ఛతీసుకోవచ్చు అనేదీ ఒక ప్రశ్నే. మక్కికి మక్కీ అనువాదాలను, ఏదైనా ప్రత్యేక ప్రయోజనానికి ఉద్దేశింపబడితేతప్ప, సాధారణంగా అటుఅనువాదకులుగానీ, ఇటు పాఠకులుగానీ ఇష్టపడరు, సానుకూలంగా స్వీకరించరు. దీనికి ప్రధానకారణం అనువాదగ్రంథంలోని భాష కృత్రిమంగా, లక్ష్యభాషాసంప్రదాయాలకు భిన్నంగా ఉండటమే. రెండవది మనం సహజంగా అనువాదాలగురించి చెప్పుకొనే letter Vs.spirit విషయంలోగానీ కొన్ని ప్రత్యేక సందర్భాలలోతప్ప (ఉదాహరణకుకవిత్వానువాదం) అనువాదకులు సామాన్యంగా from Vs. content కూ మాత్రమేపెద్ద పీటవేస్తారు. ఇకపోతే ఏఅనువాదంలోనైనా మూలవిధేయతకూ, లక్ష్యభాషావిధేయతకూ మధ్యసంఘర్షణ ఎప్పుడూఉంటూనేఉంటుంది. ఈరెంటినీ సమతూకంగా చూసుకోవాలిగానీ, వీటిలో ఏదిమితిమీరినా మొదటికే మోసంవస్తుంది. మూల విధేయత మితిమీరితే అనువాదగ్రంథం కృత్రిమంగా, అసహజంగాఉంటుంది. చదివించగలగటం (readability) లోపిస్తుంది. పాఠకుల నిరాదరణకు గురవుతుంది. అలాగే మితిమీరిన స్వేచ్ఛ ఏఅనువాదంలోనైనా తగదు, అదిపూర్తిగా అనుసృజన (adaptation) అయితేతప్ప. అనువాదం స్వతంత్ర రచనలాగా ఉండాలనుకున్నదానికి కొన్ని పరిమితులుఉంటాయి. ఏ అనువాదం అయినా మూలగ్రంథాన్ని లక్ష్యభాషలోకి, మూలభాష తెలియని పాఠకులకోసం అందుబాటులోకి తెస్తుంది. అదిమూలాన్ని లక్ష్యభాషలోప్రతిబింబించే లాగా ఉండాలి, కానీ పూర్తిగా రూపాంతరంచేసేదిగా ఉండకూడదు. మూలభాషా గ్రంథంతో ఏమాత్రం సారూప్యం లేకుండా ఉండకూడదు.

సాహిత్యానువాదాలకు సంబంధించి అనువాదకులు తీసుకునే స్వేచ్ఛ వివిధ పరిణామాలలో ఉంటుంది. అనువాదాన్ని కేవలం అనువాదంగా తీసుకొని చేయటం.అనువాదంగా ప్రకటించి చేసినప్పుడు అనువాదం చాలా వరకు మూలానికి దగ్గరగాఉంటుంది. అలాకాక, అనువాదాన్ని మూలానికి అనుసృజన అనో, అనుకరణ అనో అన్నప్పుడు అది మూలానికి దూరంగా, లక్ష్యభాషకు దగ్గరగా, దాదాపుగా లక్ష్యభాషలో స్వతంత్రంగా రాసిన గ్రంథంలాగా ఉంటుంది. అయితే ఈప్రక్రియలలో కూడా అనువాదకునికీ,అసలు రచయితకూ, అలాగే మూలభాషకూ లక్ష్యభాషకూ ఉన్నసంబంధ బాంధవ్యాలను బట్టి అనేక తేడాలుంటాయి. ఏఅనువాదానికి సంబంధించినది అయినా అనువాదకుడు ఎంతమేరకు స్వేచ్ఛ తీసుకుంటే అది అనువాదంగా ఉంటుంది, ఏమేరకు స్వేచ్ఛతీసుకుంటే అది మితిమీరిన స్వేచ్ఛఅవుతుంది అనేది ఇతమిద్దంగా చెప్పటం కష్టం. అనువాదం అంటే ఏమిటి? (what is a translation?), అనేదాన్ని చెప్పవచ్చు గానీ, అనువాదం కానిది అంటే ఏమిటి? (what is not a translation?),అనువాదం ఎప్పుడు అనువాదం అవుతుంది? (what does a translation cause to be a translation) అనేది తేల్చి చెప్పటం కష్టం.

భారతీయ భాషలలోకి విదేశీభాషలనుండి, ముఖ్యంగా ఇంగ్లీషు, రష్యను భాషలనుండి వచ్చిన అనువాదాలను పరిశీలిస్తే ఇవి అన్నీ ఒకరకంగా స్వేచ్ఛానువాదాలే అనేవిషయం తెలుస్తుంది. వీటిలోకొన్ని అనుసృజనలు కూడాఉన్నాయి. ఇదే వరవడి భారతీయభాషల మధ్య, ఒక భాషనుండి మరొకభాషకు జరిగిన అనువాదాల విషయంలో కూడా కనిపిస్తుంది. ఇదిమూలభాష నుండి నేరుగా చేసిన అనువాదాలకూ, పరోక్షంగా మరోభాషలనుండి వచ్చిన అనువాదాలు నుండి చేసిన అనువాదాలకు కూడా వర్తిస్తుంది.

రవీంద్రనాథ్ టాగూర్, శరత్ చంద్ర, ప్రేమ్ చంద్ వంటి ప్రముఖ భారతీయ రచయితల రచనలు తెలుగులోకి 20వ శతాబ్దంలో విరివిగా అనువదించబడ్డాయి. వీటిలో కొన్నిమాత్రమే అనువాదాలు అధికశాతం అనుసృజనలు లేదా ఆంధ్రీకరణలు. వీటికి తెలుగు పాఠకులనుండి మంచిఆదరణ లభించింది. తర్వాతి కాలంలో ముఖ్యంగా 20వ శతాబ్దపు చివరి దశకంలోనూ, 21వశతాబ్దంలోనూ వచ్చిన అనువాదాలు, అనువాద అధ్యయనంలో వచ్చిన సరికొత్త ధోరణులకు అనుగుణంగా మూలభాష సంస్కృతులకూ, మూలరచనలకూ, రచయితలకూ, అధిక ప్రాధాన్యం ఇచ్చేవిగా కనిపిస్తాయి. ఇటువంటి అనువాదాలలో ఒక కొత్త సమస్య ఉత్పన్నమైంది. వీటిలో ఉపయోగించబడిన తెలుగుభాష కొంత కృత్రిమంగా, అటుమూలభాషకూ, ఇటులక్ష్యభాషకూ,మధ్యస్థంగా, మూడవ భాషగారూపుదిద్దుకుంటుంది. నిజానికి ఏఅనువాదంలోనైనా మూలభాష, మూలరచన ప్రభావం ఎంతోకొంత ఉండనేఉంటుంది.

ప్రపంచవ్యాప్తంగా చాలామంది అనువాద అధ్యయన పరిశోధకులు అనువాదగ్రంథాలలో కనిపించే భాషను అధ్యయనంచేసి, అది లక్ష్యభాషలోచేసిన స్వతంత్రరచనలకు భిన్నంగా ఉంటుందని. తులనాత్మక అధ్యయనాలు (comparative studies)ముఖ్యంగా భాషానిధుల ఆధార అధ్యయనాల (corpusbased studies) ద్వారా నిరూపించారు (మోనాబేకర్, 1995,1996,1999: బర్నెట్,ఎస్.,1999 బీ ఓలహాన్, ఎమ్.,మో. బేకర్, 2000: శోషనాబ్లమ్– కుల్కా 2000).

ఈవ్యాసంలో మా ముఖ్యఉద్దేశంకూడా అనువాద గ్రంథాలలో కనిపించే తెలుగుకూ, స్వతంత్రరచనలలో కనిపించే తెలుగుకూ గల తేడాను కొన్ని ఉదాహరణలద్వారా పాఠకుల దృష్టికి తీసుకురావటమే.

ఏఅనువాదమైనా మూల విధేయంగా ఉండాలంటే పదాలనూ, పదబంధాలనూ, పదప్రయోగాలనూ మూలంనుండి మక్కికి మక్కీ తెలుగులోకి అనువదించటం కాకుండా, వాటిభావాన్ని (సారాంశాన్ని) గ్రహించి దాన్ని తెలుగులో సహజసిద్ధంగా ఎలా చెబుతామో అలాచెప్పాలి. ఈ అనువాద విధానం అటుమూల రచనకూ, ఇటులక్ష్యభాషకూ కూడా న్యాయం చేసేదిగా ఉంటుంది. మూల రచనలోని ప్రతిపదానికీఅర్థం తీసుకొని అనువదిస్తే అనువాదం చాలా కృత్రిమంగా, సహజమైన లక్ష్యభాషగా ఉండదు. ఉదాహరణకు మరియు అనే పదం చాలా అనువాదాలలో కనిపిస్తుంది, కానీ ఒక్క స్వతంత్రరచనలో కూడాకనిపించదు. ఈపదాన్ని చూడగానే అదిఅనువాదం అనితెలిసిపోతుంది. ఇంగ్లీషులో and హిందీలో ఔర్ ఉంటాయి కాబట్టి తెలుగు అనువాదంలో వాటిస్థానంలో మరియును వాడుతుంటారు కొందరు అనువాదకులు. తెలుగులో దీన్ని వాడవలసిన అవసరంలేదు. కామా(,)సరిపోతుంది.

మరికొన్ని ఉదాహరణలను ఒక అనువాద నవలను తీసుకొనిపరిశీలిద్దాం. పేర్లుచెప్పటం సమంజసంకాదు కనుక ఆవివరాలను ఇక్కడ ఇవ్వటంలేదు. ఇది సాహిత్యఅకాడమీ ప్రచురణ. ఇందులో వాడిన తెలుగుభాషలీ అక్కడక్కడ కొంత కొత్తదనాన్ని సంతరించుకొని, తెలుగేతరభాషగా కనిపిస్తుంది. కొత్త కొత్త పదాలూ, పదబంధాలూ, పదప్రయోగాలూ కనిపిస్తాయి. మచ్చుకు కొన్ని వాక్యాలను గమనించండి:

–తలుపును దృఢంగా తన్నాడు

–చాలా తక్కువగా క్లిష్టపరిస్థితులు ఎదురవుతాయి.

–నిజానికి క్లిష్టం కానిది.

–ఈపలాయనం మాకు నిషిద్ధమైనది

. –కుర్రాడికి ముద్దు హెచ్చయింది.

– మాకు కలిగే అనిష్టము ...

– అతి సూక్ష్మమైన ఒకక్షణంలో నాలో తాత్కాలికమైన విరామము కలిగినట్లయి.

– డ్రెస్సింగ్ టేబుల్ సగం మేరకు వెలుగునిండిన గదిలో పైశాచికమైన శూన్యతగా కనిపించే మరకలు కట్టిన అద్దం.

– నీ అభిరుచి ఎంత నాసిగా ఉంది!

–ఆ మగాడి ముఖంలో ఉదాసీనమైన శూన్యత గోచరిస్తుంది.

పైవాక్యాలు చాలా కృత్రిమంగా ఉన్నాయి. తెలుగులో స్వతంత్రరచన చేసేవారు ఇటువంటి వాక్యాలు రాయరనేది నా అభిప్రాయం. ఈనవల ఇంగ్లీషు నుండి తెలుగుకు చేసిన అనువాదం కనుక ఇంగ్లీషు వాక్యాలను, వాటిలో కొన్ని పదాలను లిటరల్‌గా (మక్కికిమక్కీ) అనువదించడంవలన ఇటువంటి వాక్యాలు పుట్టుకొచ్చాయి. తెలుగులో సహజంగా ఇలాంటి వాక్యాలను మనం గమనించం.

ఉదాహరణకు 'తలుపును దృఢంగా తన్నాడు' అనటానికి బదులు 'తలుపును గట్టిగా/బలంగా తన్నాడు' అంటే సహజంగా ఉంటుంది. ఈభాష విషయంలో అనువాదకులు కొంత ప్రత్యేకశ్రద్ధ తీసుకొని మూలభావాన్ని ఆకలింపు చేసుకొని, దానిని తెలుగు సాంప్రదాయానికి అనుగుణంగా వ్యక్తపరిస్తే అనువాదాలభాషకూ, స్వతంత్రరచనలభాషకూ మధ్యగల వ్యత్యాసం తగ్గిపోతుంది. అనువాదాలకూ చదివించే సామర్థ్యం (readability) పెరుగుతుంది. దాంతో పాఠకులనుండి మరింత ఆదరణ లభిస్తుంది.

ఇకపోతే మరోవిషయం ఆంగ్లంలో భారతీయ రచనల (Indian writing in English)కు పాఠకవర్గం (readership) చాలావిస్తృతంగా ఉంటుంది. మనదేశంలో ఉన్న ఇంగీష్ తెలిసిన పాఠకులతోపాటు ఇంగ్లీష్ బాష తెలిసిన ఎవరైనా, ఈప్రపంచంలో ఏమూలన ఉన్నా ఈ ఇంగ్లీషు రచనలకు పాఠకులు కావచ్చు. ఈ కారణంగా మన భారతీయసంస్కృతి సాంప్రదాయాలకు సంబంధించిన ఎటువంటి పదాలూ, పేర్లూ, పురాణ ఇతిహాసాలకు సంబంధించిన గ్రంథసూచికలు (రెఫరెన్సెస్) ఈరచనలలోఉన్నా భారతీయేతర పాఠకుల ప్రయోజనార్థం వాటికి వివరణ పుస్తకం చివరిలో పట్టికగా ఇవ్వటంపరిపాటి. అయితే ఈరచనలను మనం భారతీయభాషల్లోకి అనువదించేటప్పుడు ఆవివరణల పట్టిక అవసరం ఉండదు. అవన్నీ పాఠకులకు సుపరిచితమైనవే అయిఉంటాయి.

ఈవ్యాసంలో నేను ప్రస్తావిస్తున్న అనువాదం కూడా ఆంగ్లంలో భారతీయ రచనల(Indian writing in English) కు చెందిన నవల అనువాదమే కనుక అందులో చివర చేర్చి నా అపూర్వ పదాల పట్టిక అవసరంలేదు. ఉదాహరణకు ఆపట్టికలో వివరణ ఇచ్చిన ఈ క్రింది పదాలను గమనించండి.

దశరథుడు, జగన్నాథ్, సచివాలయం, పూజ, మోక్షము, మంగళగౌరీపూజ, శివసేన, SSC పరీక్ష, లారీ,కుంకుమ మొ. ఈపదాలన్నీ తెలుగువారికి తెలిసిన వేమూలంలో ఉంది. కాబట్టి అనువాదంలో కూడా ఇవ్వాలి. అనే నియమం ఏమీలేదు. మూలరచన ఎవరిని ఉద్దేశించిరాయబడినది. తమ అనువాదం ఎవరికోసం చేస్తున్నాం? అనేవిషయం అనువాదకులు మొట్టమొదటే గ్రహించుకోవాలి. దానికి అనుగుణంగా ఇలాంటి పట్టికలో వివరణ ఇచ్చిన పదాలు తమ పాఠకులకు పరిచయమైనవా కావా, అనే విషయం ఆలోచించుకొని, అవసరమనిపిస్తే తప్పకుండా ఇవ్వవచ్చు.

ముగింపుగా ఒకమాట: ఏరచనకైనా పాఠం, సందర్భం (text,context) రెండూఉంటాయి. అనువాదకులు మూలాన్ని చదివి అర్థం చేసుకునేటప్పుడు దాన్ని సందర్భోచిత అంశాల contextual aspects)ను కూడా అర్థంచేసుకొని, పాఠం(text)ను సందర్భం(context)తో అన్వయించుకోవాలి. అలాగే తమ అనువాదాన్ని కూడా సందర్భోచితంగా contextual aspects)చేసుకుని తథానుగుణంగా అనువదించు కోవాల్సిఉంటుంది. తాము ఎందుకు, ఎవరికోసం ఏసందర్భంలో చేస్తున్నామో అర్థం చేసుకున్నాకే అనువాదం మొదలుపెట్టడం సమంజసం. అనువాదకుడు ఎంచుకొనే అనువాదవిధానం ఈసందర్భోచిత అంశాల(contextual aspects) మీదేఆధారపడి ఉంటుంది. ఏఅనువాదమైన యాంత్రికంగా చేసేదికాదు. అనువాదకుల అనుభవం, సృజనాత్మకత, రెండుభాషల, సంస్కృతులపై గల పట్టు ఏ అనువాదకులకైనా కీలకం. పాఠకులు కూడా అనువాదాల ప్రాముఖ్యతను గుర్తించి, అనువాదకులను మూల రచయితలలో సమానంగా గౌరవించడం మరిన్ని నాణ్యమైన అనువాదాలు

తెలుగులోనేకాక, ఇతరభారతీయభాషలో కూడా రావడానికి ఎంతగానో దోహదపడుతుంది.

**ఉపయుక్త గ్రంథాలు :**

బేకర్,మో. 1995. 'కార్పోరా ఇన్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్: యాన్ ఓవర్‌వ్యూ అండ్ సమ్ సజెషన్స్ ఫర్ ఫ్యూచర్ రీసెర్చ్', టార్గెట్ 7 (2): 223-243.

బేకర్, మో. 1996. 'కార్పస్-బేస్డ్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్: ది ఛాలెంజెస్ దట్ లై ఎహెడ్' ఎచ్ సోమర్స్ (సం.) టెర్మినాలజీ, ఎల్.ఎస్.పి. ఇంకా ట్రాన్స్‌లేషన్ స్టడీస్ ఇన్ లాంగ్వేజెస్ ఇంజనీరింగ్ లో జాన్ బెంజిమాన్స్, 175-186.

బర్నెట్, ఎస్. 1999. కార్పస్-ఆధారిత అనువాద ఆంగ్ల అధ్యయనం, మాంచెస్టర్: అప్రచురిత ఎమ్.ఎస్సి. డిసర్టేషన్, UMSIST.

షోష్యనా బ్లమ్- కుల్కా. 2000.'అనువాదంలో సమన్వయం మరియు పొందిక యొక్క మార్పు'. వెనూటి, బి. లారెన్స్, ట్రాన్స్లేష న్ స్టడీస్ రీడర్‌లో ప్రచురితం (298-313).రూట్లెడ్జ్.

ట్యూరీ, గిడియాన్. 1995. డిస్క్రిప్టివ్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్ అండ్ బియాండ్. జాన్ బెంజిమన్, వెనూటి, బి. లారెన్స్(సం.) అనువాద అధ్యయనాల రీడర్. రూట్లెడ్జ్.

రచయితలు ఆంగ్ల మరియు విదేశీ భాషలవిశ్వవిద్యాలయంలో ఆచార్యులు, హైదరాబాద్

## గ్రంథాలయం

**తెల్లారని రాత్రి**
ఒక నవలికా,19 వ్యాసాలు
కలిసిన సంపుటం
**రచన: రంగనాయకమ్మ**
పుటలు: 224
వెల రూ:100
ప్రచురణ :స్వీట్ హోమ్ పబ్లికేషన్స్
76,అమర్ సొసైటీ,జూబ్లీహిల్స్
పోస్టు, హైదరాబాద్ -33
ప్రతులకు : అరుణా పబ్లిషింగ్
హౌస్, ఏలూరు రోడ్,
విజయవాడ -520002
ఫోన్: 9440630378




## కవిత

# నేను అనుకున్నాను..

నేను అనుకున్నాను..
ఈ సుందర సుమధురమైన
ప్రకృతి సమస్త మానవాళికి ప్రాణవాయువను
మానసిక ఆనందాన్ని ఉల్లాసాన్ని అందిస్తుందని
కానీ మనిషి స్వార్థానికై ఇష్టం వచ్చినట్టు
విచ్చలవిడితనంతో ప్రకృతిపై విరుచుకుపడుతుంటే
ప్రకృతి ఎలా ఆనందాన్ని పంచగలదు !!

నేను అనుకున్నాను..
మనిషికి మనిషికి ప్రేమానురాగాలు పెరిగి పవిత్రమైన మానవాళికి
అమృత ప్రేమ దొరుకుతుందని
కానీ మనుషుల్లో స్వార్థం పెరిగి కుళ్ళు కుతంత్రాలు కుట్రలు
మోసపూరితమైన దౌర్జన్యాలు పెరిగి విలయతాండవం చేస్తుంటే
ఎలా దొరుకుతుంది స్వచ్ఛమైన అమృత ప్రేమ!!

నేను అనుకున్నాను..
భరతమాత తన ముద్దుబిడ్డలకి
కులం మతం లేని సమాజాన్ని అందిస్తుందని
కానీ అడుగడుగున కులమతాల అడ్డుగోడలు వేసి మానవాళికి
కులమతాల రంగు దిద్దిస్తుంటే
ఎలా దొరుకుతుంది కులం లేని సమాజం!!

నేను అనుకున్నాను..
రాజ్యమేలే నాయకులు అందరికోసం
నిలబడి న్యాయం నాలుగు స్తంభాలపై నిలబెట్టి
పేదా ధనికా తేడా లేని సమన్యాయాన్ని అందిస్తుందని
కానీ నాయకుల రంగస్థలంపై ఆడే
ఆట బొమ్మలా మారి వేషభాషాలు మార్చి
ఉన్నోడికి ఒక న్యాయం లేనోడికి ఒక న్యాయం అందిస్తుంటే
ఎక్కడ సమన్యాయం దొరుకుతుంది!!

- లక్ష్మి శ్రీనివాస్
9676601192

**దేశ భాషాభిమానము తోడిదే దేశాభిమానము, ఏ కులమువారైనా, ఏ మతమువారైనా ఏ దర్జావారైనా తెలుగు మాతృభాషగా గలవారందరూ ఒక్క సంఘమువారనన్ని, సంఘములోని వారందరూ అభివృద్ధి పొందితేనే కాని,సంఘము అభివృద్ధి పొందననిన్ని, ఎవరు వెనుకబడ్డా సంఘమునకు నష్టమే అనిన్నీ ఎవరు త్రికరణశుద్ధిగా భావిస్తారో వారే దేశాభిమానము గలవారని చెప్పవలెను.**

**- గిడుగు వెంకట రామమూర్తి**

రహ్మానుద్దీన్ షేక్
9493035658

# తెలుగు నుడిపెన్నిధి(మహాపదనిధి/లింగ్విస్టిక్ కార్పొరా)

## తెలుగు భాష ఆనవాలువు డాక్యుమెంటేషన్ వరుసలో మూడవ వ్యాసం

భాష మానవ సంభాషణలకు ఉసురు. భాష మన చుట్టూ ఉన్న ప్రపంచంలో, మన పరిసరాలతో, మనం చేసే ఆలోచనలకు, ఆవేశాలకు, భావాలకు, పరస్పర ప్రతిస్పందనలకు ఒక రూపాన్నిస్తుంది. అంతే కాదు. భాష తరతరాలుగా మన సాంస్కృతిక వారసత్వాన్ని, మన సంప్రదాయాలను, మన పూర్వీకులు తాము తెలుసుకుని మనకు అందచేసిన జ్ఞానాన్ని తన పదాల్లో ఇనుమడింపచేసుకుని మనకు అందిస్తుంది. కానీ, మారుతున్న ప్రపంచంలో ఎన్నో భాషలు కనుమరుగవుతున్నాయి. మరెన్నో భాషలు కనుమరుగయ్యే ప్రమాద స్థాయి అంచున ఉన్నాయి. ప్రత్యేక భాషను మాట్లాడే వ్యక్తుల సంఖ్య తగ్గే కొద్దీ ఆ భాష తనలో ఇముడ్చుకున్న జ్ఞానమంతా కరుగుతూ వస్తూంది. ఈ సందర్భంలో భాషలోని పదాలన్నిటినీ ఒక చోట చేర్చుకుని ఒక మహాపదనిధిని, భాషలోని నుడిపెన్నిధి(మహాపదనిధి / పలుకుల-మాటల పెన్నిధి / లింగ్విస్టిక్ కార్పొరా) తయారు చేసుకోవడం వలన భాషలను పదిలపరుచుకోవటమే కాక భాషలను అభివృద్ధి చేసుకునే అవకాశమూ ఉంటుంది. భవిష్యత్తు తరాలకు భాషను అందించడంతో పాటుగా భాషలో ఇమిడి ఉన్న సంప్రదాయాలను, సాంస్కృతిక వారసత్వాన్ని మరింత సుసంపన్నం చేసి అందించ గలుగుతాం.

**నుడిపెన్నిధి అంటే?**

నుడిపెన్నిధి అనేది భాషాపరమైన అంశాల గుత్తి. ఇది సాధారణంగా ప్రామాణికంగా ఉంటుంది. ఈ మధ్య నుడిపెన్నిధి అంటే అది యంత్రానుకూల రూపంలో(కంప్యూటరీకృత రూపంలో) అందుబాటులో ఉండే పదాల సమూహమనే భావన ఉంది. ఈ నుడిపెన్నిధిలో రకరకాల భాషా సామగ్రి ఉండవచ్చు. మాట్లాడే భాషలోని పదాలు, రాత భాషలోని పదాలు, రోజువారీ సంభాషణల్లో వ్యవహరించే పదాలు, పుస్తకాల్లో పదిల పరిచిన పదాలు, సాంకేతిక పదాలు, వార్తలు, కథలు, నవలలు, నాటకాలు, పద్యాలు, ఇవన్నీ నుడిపెన్నిధిలో ఉంటాయి. భాషలో సహజంగా వాడే వివిధ సందర్భాల వివిధ పదాలన్నిటినీ ఒక చోట చేర్చడం ద్వారా నుడిపెన్నిధి మనకు భాషాపరమైన పనులు చేసుకునేందుకు ఒక పెద్ద ఉపకరణంగా పరిణమిస్తుంది. భాషాపరమైన విశ్లేషణలకు, భాషాలో జరగాల్సిన సాంకేతిక అభివృద్ధికి, భాషను పదిల పరిచే శ్రమకు ఒక మంచి వనరును మనకిస్తుంది.

**భాషను పదిలపరచటంలో నుడిపెన్నిధి పాత్ర**

భాషను పదిలపరచటమంటే (భాషా పరిరక్షణంటే) భాషలోని పదాలు, వాటి వైవిధ్యభరితమైన వాడకం, అంతరించిపోతున్న పదబంధాలు మొ? అన్నీ రాబోయే తరాలకు యథాతథంగా (లేదా మెరుగుపరిచి) అందించే బాధ్యతను తీసుకోవటం. భాష ఒక తరంలో అందరూ చక్కగా వాడుతూ, తమ తరువాతి తరానికి సైతం అందించాలి. నుడిపెన్నిధి ఈ పని చేయడంలో సమర్థవంతమైన పాత్రను పోషిస్తుంది. ఏదైనా కాలంలో భాష స్వరూపం ఎలా ఉండేదో ఆ సంబంధమైన సమగ్రసమాచారాన్ని నుడిపెన్నిధి చెప్పగలదు. వివిధ సందర్భాలలో భాష స్వరూపంలో వచ్చిన మార్పును, పదాల వాడకంలో దేశ-కాల-సందర్భానుసారం జరుగుతున్న మార్పును, వాడకాన్ని పరిశీలించడానికి పనికొచ్చే ఈ నుడిపెన్నిధి వలన మనం వ్యాకరణపరమైన సిద్ధాంతాలను, పదప్రయోగసూచికలను, వాక్య వాడుక విన్యాసాలను మనం సూత్రీకరించుకోగలుగుతాము. ఇది భాషాభివృద్ధికి, భాషను కాపాడుకొని పదిల పరుచుకోటానికి చాలా అవసరం, అనివార్యం కూడా.

ఈ విధంగా నుడిపెన్నిధి సేకరణ ద్వారా మనం చాలా ప్రయోజనాలు పొందవచ్చు. అందులో కొన్ని ప్రయోజనలాను ఇక్కడ చెబుతున్నాను:

1. భాషలో వస్తున్న మార్పును గుర్తించి, విశ్లేషించగలగడం : నుడిపెన్నిధి భాషాశాస్త్రవేత్తలకు కాలానుగమనంలో భాషలో వచ్చే మార్పులను పరిశీలించేందుకు ఒక వనరుగా పని చేస్తుంది. వ్యాకరణంలో, పదజాలంలో, వాక్యనిర్మాణంలో వస్తున్న పరిణామక్రమానికి ఒక లోచూపును (అంతర్దృష్టిని) ఇస్తుంది.

2. భాషబోధనాసామగ్రి రూపకల్పనలో దోహదం : నుడిపెన్నిధి భాషబోధనాసామగ్రి రూపకల్పనలో, భాష యొక్క స్వస్వరూపాధ్యయనంలో, వ్యవహార వాడుకలో కావాల్సిన వనరులను అందించే మూలనిధిగా పని చేస్తుంది.

3. భాష పరిపుష్టానికి దోహదం: భాషలో సాంకేతిక ఉపకరణాల(యంత్రానువాదం, మాట గుర్తుపట్టే ఉపకరణం, సహజ భాషా ప్రక్రియలు మొ?) తయారీ కోసం నుడిపెన్నిధి మొదటి మెట్టు అవుతుంది, ఇక్కడా మూలనిధి పాత్రను పోషిస్తుంది. ఆయా సాంకేతిక ఉపకరణాల అభివృద్ధి ద్వారా భాషను కాపాడుకోవటమే కాక మరింత పరిపుష్టం చేసుకోగలుగుతాం.

4. భాష పునరుజ్జీవానికి దోహదం: నుడిపెన్నిధిని వాడి ఎవరైనా భాషను అభ్యసించే వనరులను తయారు చేసుకోవచ్చు, అక్షర లక్షణాలను(ఆర్థోగ్రఫీ) ప్రామాణీకరించవచ్చు, ఇంతకు ముందు వాడకం లేని రంగాలలో(ఉదాహరణకు సాంకేతిక విద్య, వైద్య విద్య) భాషను ప్రవేశపెట్టవచ్చు.

**భాషాభివృద్ధిలో నుడిపెన్నిధి పాత్ర**

భాషాభివృద్ధి భాషను కాపడటం కన్నా ఒక మెట్టు పైన ఉంది. ఉన్న భాషను ఆపళంగా కాపాడుకోవటంతో పాటుగా ప్రస్తుతం భాషలో వస్తున్న మార్పులను కలుపుకుంటూ మారుతున్న ప్రపంచంలో ఆ భాషను మాట్లాడే వ్యక్తులు ఇమిడేందుకు అవసరమైన పదాలను, మాటలను కలుపుకోవాలి. వారు ఇమడటంతో పాటుగా అన్ని రంగాలలో

ముందంజలో ఉండాలంటే నుడిపెన్నిధి పాత్ర చాలా ఉంది.

**నుడిపెన్నిధి ఏ విధంగా భాషాభివృద్ధికి దోహదం చేస్తుందని ఆలోచించగా, నాకు తోచిన కొన్ని మార్గాలు:**

**1. భాషావనరుల వ్యాప్తికి దోహదం:** వివిధ రంగాలలో ఆ భాషలో పరిశోధనలు, అభివృద్ధి, కొత్త ఆలోచనలు పుట్టుకు రావటం జరగాలంటే ఆయా రంగాలకు సంబంధించిన పదజాలం భాషలోకి రావటం అవశ్యకం. అందుకు నుడిపెన్నిధి సహకరిస్తుంది.

**2. భాషావిధాన అవగాహన :** నుడిపెన్నిధి మన గతంలో వివిధ కాలాలలో భాష వాడుకను, సరళిని, అవసరాలను తెలియపరుస్తూ వాటికి సాక్ష్యంగా నిలుస్తుంది. ఆ సాక్ష్యాలను వాడుకొని భాషా విధానాలను రూపొందించుకోవచ్చు.

**3. భాషా ప్రణాళికలో సహకారం:** భాష పరిరక్షణ, భాషాభివృద్ధి, ఆ భాషను మాట్లాడే సముదాయపు అవసరాలు - ఈ మూడూ వేరు వేరు అంశాలు, ఈ మూడింటినీ సమన్వయ పరుచుకోకపోతే భాష మనుగడకే ప్రమాదం. ఈ మూడిటినీ సమన్వయ పరుస్తూ జరగాల్సిన ప్రణాళికల తయారీలో నుడిపెన్నిధి చాలా సహాయ పడుతుంది.

**4. భాషలో సాంకేతిక ఉపకరణాల అభివృద్ధి :** భాషాభివృద్ధికి దోహదపడే సాంకేతికోపకరణాలున్నాయి - నుడిదిద్దరి ( నిర్దుష్టంగా పదాలను సరిచేసే యంత్రం/స్పెల్ చెకర్), నుడికట్టడిదిద్దరి (వ్యాకరణాన్ని సరిచేసే ఉపకరణం/గ్రామర్ చెకర్), నుడిమార్పుమర (యంత్రానువాద వ్యవస్థ/ మషిన్ ట్రాన్స్లేషన్ సిస్టం) మొ?. వీటిని తయారు చేసుకోవటానికి, ఉన్న ఉపకరణాలను మరింత మెరుగు పరుచుకోవటానికి నుడిపెన్నిధి చాలా అవసరం.

**5. భాష ప్రామాణీకరణకు హేతువు:** సంభాషణలలో, సాంస్కృతిక లావాదేవీల్లో తెలుగులో ఉండే అన్ని మాండలికాలకు, యాసలకు మధ్య నుడిమార్పుమరలుండటం అవసరమే కానీ సమీప భవిష్యత్తులో అన్ని తెలుగులకు ఒక ప్రామాణిక తెలుగుండి, ఆ ప్రామాణిక తెలుగు ఆధారంగా నుడిమార్పు జరిగితే నుడిమార్పుమరలను తయారు చేసుకోవటం సులువు అవుతుంది. అలాంటి ప్రామాణిక భాషను రూపొందించడంలో నుడిపెన్నిధి సహాయపడగలదు.

నేటి సాంకేతిక యుగం సమాచార యుగం. మన చుట్టూ ప్రపంచాన్ని నడిపే ఇంధనం సమాచారం అయిపోయింది. తెలుగులో ఎంత ఎక్కువ సమాచారం ఆన్లైన్ చేరితే, ఎంత ఎక్కువ సమాచారం కంప్యూటరీకరణ చెంది అందరికీ వలగూడు(అంతర్జాలం/ఇంటర్నెట్) ద్వారా అందుబాటులోకి వస్తే అంత మంచిది. అలా చేరిన సమాచారాన్ని సేకరించి, పేర్చి, విశ్లేషిస్తే, భాషావేత్తలకు భాషలోని వాడకంపై, భాషలోని పదాల అమరిక, వాక్యవిన్యాసం పై ఒక రకమైన లోచూపు వస్తుంది. ఈ లోచూపు ద్వారా కలిగే జ్ఞానంతో భాషాబోధన సామగ్రి తయారీ కోసం, భాషలో సాంకేతిక ఉపకరణాల అభివృద్ధి కోసం, కనుమరుగు అంచుల్లో ప్రమాదస్థాయిలో ఉన్న భాషలను కాపాడటం కోసం భాషాశాస్త్రవేత్తలు అనేకానేక చర్యలు చేపట్ట గలుగుతారు. అందుకు నుడిపెన్నిధి ఒక మహాస్త్రంలా పనికొస్తుంది. ఎంతటి ప్రపంచీకరణ, సాంకేతిక పెనుమార్పులు వచ్చిన భాష మనుగడకు ఎలాంటి ప్రమాదమూ రాదు.

**తెలుగులో నుడిపెన్నిధి ప్రస్తుతావస్థ:**

తెలుగు భాష సాంస్కృతికంగా బాగా ఎత్తులో ఉన్న భాష. కొన్ని సాంస్కృతిక కళారూపాల(కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్యం, దండకం విధానంలో పూజ, జానపద ప్రదర్శనాకళారూపాల సాహిత్యం మొ?) పరిరక్షణ చేయాలంటే తెలుగు భాషా పరిరక్షణతో అది ముడిపడి ఉంది. తెలుగు పద్యాల్లో జరిగే పదవిన్యాసాల వలన ఆయా పద్యాల్లో వాడిన తెలుగు భాష లిఖిత రూపంలో పదిలం. భారతదేశ ప్రభుత్వం చేపట్టిన జనాభా లెక్కల అంచనా ప్రకారం మాతృభాషగా తెలుగు మాట్లాడే వారు 8.3 కోట్లున్నారు, తెలుగు మాతృభాష కాకపోయినా రెండవ భాషగా తెలుగును మాట్లాడేవారి సంఖ్య 1.3 కోట్లు. సరాసరి పది కోట్ల మంది తెలుగువారున్నారు. మాతృభాషా పరంగా జనాభా లెక్కలు మరింత నిర్దుష్టంగా జరిగితే తెలుగు మాట్లాడే వారి సంఖ్య 20 కోట్లకు పైగానే ఉండవచ్చు. సినిమా ప్రభావం చేత, రాజకీయాల వలన కొత్తగా ఉత్తర భారతదేశం వారు, ప్రాచ్య, పాశ్చాత్య దేశాల వారు సైతం వందల సంఖ్యలో తెలుగు నేర్చుకుని మాట్లాడుతున్నారు. గత వెయ్యేళ్ళకు పైగా సాహిత్యం తెలుగులో కలదు. యేటా కొత్త రచయితల రచనల ద్వారా, వారం వారం యూట్యూబ్ మరియు ఇతర సామాజిక మాధ్యమాల్లో వేల సంఖ్యలో దృశ్యకాల(వీడియోలు), శ్రవ్యకాల(ఆడియోల) ద్వారా చాలా సమాచారం తెలుగులో వచ్చి చేరుతోంది. ఇంత పెద్ద ఎత్తున వచ్చి పడుతున్న సమాచారాన్ని కాపాడి, ప్రచార-ప్రసారాలు చేయటమనేది స్వర్గానికి నిచ్చెనేయటం లాంటి పని. సమకాలీన సాహిత్యాన్ని నకలుహక్కుల పరిమితుల వలన తీసుకోకపోయినా తెలుగులో కోట్ల సంఖ్యలో సార్వజనీన సాహిత్యం అందుబాటులో ఉంది. అందులో చాలా వరకూ డిజిటీకరణ అవ్వకపోయినా, డిజిటీకరణకు సిద్ధంగా ఉంది(డిజిటల్ స్కాన్ల రూపంలో). అలా పేరుకున్న సమాచారాన్నంతటినీ సేకరించి, ముందనుకున్న నిబంధనలననుసరించి పేర్చి, విశ్లేషించుకుంటే మనకెంతో ఉపయోగకరమవుతుంది కదా. నుడిపెన్నిధి ఉన్నది ఆ పని కోసమే. భాషలోని లోతులను, లోపాలను, సంపదను, వెలితిని కనిపెట్టేందుకు భాషా శాస్త్రవేత్తలకు, ఔత్సాహికులకు, విద్యార్థులకు, సాహిత్య విశ్లేషకులకు ఈ నుడిపెన్నిధి నిజంగానే ఒక నిధి.

అయితే నుడిపెన్నిధి రూపకల్పనకు తెలుగులో కేవలం విశ్వవిద్యాలయాల స్థాయిలో మాత్రమే పని జరుగుతోంది. విశ్వవిద్యాలయాల్లో జరిగే ప్రత్యేక పరిశోధనలకు సహకరించేలా ఈ నుడిపెన్నిధుల రూపకల్పన ఉంటోంది. అందువలన ఈ నుడిపెన్నిధులు పరిమతంగా ఉంటున్నాయి. ఇంత పరిమితులున్న నుడిపెన్నిధులైనా అందరికీ అందుబాటులో ఉండవు. సాంకేతిక పరిమితుల వలన, పైన చెప్పుకున్న నకలు హక్కుల వలన తెలుగులో నుడిపెన్నిధి అందరికీ అందుబాటులో ఉండటం లేదు.

నుడిపెన్నిధులు పలు రకాలు: ఒంటరి నుడిపెన్నిధి(ఇందులో ఒక్క భాషలోని పదాలు మాత్రమే ఉంటాయి), జంటనుడుల నుడిపెన్నిధి (ఈ నుడిపెన్నిధిలో రెండు భాషల పదాలు ఒకదానికి ఒకటి జతచేసి ఉంటాయి - అర్ధపరంగా ఒకేలా ఉండే పదాల జంట), పరిచ్ఛేదానుసరణ/వాక్యానుసరణ నుడిపెన్నిధి (ప్యారలల్ కార్పొరా/

సమాంతర నుడిపెన్నిధి).

**ఒంటరి నుడిపెన్నిధి:**

ఒంటరి తెలుగు నుడిపెన్నిధిలో కేవలం తెలుగు పదాలే ఉంటాయి. తెలుగు భాషలో వాడే పదాలు, మాటలు, వాక్యాలు ఈ నుడిపెన్నిధిలో ఉంటాయి. భాష నుడికట్టడి(వ్యాకరణం), పదజాలం(వొకాబులరీ), వాడకం వరుస (పదప్రయోగ విన్యాసం) మొ? అంశాలపై భాషాశాస్త్రవేత్తలకు ఈ నుడిపెన్నిధి లోచూపును ఇస్తుందని పైన చెప్పుకున్నాం కదా. అలాగే భాష ప్రస్తుత రూపాన్ని, ప్రస్తుత రూపానికీ, మూలద్రావిడ రూపానికి మధ్య తెలుగు భాష పరిణామక్రమాన్ని ఈ నుడిపెన్నిధి అందించగలదు. అవసరాన్ని బట్టి తెలుగు ఒంటరి నుడిపెన్నిధులు కొన్ని మనకు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి:

✔ తెలుగు పాఠ్య నుడిపెన్నిధి : ఈ నుడిపెన్నిధిలో వివిధ రాత రూపంలో ఉన్న తెలుగు నుడి వనరులున్నాయి. ఇందులో సాహిత్య రచనలు, చారిత్రక దస్త్రాలు, సమకాలీన వార్తాంశాలు, సామాజిక మాధ్యమాల టపాలు ఉన్నాయి.

✔ తెలుగు పలుకుల నుడిపెన్నిధి : ఇందులో తెలుగులో వివిధ మాండలికాల్లో, యాసల్లో మాట్లాడిన మాటల శ్రవ్యక రూపాలు, ఆయా మాటల పాఠ్య రూపాలూ ఉన్నాయి. ఇందులో రోజువారీ మాటలు, ఇంటర్వ్యూలు, ప్రసారాలు ఉన్నాయి.

✔ ఒక నిర్దిష్ట రంగానికి చెందిన నుడిపెన్నిధి: శాస్త్రీయ రంగం, న్యాయరంగం, వైద్యరంగం, ఇలా ఒక నిర్దిష్ట రంగానికి చెందిన పదాలు ఈ నుడిపెన్నిధిలో ఉంటాయి.

ఒంటరి నుడిపెన్నిధి ప్రయోజనాలు

✔ భాష పరిణామక్రమాన్ని అర్థం చేసుకోవటం: పద ప్రయోగంలో, వ్యాకరణ నిర్మితిలో, సంశ్లేషణాత్మక(కారక) విన్యాసంలో కాలానుగుణంగా వచ్చే మార్పులను అవగాహన పరుస్తూ ఒంటరి నుడిపెన్నిధి పదాల వ్యుత్పత్తి అధ్యయనంలో, భాషా విశ్లేషణలో సహాయపడుతుంది.

✔ భాషా వనరుల తయారీ: నిఘంటువులు, వ్యాకరణ పుస్తకాలు, ఇతర భాషాబోధనసామగ్రి తయారీలో ఒంటరి నుడిపెన్నిధి ఒక ప్రధాన వనరుగా పనికొస్తుంది.

✔ భాషా పరిశోధన : భాష సముపార్జన శాస్త్రం(లాంగ్వేజ్ అక్విజిషన్ స్టడీస్), సామాజిక భాషాశాస్త్రం(సోషియో లింగ్విస్టిక్స్), మాండలిక భాషా విజ్ఞానశాస్త్రం(డయలెక్టాలజీ) మొ? రంగాలలో పరిశోధనలకు అంకురార్పణకు ఒంటరినుడిపెన్నిధి పనికొస్తుంది.

✔ సహజ భాషా ప్రక్రియ(నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్): పలుకులను కనిపెట్టే బిస, పాఠ్యం–నుంచి–మాట పుట్టించే బిస, ఇంకా ఇతర భాషా సాంకేతిక ఉపకరణాల అభివృద్ధికి ఒంటరి నుడిపెన్నిధి పనికొస్తుంది.

**తెలుగులో అందుబాటులో ఉన్న ఒంటరి నుడిపెన్నిధులు:**

1. తెలుగు వికీపీడియా నుడిపెన్నిధి: తెలుగు వికీపీడియా వ్యాసాల సమాచారం నుంచి సేకరించిన పాఠ్యం.

2. భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ విభాగం – భారతీయ భాషల కేంద్ర సంస్థ సంయుక్త నుడిపెన్నిధి: వివిధ రంగాలకు సంబంధించిన మూడు లక్షల అరవై వేల పదాల నుడిపెన్నిధి.

3. హైదరాబాదు విశ్వవిద్యాలయం – భాషా ఇంజనీరింగ్ పరిశోధనా సంస్థ, సంయుక్త నుడిపెన్నిధి: ఇందులో 3.9 కోట్ల పదాలున్నాయి. ప్రస్తుతం ఇదే అతి పెద్ద తెలుగు నుడిపెన్నిధి.

4. తెలుగు భావవిశ్లేషణ కోసం రూపొందించిన వివరణాత్మక నుడిపెన్నిధి : వలగూడులో వచ్చిన సినిమా సమీక్షల ఆధారంగా రూపొందించిన పదనిధి.

జంటనుడుల నుడిపెన్నిధి : రెండు భాషల మధ్య అంతరాన్ని తగ్గించే నుడిపెన్నిధి జంటనుడుల నుడిపెన్నిధిలో రెండు భాషల జతపరిచిన పదాలుంటాయి. ఒక భాషలోని ఒక పదం, దాని అర్థమున్న రెండవ భాషలోని పదం పక్క పక్కన పేర్చి ఉంటాయి. ఈ నుడిపెన్నిధి వలన రెండు భాషలను పొంతన చేసుకునేందుకు వీలవుతుంది. అలా ఆ రెండు భాషల్లోని సారూప్యతను, తేడాలను గమనించవచ్చు. ఈ రెండు భాషలలో భాషా స్థాయిలో తులనాత్మక అధ్యయయనం సాధ్యమవుతుంది. ఈ రెండు భాషల వారు ఒకరు మరో భాషను నేర్చుకోవడమూ సులువవుతుంది.

**తెలుగులోజంటనుడుల నుడిపెన్నిధులు:**

✔ తెలుగు–ఆంగ్లం : ఇది సర్వసాధారణంగా అందుబాటులో ఉన్న నుడిపెన్నిధి. 50వేల వాక్యాల జతలు ఈ నుడిపెన్నిధిలో ఉన్నాయి. ఒక్కో వాక్యంలో 7 నుంచి 12 పదాలుంటాయి.

✔ తెలుగు–హిందీ ఇది ఐఐఐటి హైదరాబాదు వారు రూపొందించిన నుడిపెన్నిధి, ఇందులో 5 లక్షల వాక్యాలున్నాయి.

✔ తెలుగు–ఇతర భారతీయ భాషలు: తమిళం, కన్నడం, మలయాళం జతగా జంట నుడిపెన్నిధులు తెలుగుకు ఉన్నాయి.

కేవలం భాషల పొంతనే కాదు, జంట నుడిపెన్నిధుల వలన కొన్ని లాభాలూ ఉన్నాయి:

✔ యాంత్రికానువాదం: అల్గారిథంలను ట్రెయిన్ చేయటానికి వీలుగా నిర్దుష్టమైన, సందర్భోచితమైన అనువాదాలను ముందుగా ఇవ్వటం ద్వారా యాంత్రికానువాదంలో సహాయమందిస్తుంది.

✔ రెండవ భాషను నేర్చుకోవడం: రెండు భాషల మధ్య ఉన్న సారూప్యతలను, భేదాలను ఎత్తి చూపటం ద్వారా, రెండు భాషల్లో ఉన్న సమానార్థక వాక్యాలను పక్క పక్కన పెట్టి చూపించడం ద్వారా ఆ రెండు భాషల్లో ఒక భాష తెలిసిన వ్యక్తికి రెండవ భాషను నేర్చుకునే అవకాశం కల్పిస్తుంది.

✔ బహుభాషా పరిశోధన: భాషా సంపర్కం, భాషా మార్పిడి, పరాయి పదాలను భాషలోకి కలుపుకునే పద్ధతి లాంటి అంశాలను పరిశీలించి పరిశోధించేందుకు వీలవుతుంది.

**పరిచ్ఛేదానుసరణ/వాక్యానుసరణ నుడిపెన్నిధి :** భాషలను మరింత లోతుగా అధ్యయనంచేసేందుకు జంట నుడిపెన్నిధిలలో పలు రకాలు, అందులో ఈ పరిచ్ఛేదానుసరణ నుడిపెన్నిధి ఒకటి. దీన్నే సమాంతర నుడిపెన్నిధి అనుకోవచ్చు. ఇతర జంట నుడిపెన్నిధుల్లో పదాల స్థాయిలో రెండు భాషలు జతపరిస్తే, ఈ సమాంతర నుడిపెన్నిధిలో వాక్య స్థాయిలో లేదా పరిచ్ఛేద(పేరాగ్రాఫ్) స్థాయిలో రెండు భాషల వాక్తాలను లేదా పరిచ్ఛేదాలను పేర్చుతారు. ఇది భాషల మధ్య అధ్యయనాన్ని మరింత లోతుగా చేసేందుకు వీలు కల్పిస్తుంది. యంత్రానువాదం పదానికి పదం

మక్కీకిమక్కీ అని కాకుండా సందర్భానుసారంగా అర్థంలో వచ్చే మార్పులను సైతం ఈ నుడిపెన్నిధి ఇముడ్చుకోగలదు.

**సమాంతర నుడిపెన్నిధి లాభాలు:**

మెరుగైన యంత్రానువాదం:యంత్రానువాదపు నిర్దుష్టతను, ధారాళతను మెరుగు పరచడానికి సరైన సందర్భం, ఉచితమైన ఉదాహరణలు ఉండటం అవసరం. సమాంతర నుడిపెన్నిధిలో పదాల, పదబంధాల అర్థాలు ఏ విధంగా సందర్భాన్ని బట్టి మారతాయో, సహజమైన వ్యవహారంలో వాడే పదాల్లో ఎలాంటి తారతమ్యాలుంటాయో అవన్నీ వాక్యస్థాయిలో, పరిచ్ఛేద స్థాయిలో తెల్లమవుతాయి. ఆ విధంగా మరింత నిర్దుష్టమైన అనువాదాలు సాధ్యం భాషాశాస్త్ర పరిశోధన:భాష సమలేఖనాధ్యయనం, శబ్దవిన్యాస అధ్యయనం, శైలీవిన్యాస అధ్యయనం, భాషల మధ్య అర్థ విచారం ఇవన్నీ భాషా శాస్త్ర పరిశోధనలో ముఖ్యం. సమాంతర నుడిపెన్నిధి ఒక వ్యవస్థీకృత మూసను అందించి భాషల మధ్య పొంతనను, విశ్లేషణను అందిస్తుంది. భాషల మధ్య ఉన్న సంబంధాన్ని, భాషలలో కనిపించే సారూప్యతను, విన్యాస పరిగణనను ఎత్తి చూపి ఈ పరిశోధనల్లో సహాయపడుతుంది.

**బహుభాషా సమాచారం వెతికిపెట్టుట(ఇన్ఫర్మేషన్ రిట్రీవల్):** తరచూ మనకు ఎదురయ్యే సమస్య ఏమిటంటే ఒక భాషలో సమాచారం ఉంటుంది, వెతికే వ్యక్తి మరో భాషలో వెతుకుతాడు. ఇలా ఏ భాషలో వెతికినా, ఆ సమాచారం ఆ భాషలో కాకుండా మరే భాషలో ఉన్నా వెతికి తెచ్చిపెట్ట గలిగే శోధనాయంత్రాలకు ముడి సరుకుగా సమాంతర నుడిపెన్నిధి పని చేస్తుంది. పరిచ్ఛేద స్థాయిలో, వాక్య స్థాయిలో సమాచారాన్ని అమర్చడం ద్వారా ఈ సమాంతర నుడిపెన్నిధిని వాడుకొని బహుభాషా శోధనాయంత్రాలను(సర్చ్-ఇంజన్) తయారు చేసుకోవచ్చు. బహుభాషా బోధన:భాషా బోధనకు, అంతర్-సాంస్కృతికావగాహనకు రెండు భాషల మధ్య ఉన్న సామాన్య పదాల అధ్యయనం చాలా అవసరం. అందుకు ఒక వనరుగా సమాంతర నుడిపెన్నిధి పనికొస్తుంది. ఒక వ్యక్తి తనది కాని పరాయి భాషను తన భాష ద్వారా అర్థం చేసుకుని, అందులోని పదజాలాన్ని నేర్చుకుంటూ, వ్యాకరణాన్ని, సాంస్కృతిక నేపథ్యాన్ని అవగాహన చేసుకునేందుకు ఇది చాలా పనికొస్తుంది.

**సమాంతర నుడిపెన్నిధి ఉదాహరణలు:**

✔ యంత్రానువాదం కోసం తెలుగు-ఇంగ్లిష్ సమాంతర నుడిపెన్నిధి: యంత్రానువాద మోడళ్ళను ట్రెయిన్ చేసేందుకు ఈ సమాంతర నుడిపెన్నిధి రూపొందింది.

✔ ఐఐటీ బాంబే ఇంగ్లిష్-తెలుగు పారలల్ కార్పస్: బహుభాషా పరిశోధనకు, యంత్రానువాదానికి దోహదమవుతుంది.

✔ సెంటిమెంట్ అనాలసిస్(భావ విశ్లేషణ)కోసం తెలుగు-హిందీ సమాంతర నుడిపెన్నిధి: ఇది సెంటిమెంట్ ఎనాలసిస్ కోసం రూపొందించిన తెలుగు-హిందీ వాక్యాల నుడిపెన్నిధి.

తెలుగులో పైన చెప్పిన విధాల్లో మరెన్నో నుడిపెన్నిధులు తయారు కావాలి. ఇవి భాషా శాస్త్ర పరిశోధనకు ఎంతో సహాయ పడతాయి. తెలుగు భాషను ఆధునికం చేయడానికి దోహదం చేస్తాయి.

అ

**కవిత**

# మనిషి - మనసు

ఏ దిశ నుండైనా మనని అల్లుకుపోయేది మన భాషే
సర్వం ఆనందమయం చేస్తూ మనతోనే ఉండేది భావం
క్షణ క్షణం మనల్ని మనతోనే చిత్రీకరింపజేస్తూ చూపే శిల్పంగా
నిత్యం మమేకమైపోతూ అంటిపెట్టుకునేది మన భారతీయం

ఊళ్ళు, పట్టణాలు, పొలాలు, ఎడారులు, సముద్రాలు
ఎక్కడికి పయనించినా మనని ముందుకు నడిపేది భాషే
ఆనందమైన రాత్రి, అపురూపమైన పగలు రెంటినీ కొలిచేది భాష
స్థూలం నుండి సూక్ష్మం వరకు సాగే మనోగమనానికి దారి భాష

ఈ భూమి పూలతో, పండ్లతో, పచ్చని వృక్షాలతో
నిండుగా ఉండాలనేదీ ఎవ్వరికైనా ఆశ చూపేదీ కళ్ళ భాష
ఒక తరం పోయి మరో తరం వచ్చినా
బేలతనం పోయి భావితరంగా నిలిపేది హృదయ భాష!

పగటి కలలకూ, పగటి మగతకూ అవకాశమీయని
నవనాగరికత మనో చూపుల్ని పరుచుకున్న భాష ప్రావీణ్యం
అత్యాధునికత రెక్కలు విప్పి ముఖమంతా పరుచుకున్న
కాలమంతా
ఒకచోట పోగేస్తే దొరికేది అద్వితీయమైన భాషే..

వచ్చే మాటైతే అందరూ తెలుగు స్పందనతో రండి!
వాస్తవ తలంపై మనసు విప్పి పరిమళాల పలుకుల్ని
మననం చేసుకుందాం!
చెలియలికట్టపై నిలిచివున్న నౌకల అంతరంగాన్ని
ఆలింగనం చేసుకుందాం!
అనేకానేక భాషల మధ్య మెరుపుల సోయగాలొలకబోస్తున్న
తెలుగులో తేలియాడదాం!

మనిషి, మనసు కలయిక
విశ్వశాంతి సాదృశ్య స్వావలంబన
అచ్చెరువొందుతూ విశ్రమించిన నా మనోనేత్రాలలో
మనసుకు అవగతమయ్యేది ఒకే ఒక్క భాష తెలుగు..
నదీమతల్లి సైకతాలపై లహరుల్ని కిలకిలా నవ్వించేది భాషే
కులమతాల సూత్రాలకు కట్టుబడక గలగలా స్పృశించేది భాషే
తెలుపు, నలుపు జాడ్యమెరగని ప్రేమతో వీస్తున్న వీచిక ఈ భాష
నన్ను ఓ వేదికను చేసి వ్యక్తిగా సమాజానికి పరిచయం చేసింది
కూడా ఈ భాషే.

**శైలజామిత్ర**
**9290900879**

కీ.శే.జస్టిస్ ఆవుల సాంబశివరావు
చీఫ్ జస్టిస్, (రిటైర్డ్), ఆంధ్రప్రదేశ్ హైకోర్టు

# ప్రాంతీయభావం దేశసమైక్యతకు ఆటంకం కాలేదు!

నాకు తెలిసినంతవరకు శ్రీరాములుగారు ప్రారంభించినది అంధ్ర రాష్ట్రానికై దీక్ష కాదు. నా పరిజ్ఞానాన్ని బట్టి, ఆ దీక్ష, రాబోయే ఆంధ్రరాష్ట్రంలో మద్రాసులోని కొంతభాగమైనా కల్సిపోవాలని. అది వారి ఆశయం. ఆ దీక్షలో ఆయన మరణించారు. దానితో తెలుగువారు విజృంభించారు. దానిని చూచి ఆనాటి భారతప్రభుత్వం రాష్ట్ర నిర్మాణానికి అంగీకరించింది. అయితే ఆ రాష్ట్రానికి మద్రాసుతో ఏపాటి భాగము రాకుండా పోయింది.

ప్రత్యేక రాష్ట్ర, నిర్మాణం కోసం తెలుగువారు చాలా వదులుకోవాల్సి వచ్చింది. మద్రాసులో భాగం, బళ్ళారి, అటు గంజాం జిల్లా ఈ కార్యక్రమంలో పోగొట్టుకున్నారు. అది వేరే సంగతి. ఆంధ్రకు ప్రత్యేకరాష్ట్రం రాగానే భాషాప్రయుక్త రాష్ట్రాల కోసం దేశమంతటా కోరిక చెలరేగింది. దానితో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఆవిర్భవించాయి. ఈ విధంగా ఆంధ్రరాష్ట్రం మూలంగా భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణానికి పునాది పడ్డది. దీనికి స్ఫూర్తినిచ్చినవారు పొట్టి శ్రీరాములు.

భాషాప్రయుక్త రాష్ట్రాలలో మంచీ ఉన్నది. చెడూ ఉన్నది. దేశంలో సమైక్యత లోపించే ప్రమాదం ఉంది. ఎవరికి వారే యమునాతీరే అన్నట్టుగా ప్రతివారు ప్రవర్తించే ప్రమాదం ఉన్నది. చిన్న రాష్ట్రాలతో వనరులు తక్కువయ్యే సందర్భం కూడా ఏర్పడవచ్చు. ఇన్ని లోట్లు ఉన్నా ఆచరణలో భాషాప్రయుక్త రాష్ట్రాలు దేశసమైక్యతకు ఏమాత్రం అడ్డంకు లేకుండానే ప్రవర్తించాయి. దేశానికి ముప్పు వచ్చినా ఏకత్రాటి మీదే నడిచాయి.

అయితే కొన్ని చోట్ల బలమైన ప్రాంతీయ రాజకీయ పార్టీలు పుట్టుకు వచ్చాయి. పరిపాలిస్తున్నాయి. నా లెక్కలో ఈ పరిణామం భాషాప్రయుక్త రాష్ట్రాల మూలంగా కాదు. స్వాతంత్ర్యం వచ్చిననాటి నుండి ఒకే రాజకీయపక్షం అటు కేంద్రంలోను, కేంద్రంలోను, ఇటు చాల రాష్ట్రాలలోను ఏకచ్ఛత్రంగా పరిపాలించడంతో బలహీన ప్రాంతాలకు అన్యాయం జరిగింది. ఏదో ఒక వర్గం అధికారాన్ని చేజిక్కించుకుని. ప్రజాస్వామ్యానికి అవకాశం లేకుండా చేశాయి. దీనికితోడు ఉత్తరప్రదేశ్ అధికారాన్ని గుత్తకు పుచ్చుకున్నది. అంతేకాక ఆర్థిక ప్రగతిలో కూడా చాలా భాగాలు వెనుకబడిపోయాయి. ఆ విధంగా ప్రాంతీయపార్టీలు పుట్టుకొచ్చాయి.

రెండవది, భాషా ప్రయుక్త రాష్ట్రాలలో ఆ ప్రాంతం ప్రజల భాషలోనే పరిపాలన జరుగుతుంది. పరిపాలన ప్రజాస్వామ్యానికి అందుబాటులో ఉంటుంది. ప్రజాస్వామ్యం వేళ్ళూనుకునే అవకాశం పెరుగుతుంది. కనుక మొత్తం మీద చూస్తే భాషను ఆధారంగా తీసుకుని రాష్ట్రాల నిర్మాణం చేయడం దేశానికి ప్రజలకు ఉపకరిస్తున్నదని నేననుకుంటాను.

ఏ ప్రాతంవారు ఆ ప్రాంతాన్ని, ఆ ప్రాంతపు భాషను, ఆ ప్రాంతపు సంస్కృతిని గాఢంగా అభిమానించటాన్ని న్యాయమూర్తి కృష్ణయ్యర్ ఉప జాతీయత (sub-Nationalism) అన్నారు. అలా అనడంలో వారితో నేనేకాదు ప్రతి ఒక్కరూ అంగీకరిస్తారు. తన భాషను తన సంస్కృతిని తాను పుట్టిపెరిగిన గడ్డను గాఢంగా అభిమానించడం అతి సహజం. అది ప్రాణికోటిలోనే కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. దానిని ఎవరూ కాదనలేరు. అయితే చూడవలసింది పరిశీలించవలసింది తన ప్రాంతం ఎడల ఉన్న అభిమానం దేశం మొత్తానికి నష్టదాయకమా అనే విషయం. అధికారం కోసం ప్రాకులాడే రాజకీయవాదులు ఏమిచెప్పినా స్వతంత్ర భారత చరిత్రలో ప్రాంతీయభావం దేశసమైక్యతకు ఆటంకం కాలేదు. ఇప్పుడు అటువంటి ఆటంకం మతాలు కులాలవల్ల కలుగుతున్నది. అంతేకాని భాషా ప్రయుక్త రాష్ట్రాల వల్ల కాదు.

అదిన్నీగాక, మన రాజ్యాంగ శాసన నిర్మాతలే వివిధ రాష్ట్రాల ఉనికినీ, వాటి ప్రాముఖ్యాన్ని గుర్తించారు. రాజ్యాంగ చట్టాన్ని ఆ విధంగా మలిచారు. మన దేశంలో దురదృష్టవశాత్తూ చాలా కాలం ఏకపక్షపాలన కావడం చేత భారతప్రభుత్వం కేంద్రీయ ప్రభుత్వంగా మారింది, కాని రాజ్యాంగ చట్టం భావించింది అదికాదు. వారు నిర్మించిన రాజ్యాంగం వివిధ రాష్ట్రాల సంఘటనకై చేసింది. అందుకనే రాజ్యాంగ చట్టంలో భారత రాజ్యాంగ వ్యవస్థను ఫెడరల్ రూపంలో తీర్చిదిద్దారు. భారత రాజ్య వ్యవస్థను యూనియన్ ఆఫ్ ఇండియా అని పిలిచారు. యూనియన్ ప్రభుత్వానికి ఉండే అధికారాలు, రాష్ట్రాలకు ఉండే అధికారాలు వేర్వేరు జాబితాలలో పొందుపర్చారు. అటువంటి రాజ్యాంగాన్ని ఏకచ్ఛత్రంగా ఏలి కేంద్రీయ ప్రభుత్వంగా సంపూర్తిగా రూపు మార్చేసారు.

అదలా ఉంచి ప్రస్తుతాంశానికి వస్తే రాజ్యాంగ చట్టంలో ప్రాంతీయ భాషలకన్నిటికీ అధికారికమైన స్థాయి నేర్పరచి ఒక జాబితా పొందు పరిచారు. కనుక రాజ్యాంగచట్టం దేశంలోని వేర్వేరు భాషలకూ, రాష్ట్రాలకూ రాజ్యాంగస్థాయిని ఇచ్చింది. కనుక భిన్నప్రాంతాలూ భిన్న భాషలూ రాజ్యాంగం చేత గుర్తించబడ్డవి. ఇందు మూలంగా భాషా ప్రయుక్త రాష్ట్రాలు అనగా ఉప జాతీయత (sub-Nationalism) సహజసిద్ధం రాజ్యాంగబద్ధం. అంతేకాక, ఆచరణలో కూడ దేశసమైక్యతకు ఏ రకమైన అడ్డంకూ లేకుండా ప్రవర్తిస్తున్నాయి. ఇంకొక విషయం కూడా మనం గుర్తుకు తెచ్చుకోవడం అవసరం. కాంగ్రెసే తమ ప్రాంతీయ విభాగాలను ఏర్పరచినపుడు భాష ప్రాతిపదికనే చేసింది. ఆ విభాగాలు బాగా పనిచేసి ప్రజలకు సన్నిహితమై స్వాతంత్ర్యోద్యమాన్ని శక్తివంతమైన ఉద్యమంగా రూపొందించాయి.

కనుక భాషాప్రయుక్త రాష్ట్రాలు దేశానికి ఏ రకంగానూ ఇబ్బంది కల్గించడం లేదు. ప్రజాస్వామ్యాన్ని ప్రజా సామాన్యంలోకి తీసుకువెడుతున్న నిదర్శనలు కనిపిస్తూనే ఉన్నాయి. ఈ ఉపయోగకరమైన భాషా ప్రయుక్త రాష్ట్ర వ్యవస్థకు స్ఫూర్తినిచ్చిన పొట్టి శ్రీరాములు నిజంగా అమరజీవే.

**('అమరజీవి బలిదానం–పొట్టిశ్రీరాములు పోరాట గాథ' నుండి)**

# ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో భారతీయ భాషా ఉత్సవం




భారతీయ భాషా సంస్థ, మైసూరు మరియూ ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, వెంకటాచలం, వారి సంయుక్త ఆధ్వర్యంలో 11-12-23 సోమవారం ఉదయం నుండి సాయంత్రం వరకూ మహాకవి భారతీయార్ శతజయంతి సందర్భంగా సభను ఘనంగా నిర్వహించారు. డా.రాంబాబు ప్రార్థనతో ప్రారంభమైన సభ, తొలుత భారతీయ భాషా సంస్థ సంచాలకులు ఆచార్య శైలేంద్ర మోహన్ వర్చువల్‌గా ప్రారంభిస్తూ మహాకవి భారతీయార్ భాషా సాహిత్యాలకు చేసిన సేవలను గుర్తుచేశారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు, ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ సభకు అధ్యక్షత వహించి తమ విశేష ప్రసంగంలో సుబ్రహ్మణ్యభారతి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం హైదరాబాదు నుండి విచ్చేసిన తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కె.యాదగిరి భారతీయ భాషల్లో ఏకత్వంపై ప్రసంగించారు. తిరుపతి ఐ.ఐ.టి నుంచి విచ్చేసిన అడ్లూరి రఘురామరాజు భారతీయ భాషల్లో సాంకేతిక విద్య ప్రాధాన్యత గురించి వివరించారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆచార్యులు పేట శ్రీనివాసులు వర్తమాన పరిస్థితుల్లో భారతీయ సాహిత్యం అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం జరిగిన బహుభాషా కవి సమ్మేళనంలో నెల్లూరు వాసి ఆంగ్లకవి మైదవోలు వెంకటశేష సత్యనారాయణ రచించిన "రైం-రిథం-ఇమేజరీ" అన్న ఆంగ్ల కవితా సంపుటిని ఆచార్య కె.యాదగిరి ఆవిష్కరించారు. బహుభాషా కవి సమ్మేళనానికి అధ్యక్షులు, అరసం ఆం.ప్ర. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అంతర్జాతీయ కవి డా.పెరుగు రామకృష్ణ కవిని పరిచయం చేశారు. ఈ బహుభాషా కవిసమ్మేళనంలో మైదవోలు వెంకటశేష సత్యనారాయణ, రాజేంద్రసింగ్ ఠాకూర్ ఆంగ్ల కవితలు వినిపించారు, కె.సంజీవరెడ్డి కన్నడ కవిత వినిపించగా, డా.వై.శైలజ హిందీ కవిత వినిపించారు. డా.మాడభూషి గారు మహాకవి భారతి రచించిన తమిళ కవిత మరియూ అనువాదం వినిపించారు. డా.పాతూరి అన్నపూర్ణ, డా.పెళ్ళూరి సునీల్, డా.పెరుగు రామకృష్ణ, డా.కె.కరుణశ్రీ, డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య, నల్లు రమేష్ తమ తెలుగు కవితలను వినిపించి అలరించారు.

## మన కాలపు విమర్శకులు

(32వ పుట తరువాయి.......)

4. కథ చదవడం ఎలాగో నేర్పాలి.
5. కథని కళాత్మకంగా మలచాలి.
6. ప్రజాస్వామ్య, లౌకిక భావనలు పెంపొందే కథలు రావాలి.
7. ఉద్వేగం ఆపుకోలేని కుతూహలాన్ని కథలు కలిగించాలి.
8. లేనిపోని ఆదర్శవాద ధోరణులతో కథ అసహజంగా ఉండకూడదు.
9. ఇతివృత్తాల ఎంపికలో మూసధోరణిని బద్దలు కొట్టాలి.
10. కథకుడి దృష్టి వైశాల్యం పెరగాలి.

తెలుగు నేల మీద కథా విమర్శను నిబద్ధతతో ముందుకు తీసుకెళుతున్న విమర్శకులు చాలా తక్కువ. కానీ కె.పి. కథావిమర్శను బలంగా, వేగంగా కాకుండా శ్రద్ధగా చేస్తున్నారు. విభిన్నమైన వ్యాసాలు రాస్తూ ప్రత్యేకంగా కనిపిస్తున్నారు. వారి విమర్శ ద్వారా రచయితలు మరింత మెరుగు పడతారని, రాసిన వ్యాసాలు పరిశోధకులు పరిశోధనాంశాలుగా కొనసాగించాలనీ ఆశిస్తున్నాను.

**ముగింపు:** ఈ వ్యాసంలో చర్చించిన ముగ్గురు విమర్శకుల పరిశీలనల మీద, వారి ప్రతిపాదనల మీద చర్చ జరగాల్సిన అవసరం ఉంది. అలా జరిగినప్పుడు మాత్రమే విమర్శకు కొనసాగింపు ఉంటుంది. తెలుగు సాహిత్యంలో విమర్శ మరింత పరిపుష్టం కావాలని ఆశిస్తున్నాను.

**ఆధార గ్రంథాలు:**

1. ద్రవాధునికత - డాక్టర్ పాపినేని శివశంకర్
2. కథావిష్కారం- కె.పి. అశోక్ కుమార్
3. కథావలోకనం- కె. పి. అశోక్ కుమార్
4. ప్రజాసాహితి 273 వ సంచిక
5. గమనం- ప్రజాశక్తి హౌస్ ప్రచారణ
6. పొగచూరిన ఆకాశం పై విమర్శనా వ్యాసం- ఆచార్య మేడిపల్లి రవికుమార్
7. కుట్ర- జాతశ్రీ కథా సంపుటికి మేడిపల్లి రాసిన ముందుమాట
8. వివిధ జాతీయ అంతర్జాతీయ సెమినార్లలో ఆచార్య మేడిపల్లి రవికుమార్ చేసిన పత్ర సమర్పణలు.

వ్యాస రచయిత డాక్టర్ డి.ఆర్.జి. ప్రభుత్వ కళాశాల తాడేపల్లిగూడెం

**అమ్మా!**

**నీ భాష కావాలి. నిప్పులు చెరగడానికి, చెమటను జల్లెడపట్టి సంపదలను తీయటానికి, తెలుగు పౌరుషాగ్ని రాజెయ్యడానికి మాతృభాష కావాలి.**

**-ఛాయారాజ్ (మాతృభాష'-కవిత)**

పి. శివరామకృష్ణ'శక్తి'
94414 27977

# శంకరన్ తరం తరువాత -4



2006 లోవచ్చిన అటవీ హక్కుల గుర్తింపు చట్టానికి రూల్స్ రూపొందించిన కమిటీకి అధ్యక్షత వహించటం శంకరన్ గారికి ప్రభుత్వం ఇచ్చిన బాధ్యతలలో ఆఖరిది కావచ్చు. ఈ కమిటిలో ఉమ్మడి వనరులు భూమి అడవి నీరులమీద అధ్యయనాలు చేస్తున్న మాధవ గాడ్గిల్ నందిని సుందర్ వగైరాలు ఉన్నారు.

1986 లో పర్యావరణ రక్షణ చట్టం వచ్చింది .దీని ప్రకారం సముద్రతీర ప్రాంతం రక్షణకు జోన్లు నిర్ణయించేటప్పుడు మత్స్యకారులు పాటించే సంప్రదాయ సరిహద్దులు లెక్కలోకి తీసుకోలేదు. అంతకుముందు నందిని సుందర్, అటవీ శాఖ పెత్తందారీతనాన్ని సడలించే ఒకే ఒక ఆశాకిరణంగా భావించిన ఉమ్మడి అటవీ యాజమాన్యంకూడా గిరిజన పల్లెల సంప్రదాయ సరిహద్దులను పట్టించుకోలేదు. ప్రపంచ బ్యాంకు అప్పుతో అమలైన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆటువంటి మేధావులు,ప్రభుత్వేతర సంస్థలు అటవీ సంరక్షణ చట్టం మార్గదర్శక సూత్రాలు అమలు పరచి, గిరిజనులు అటవీ శాఖకు మధ్య తగవులు తీర్చవలసిందిగా కనీసం అడగలేక పోయారు. అలాగే మాధవ్ గాడ్గిల్ వగై రాలు తయారు చేసినట్లు చెప్పుకునే జీవవైవిధ్య చట్టంలో ఆయా వృత్తుల వాళ్ళు పాటించే సరిహద్దులు కాక, ప్రభుత్వాలు ఏర్పరచే పంచాయతీ సరిహద్దులనే తీసుకున్నారు. కాబట్టి వాటి పటం బదులు జాబితాల తయారీ నిర్ణయించారు.

అటవీ హక్కుల చట్టం వచ్చేనాటికి ప్రజలు పాటించే సరిహద్దులు కాక ,ఈ ప్రభుత్వ నిపుణులు నిర్దేశించే పంచాయతీ పద్ధతుల పట్ల, గిరిజనులలో వారితో పనిచేసే వారిలో తీవ్రమైన వ్యతిరేకత పెరగ సాగింది. ఈ చట్టం గిరిజనుల సంప్రదాయవాడుకలను ఇంతవరకు గుర్తించక పోవటం చారిత్రక తప్పిదంగా ఒప్పుకోవటమే కాదు, సంప్రదాయ సరిహద్దుల ప్రకారం పటం గీసి ఆ పటంలో ఈ వాడుకలను గుర్తించమని ఆదేశించింది. అయితే ఈ సంప్రదాయ సరిహద్దులమీద నోరు మెదపని వీరందరినీ శంకరన్ కమిటిలోకి తీసుకున్నారు. వారు 2008లో రూపొందించిన దరఖాస్తులను అసమగ్రమైనవిగా భావించి,2012 కొత్త దరఖాస్తులను కేంద్రం జారీ చేసింది.

వాటిని అమలు చేయటానికి కృషి చేసేది బదులు, ఈ మేధావులు మధ్యేమార్గంగా ఉమ్మడి యాజమాన్యానికి అనువైన తావులు గుర్తించే క్రమంమీద సలహా ఇవ్వసాగారు. పాత ఆదిలాబాద్ జిల్లాలో రెండు మండలాలలో అమలు చేయటానికి వీరికి ప్రభుత్వం నిధులు సమకూర్చి సహకరిస్తుంది. డబ్బులొస్తున్నాయి కదా అని గిరిజనులు తలూపుతున్నారు. పక్కన కవాల్ అభయారణ్యంలో ఈ చట్టం ప్రకారం గుర్తింపు పూర్తి చేసి ఆ పల్లెల తరలింపు మొదలు పెట్టవలసిందిగా ఏ పెద్దమనిషి అడగటం లేదు.

పైనపేర్కొన్న అటవీ సంరక్షణ చట్టం మార్గ దర్శక సూత్రాల ప్రకారం, మహబూబ్ నగర్ రిజర్వ్ అడవిలో ఉన్న చెంచు పల్లెలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలని, వాటిలో అప్పాపూర్ కేంద్రంగా కొన్ని పల్లెలను పంచాయతీ గా గుర్తించాలని, జిల్లా కలెక్టర్ 93లో పంపిన ప్రతిపాదనలను, అప్పటికే ఈ పల్లెలను పులుల అభయారణ్యంలోని కోర్ ఏరియా లోకి తెచ్చిన అటవీ శాఖ, తిరస్కరిస్తూ వచ్చింది.

ఈ ప్రతిపాదనలను వెలికి తీసి శక్తి కోర్టుకెక్కింది. పదేండ్ల తరువాత అప్పాపూర్ పంచాయతీ అయింది. ఇప్పుడు అక్టోబర్ నెలలో తుది ఉత్తర్వులిస్తూ, కేసు పెండింగ్‌లో ఉండగా, అటవీ హక్కుల గుర్తింపు అమలులోకి వచ్చింది కాబట్టి, దానిప్రకారం గుర్తింపు నాలుగు నెలలలోగా పూర్తి చేయమని తెలంగాణా హై కోర్టు ఆదేశించింది.

రాజాశ్రయానికి అర్రులు చాచే వారు, వచ్చిన దానితో సరిపెట్టుకోమని నచ్చచెప్పే వాళ్ళు ఎప్పుడూ ఉంటారు. లక్ష్యం కోసం రాజీపడకుండా కృషిచేసేవారుకూడా ఉంటారు. అటవీ సంరక్షణ, పర్యావరణ చట్టం అమలులో మేధావుల మెతక వైఖరికి ఎదురొడ్డి ముందుకు పోతూనే ఉన్నారు.

'నిశ్చితార్థంబు వదలరు నిపుణ మతులు'.

**మాతృభాషల్ని అణిచివేసే ప్రభుత్వాలు ప్రజావ్యతిరేకమైనవి. అభివృద్ధి నిరోధకమైనవి కూడా. అలాంటి ప్రభుత్వాలను అధికారంలో ఉండనీయకూడదు.**
**-తెలుగు భాషోద్యమ సమాఖ్య**

బద్రి కూర్మారావు
9704798643

# గిడుగు వారసురాలు స్నేహలత మురళి



పండితుల పిల్లలు కూడా సాహిత్య సంగీత వారసులైన వారెందరో ఉన్నారు. అటువంటి వారిలో తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి గారి మునిమనుమరాలు శ్రీమతి స్నేహలత మురళి ఒకరు.గిడుగు వంశంలో కుమారుడు సీతాపతి, మనుమలు గిడుగు రాజేశ్వరరావు, గిడుగు వెంకటేశ్వరరావు, గిడుగు వెంకట నాగేశ్వరరావు, స్నేహలత.... మరెందరో సంగీత, సాహిత్య, నటనా రంగంలో పేరు తెచ్చినవారు ఉన్నారు. వీరిలో స్నేహలత మురళీ, జానపద గాయనిగా స్వరకర్తగా 3 దశాబ్దాలుగా ఆకాశవాణి, దూరదర్శన్, ఉమ్మడి ఏ.పి సాంస్కృతిక వ్యవహారాల శాఖ ద్వారా ప్రదర్శన లిచ్చారు. అనేక పాత్రలకు డబ్బింగ్ చెప్పారు. ముఖ్యంగా శాస్త్రీయ సంగీతాన్ని, జానపద రంగంలో తను పాడటమే గాక ఎంతో మందిని తయారు చేసారు. ఎస్.పి.బాలు, ఉషా ఉతుప్, శైలజ, వాణీ జయరాం, గీతామాధురి వంటి గాయకులు వీరి సంగీత సారధ్యంలో పాటలు పాడారు. ఒక అరుదైన సంగీత దర్శకులుగా సంగీత ప్రయాణంలో కొనసాగిన స్నేహలత క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఇటీవలే మరణించారు.

గిడుగు రాజేశ్వరరావు, లలితలకు 1964లో నవంబరు 23న నల్గొండ జిల్లా నాగార్జున సాగర్‌లో జన్మించారు. తండ్రి రాజేశ్వరరావు ప్రముఖ కథ, గేయ నవలారచయిత, అనువాదకుడు, గాయకుడు. తల్లి లలిత ఒకప్పటి బాలనటి. నృత్యకళాకారిణి, గాయకురాలు. వీటికి తోడు నాయనమ్మ కూడా గాయకురాలే. స్నేహలత గారు. ఒకప్రక్క చదువుకుంటూ మరో ప్రక్క సంగీత సాధన చేసారు. ప్రారంభంలో తల్లి లలిత గారితో రేడియోలలోను, దూరదర్శన్‌లలో లలిత సంగీత సంప్రదాయ గీతాలు పాడుతూ ఉంటే ఆ బృందంలో పాల్గొనేది. ఆ విధంగా స్నేహలతకు సంగీతం మీద మమకారం పెరిగింది.

తొలుత వేదుల భ్రమరాంబ గారి వద్ద, ఆ తరువాత శ్రీమతి శేషమాంబ గారి వద్ద గాత్రం మరియు వీణ నేర్చుకుంది. ఆ పిమ్మట ఆలిండియా రేడియో ఆస్థాన విద్వాంసులు వి.యస్. అనంతరామ్ గారి వద్ద శిష్యరికం చేసి సంగీతంలో డిప్లమో సాధించింది. తీరని జిజ్ఞాసతో మహా మహోపాధ్యాయ సూకల చిన సత్యన్నారాయణ, శ్రీరంగం గోపాల గార్ల వద్ద తన సంగీతానికి మెరుగులు దిద్దుకుంది. శ్రీమతి అమ్ముల సత్యవతి, అనంత రాజ్యలక్ష్మి గార్ల వద్ద వీణ సాధన చేసింది. మరోప్రక్క ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి బి.ఎ. పట్టాను, తదుపరి ఆంధ్రవిశ్వవిద్యాలయం నుండి ఎం.ఎ. పట్టా పొందారు. శాస్త్రీయ సంగీతం కంటే జానపదంవైపు మొగ్గుచూపారు. పెళ్ళిపాటలు, వియ్యాల పాటలు, అప్పగింతల పాటలు, సువ్వి పాటలు, బతుకమ్మ పాటలు, జానపద గీతాలు, రాయలసీమ దంపుడు పాటలు ఏవి కావాలన్నా స్నేహలత మురళీని సంప్రదించవలసిందే.

ముఖ్యంగా హైదరాబాద్ పరిసరప్రాంతాలు, తెలుగులోగిళ్ళలో పెండ్లి పాటలకు ఒక బృందాన్ని తన జీవిస్తూ, ఆ పాటలకు ప్రాణం పోసారు. వారసులను తయారు చేసారు. 1986లో పారుపడి మురళీకృష్ణ (ఆర్.టి.సి.సివిల్ ఇంజనీర్) వివాహమయ్యాక స్నేహలత మురళీగా పేరు స్థిరపరచుకున్నారు. భర్త ప్రోత్సాహంతో వీరి ప్రదర్శనలు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో విస్తరించాయి.ఈమె అనేక సంస్థలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతరాష్ట్రీయ వేదికలపై లెక్కలేని ప్రదర్శనలిచ్చారు. దేశంలో ఈమె పర్యటించని ప్రాంతం లేదు,రాష్ట్రంలో పొందని గౌరవం లేదు.

సంగీత దర్శకురాలుగా : తండ్రి రాజేశ్వరరావు గారు రాసిన పిల్లల పాటలకు, చిన్నప్పటి అట్లతద్ది గొబ్బెమ్మ వంటి పిల్లల పాటలకు సంగీతము సమకూర్చి స్వంతంగా ఒకరికార్డింగ్ స్టూడియోను నెలకొల్పి ఎందరో యువ కళాకారులను ప్రోత్సహించారు. క్యాసెట్లను రూపొందించారు. ప్రముఖ సినీకథ రచయిత, నటుడు, దర్శకుడు అయిన ఎల్.బి. శ్రీరామ్ గారి హార్ట్ ఫిల్ములతో పాటు షార్ట్‌ఫిల్ములు నిర్మించారు.

పదవులు : అంతరించిపోతున్న పల్లె పదాలకు జానపద సాహిత్యానికి తన ప్రదర్శనలు ద్వారా జీవం పోస్తూ కళా రంగానికి తెలుగు భాషకు సేవ చేస్తున్న స్నేహలత మురళీని సమైక్యభారతి, సామాజిక చైతన్య సంస్థ అధ్యక్షురాలుగా ఎన్నుకున్నారు. తెలంగాణా రాష్ట్ర జానపద సంఘానికి మహిళా అధ్యక్షురాలుగా ఎన్నుకున్నారు.

శ్రీకాకుళం చివరి మజిలీ: ప్రచార ఆర్భాటం లేని స్నేహలత గారు తన తాతగారి పేరుతో ఒక సంస్థ నడుస్తున్న సంగతి తెలుసుకుని గిడుగు రామమూర్తి తెలుగు భాష మరియు జానపద కళాపీఠం వ్యవస్థాపకులు బద్రి కూర్మారావు ఆహ్వానం మేరకు సంస్థ 20వ

**తరువాయి 50 పుటలో**

జి.వి.పూర్ణచందు
9440172642

# చలం

'చనవేమెరతుఁగాని చలము సాదింపనోప
చెనకీనంటా నేల చేయి వట్టీనే
కనుసన్న మెలఁగేటి కాంతను
నాకీపాటి కొనగోరుదాఁకించిన కొమ్మలకేపాటో'

'వింతవింత సతులాల వినరమ్మా! యెంతలేదు మీ కెల్లా నిదిచాలు సుండి అనే పల్లవి కలిగిన ఈ కీర్తనలో అన్నమాచార్య 'చలం' సాధించటాన్ని అక్కసు, కసి, ఆగ్రహించటం అనే అర్థాల్లో ప్రయోగించాడు. కప్పు సాధించకపోయినా ఈ ఆటలో పాకిస్తాన్ని ఓడించి ఇండియా 'చలం' సాధించింది అంటే, పగ తీర్చుకుందని!

వెంకటాచాలం, శేషాచలం లాంటి పేర్లని ఇంగ్లీషులో పిలిచేప్పుడు జి. వెంకటాచలం, జి. వి. చలం అయ్యాడు. ఇలాగే, చాలామందికి చలం అనే పేరు స్థిరపడింది. 'అచలం' అంటే కదలనిది కాస్తా 'చలం'గా కదిలిపోయింది.

తెలుగు సాహిత్యంలో'చలం' అనే పేరు ఎందరికో ఆరాధనీయం. తెలుగు సినీనటుల్లో కూడా ఇద్దరు చలాలు తెలుగువారికి అభిమానపాత్రులయ్యారు. చలం పేరున ప్రసిద్ధులు చాలా మంది ఇప్పటికీ ఉన్నారు.

చలం అనే పదం సంస్కృతం లోనూ తెలుగులో కూడా ఉంది. సంస్కృత చలం అంటే, వణుకు, చలచిత్తం, చపలచిత్తం అని! తెలుగు చలం అంటే మాత్సర్యం, రోషం, పట్టుదల. మొత్తం మీద రెండూ ప్రతికూల భావాల్నే ధ్వనిస్తాయి. చలం అనే పేరున్న వ్యక్తులు తెలుగు చలాన్ని, సంస్కృతం చలాన్ని కూడా సమన్వయం చేసుకోలేక 'చెలం' అని రాసుకోవటమూ కనిపిస్తుంది. చెలమ అంటే దొరువు, వాగులు, నదులు ఎండిపోయినప్పుడు ఆ ఇసుకని గుంత తవ్వితే అందులోకి ఊరే నీరు చెలమ. ఈ అర్థంలో చెలమ్ పదాన్ని వాడకంలోకి తెచ్చింది గుడిపాటి వెంకటాచెలం గారే!

చలం అనే తెలుగు పదాన్ని మన ప్రాచీన కవులు విస్తృతమైన అర్థాల్లో ప్రయోగించారు. వాటిలో చాలా అర్థాలు నిఘంటువుల కెక్కలేదు. ఆ సందర్భాన్ని బట్టి దాని అర్థాన్ని ఊహించుకోవలసిందే! అన్నమయ్య ప్రయోగాలు కొన్ని పరిశీలిద్దాం:

**గాఢమైన కోరిక:** యెలమి శ్రీ వేంకటేశ నిప్పు డిట్టె కూడితివి/చలము దీరెను మీలో సమ్మతులే మేలు' 'రిరంస' అనే సంస్కృత పదానికి సమానార్థకంగా 'చలం' అని అన్నమయ్య ప్రయోగించాడు. తీవ్రమైన కామవాంఛ. కుతి అనటంకన్నా గాఢమైన పదం చలము. చలము తీరిందన్నాడు అన్నమయ్య.

**దుఃఖపెట్టటం:** 'చతురుఁడ నీకాకెతో చలము లింకానా....' ఆకె అంటే ఆవిడ. ర్యాగింగుల్లాంటివి చేసి ఆమెని ఇంకా ఏడిపించాలా?

**అక్కసు:** 'చలము సాదించేది మచ్చరవు వారికిఁగాక/సులభులై యుండిన చుట్టాలకేలే మత్సరం అంటే రోషం, హటం, మోడి.

చలముకొను, చలపట్టు, చలపోడుచు ఇవన్నీ చలము సాధించటం అనే అర్థంలో పదాలే! మత్సరం కలిగినవారి మీద చలం సాధించాలే గాని, అనుకూలంగా ఉండే వారిమీద సాధించటం ఏమిటనేది ఇందులో ప్రశ్న!

**కార్పణ్యం:** 'చలము సాదించరాదు సముకాన గొంచరాదు' అనుకూలవతిపైన కార్పణ్యం కూడదని! అదావత్ అంటారు హిందీలో.

**మోసం:** 'చనవులు గలిగితే చలము పనికిరాదు' చనవురాలు అంటే జవరాలే! చనువు కలిగాక ఆమెను మోసం చేయకూడదని!

**అలక:** 'చలము సాదించేవేళ చవులు సేసుకొని/పిలిచి విందుచెప్పేతే ప్రియము లౌనా' అలకమీద ఉన్న ప్రియురాలిని ముఖం ఇంత చేసుకుని విందుకు పిలిస్తే ఇష్టపడ్తుందా?

**అన్నమయ్య లాగానే క్షేత్రయ్య కూడా చలం పదాన్ని విస్తృతంగా ప్రయోగించాడు:**

ముఖం చాటు వేయటం: 'పొలతిరో! మా మువ్వగోపాల రాయుడు చలము చేసినాడు'

**నిర్లక్ష్యం:** నిపూని చలము జేసేది మరియాదనా కావాలని నిర్లక్ష్యం చేయటం.

**వైరం:** 'చెలిమి చేసే దందు చలము చేసే దిందు/వలచి యుండే దందు–వచ్చి యుండే డిందు' అక్కడికెళ్ళి చెలిమి చేస్తావు, ఇక్కడకొచ్చి చలము చేస్తావంటుంది నాయిక

**పగ:** 'చెలియరో! దైవము – చలము సాధించె నయ్యా' హతవిధీ అనటం లాంటిది.

**కపటం:** 'ఏమో మాయ వలపొ లాగున చలము జేసెనే' అతని మీద ఇంత మోహం ఎలా కలిగిందని అడిగితే, వలపు ఆ విధంగా చలము చేసిందంటుంది నాయిక

**సందిగ్ధత:** 'ఏలర వూరక చలము? మువ్వ గోపాల !'

**అగ్రహం:** 'చలము వలదె కొమ్మ! వాడు రెండు దలచెనమ్మా!'

చలము అనే పదం వెనుక ఇన్ని అర్థాలున్నాయి. వెదికితే ఇంకా కవి ప్రయోగాలు అనేకం దొరుకుతాయి కూడా! చలం అనే పేరు పెట్టుకోవటం సంగతి సరే, ఈ పదాన్ని ఇన్ని అర్థాల్లో వాడుకునే వీలుండగా మనం వదిలేసుకున్నాం దేనికని?

'వానల కాలంలో మబ్బులు చలంచేశాయి. చుక్క రాల్లేదు' అంటే ముఖం చాటేశాయని, నమ్మించి మోసం చేశాయని!
వాడింకా చలంచేస్తూనే ఉన్నాడంటే మీనమేషాలు లెక్కిస్తూ ఒక నిర్ణయానికి రాలేకపోతున్నాడని!
'ఆరోజున వాడి మాటలు చలము చేశాయి. నమ్మి పిల్లనిచ్చాను' అంటే మోసగించాడని!
'పన్నులు పెంచి ఆపన్నుల మీద ప్రభుత్వమే చలంచేస్తోంది' అంటే, కక్ష సాధిస్తోందని!

**పుస్తక సమీక్ష**

# అమరజీవి పొట్టి శ్రీరాములు పోరాట జీవిత కథ



**రచన: డా.నాగసూరి వేణుగోపాల్**
పుటలు: 96
వెల రూ:50
ప్రతులకు :
ఎస్ ఆర్.పబ్లికేషన్స్
విజయవాడ రూరల్–520012
ఫోన్: 0866 6889999
హైదరాబాద్ ఫోన్:
9032408516

ఆకాశవాణి శ్రోతలకు సుపరిచితుడే కాకుండా, తెలుగు పాఠకులకు పరిచయం వున్న డా.నాగసూరి వేణుగోపాల్ కలం నుండి వెలువడిన చిన్న పుస్తకం 'అమరజీవి పొట్టి శ్రీరాములు పోరాట జీవిత కథ.' 'అమరజీవి బలిదానం పేరిట రచయిత ఇదివరకే ఒక పోరాటగాథ వెలువరించడం జరిగింది.

పుస్తకం 94 పేజీలుగా ఉన్నా, చిత్రపటాలు తీసివేస్తే 50 పేజీల నిడివి వున్న సంక్షిప్త జీవిత చిత్రణ ఇది. రచయిత చెప్పినట్టుగా కొంత సమాచారాన్ని డా.బాదం శ్రీరాములు పరిశోధనా గ్రంథం 'అమరజీవి పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర' (1992), మరికొన్ని గ్రంథాల నుండి తీసుకొని మూడు నెలల కాలంలో హడావిడిగా వ్రాసినట్టుగా స్పష్టంగా కన్పడుతుంది. అందుకనే అక్కడక్కడ విషయాలు రేఖామాత్రంగా కనబడతాయి. మరొక చోట ' ఆంధ్ర రాష్ట్ర ఉద్యమ పూర్వ రంగం' శీర్షికన పొట్టి శ్రీరాములు పాత్ర లేకుండా పది పేజీలు కొనసాగుతాయి. దానికి కొనసాగింపుగా 'సత్యాగ్రహి ఆత్మత్యాగం' శీర్షికన శ్రీరాములు జీవితం ప్రవేశిస్తుంది. చివరి అంకం' భాషా ప్రయుక్త రాష్ట్రాల పితామహుడు' శీర్షికన ఉన్న విషయం కూడా పొట్టి శ్రీరాములుగారు అమరులైన తర్వాత చరిత్ర..ఇది చారిత్రిక విషయం.దాదాపు పనిమిది పేజీలు కొనసాగుతుంది. ఇలా శ్రీరాములు గారి జీవితానికి సంబంధం లేకుండా, చారిత్రిక విషయాలతో కూడిన విషయాల్ని మినహాయిస్తే, వారి జీవితానికి సంబంధించిన విషయం చాలా తక్కువగా ఉంటుంది.

రచయిత మాటల్లో "గాంధీజీతో పొట్టి శ్రీరాములును పోలుస్తూ ఉంటాం. అయితే అదే సమయంలో ఉన్న తేడాల గురించి కూడా చర్చించాలి. గాంధీజీలో చాతుర్యం వుంది. పట్టు విడుపులున్నాయి. పాండవులను సంరక్షించడానికి గానీ, కురుక్షేత్ర యుద్ధంలో వారిని గెలిపించడంలో గానీ, శ్రీకృష్ణుడు చూపిన చాతుర్యం వంటిది గాంధీజీ సొంతం. ఇలాంటి చాతుర్యం, లాఘవం, పొట్టి శ్రీరాములులో మృగ్యం. అదే సమయంలో నెహ్రూ, పటేల్, రాజేంద్రప్రసాద్, నేతాజీ, రాజగోపాలాచారి, ప్రకాశం పంతులు, మౌలానా ఆజాద్ వంటి నాయకులను సంభాళించే గాంధీజీ నేర్పరితనం పొట్టి శ్రీరాములులో లేదు.

ఒకరకంగా శ్రీరాములుది అనాకర్షణీయమైన వ్యక్తిత్వం.! అయితే అది లోటుకాదు.. పొట్టి శ్రీరాములులో మొండితనం ఉంది. అని కొందరు భావిస్తారు. కానీ అది స్వచ్ఛత, చిత్తశుద్ధి మాత్రమే.

ఏవిధంగా పోల్చినా ఇద్దరి నేపథ్యం వేరు. కార్యక్షేత్ర పరిధి వేరు

రచయిత శ్రద్ధ తీసుకుని పుస్తకాన్ని కూర్పు విషయంలో మరింత శ్రద్ధ చూపిస్తే ఆకర్షణీయంగా ఉండేది. ఏది ఏమైనా పొట్టి శ్రీరాములు గారి వ్యక్తిత్వం పట్ల ఆకర్షితులవ్వడానికి ఈ చిన్న పుస్తకం ఉపయోగకారిగా ఉంటుందనటంలో సందేహం లేదు.

– 'ఆరా'...



# చలం

( 48వ పుట తరువాయి.. )

'కార్యకర్తల్ని చలంచేసే పార్టీకి మనుగడ ఉండదు. అంటే, నిర్లక్ష్యం చేయటం, ఉపేక్ష వహించటం.

'మొదట ఏదో పొరబాటున చేసి ఉంటాడనుకున్నాను. కానీ, చలం సాధిస్తున్నాడని ఇప్పుడర్థం అయ్యింది ఇది కక్ష సాధించటం.

**ఇలా చలాన్ని అనేక అర్థాల్లో ప్రయోగించే వీలుంది. ఇంత వైశాల్యం ఉన్న ఈ పదాన్ని కేవలం అచలానికి వ్యతిరేక పదంగా భావించి వదిలేసుకోవటం దేనికి? వాడుక మరచిన మాటల్ని వాడకంలోకి తెచ్చుకుని భాషను పెంపు చేసుకోవటం, భాషాపరమైన అవసరాలకు వాటిని ఉపయోగించుకోవటం నేటి అవసరం.**

చలాకు అంటే హిందీలో నేర్పరితనం, చాకచక్యం. ఆంగ్ల పదం 'చలానా' అంటే చెల్లించవలసిన మొత్తం. చలానా కట్టేయటాన్ని చలాయించటం అంటారు. చలాయించటం అంటే, తన పెత్తనాన్ని ప్రయోగించటం కూడా!

1894 లో జన్మించిన చలం తన కాలానికన్నా ముందు నడిచిన గొప్ప ఆలోచనాపరుడు. సంప్రదాయపు గుదిబండల్ని మోస్తో చలమైపోతోన్న స్త్రీని తన సాహిత్యానికి వస్తువుగా గ్రహించిన చెలం స్త్రీ చైతన్యం కోసం చెలమరించాడు. శక్తిరూపిణులుగా మారి స్త్రీలు చలం సాధించాలన్నాడు. అందుకోసం తన కలం చలాయించాడు. ఆయన అచలం మాత్రమే కాదు.. చలాయించిన చలం కూడా!

# గిడుగు వారసురాలు

( 47వ పుట తరువాయి.. )

వార్షికోత్సవమునకు శ్రీకాకుళం జిల్లా పలాస మండలం రంగోయిలో 8 జనవరి 2023న పాల్గొన్నారు. ఆటపాటలతో అచ్చుటి ప్రజలను, పాత్రికేయుల ప్రశంసలు పొందారు. తన పూర్వీకులు. మీరంతా మా తాతగారి వారసులని సంతోషంతో హైదరాబాద్ చేరుకున్నారు. అక్కడకు రెండు నెలలు తరువాత నేను మా సహచరుడు కోటేశ్వరరావుతో హైదరాబాదులోని వారి ఇంటికి వెళ్ళాం. ఆప్యాయంగా పలకరించారు. స్టూడియో అంతా చూపించారు. మీరు మా ప్రాంతానికి మరలా రావాలన్నప్పుడు మీ ఆడపడచును నేను ఎప్పుడైనా వస్తానన్నారు. గిడుగు వేంకట రామకృష్ణారావు రాసిన గిడుగు 'వంశవృక్షం' పుస్తకం ఇచ్చారు.

మూడు నెలలు క్రితం ఫోన్ చేసి ఇటీవలే ఆసుపత్రికి వెళ్ళి పరీక్షలు చేయగా క్యాన్సర్ సోకిందని వైద్యులు చెప్పారని త్వరలో తగ్గిపోతుందని ఆత్మీయతతో చెప్పారు. కాని, తేదీ 11-11-2023 రాత్రి ఉభయులకు ఆత్మీయులైన శ్రీ బి.యన్. యాదగిరి గారు ఫోన్ చేసి స్నేహలత ఆసుపత్రిలో మరణించారని చెప్పాక నిర్ఘాంతపోయాం. ఆమె నడయాడిన నేలలో అభిమానులతో సంతాప సభ నిర్వహించాం. గిడుగు ఆశయాలు స్నేహలత గారి ఆశయాలతో తెలుగు భాషకు, జానపద కళల పరిరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశాం. ఆమె మరణం తెలుగు సాహిత్య, కళారంగాలకు, జానపదాలకు తీరనిలోటు.




Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

# ప్రముఖ రచయిత 'శారద' అచ్చంగా తెలుగువాడే



కనువెలుగు: **1924**
కనుమరుగు: **17,ఆగస్టు,1955**

తెలుగులో కతలను చదివేవారు, బాగా ఎరిగిన పేరు శారద. నటరాజన్ అనే ఆయన 'శారద' పేరుతో కతలనూ, కవితలనూ కట్టుర (వ్యాసా)లనూ రాస్తున్నారు. వారి గురించి అందరూ చెప్పేది ఏమిటంటే
1. నటరాజన్ గారు తమిళనాడు నుండి తెనాలికి వలస వచ్చినవారు
2. నటరాజన్ గారి అమ్మనుడి తమిళం
3. నటరాజన్ గారు తెనాలికి వచ్చినాక తెలుగును నేర్చుకొన్నారు అని.
ఈ మూడూ కూడా నిక్కాలు కావు. నిక్కం ఇదీ...
1. నటరాజన్ గారు తెనాలికి వచ్చిన కాలానికి తమిళనాడు అనేది లేనేలేదు. మదరాసు మాగాణం వుండేది. అందులో ఇప్పటి ఆంధ్రప్రదేశం, తెలంగాణా రాష్ట్రాలు మొత్తమూ, ఇప్పటి ఒడిసాలోని దక్షిణజిల్లాలు కొన్నీ, ఇప్పటి కర్నాటకలోని బళ్లారీ, దక్షిణ కన్నడ జిల్లాలూ, ఇప్పటి కేరళలోని కాసరగోడు జిల్లా, ఇప్పటి తెలంగాణలోని బద్రాచలం తావూ, ఇప్పటి తమిళనాడులోని పుదుకోట, కన్యాకుమారి జిల్లాలు తప్ప మిగిలిన తావంతా కలిసి వుండేది. 1936లో గంజాం, కోరాపుట్టి జిల్లాలూ, 1953లో బద్రాచలంతో కలసిన ఆంధ్రప్రదేశం, 1956లో కాసరగోడు దక్షిణకన్నడ బళ్లారి జిల్లాలు విడిపోగా, పుదుకోట సంస్థానాన్నీ, కన్యాకుమారినీ కలుపుకొని మదరాసు రాష్ట్రం మిగిలింది. 1969లో మదరాసు రాష్ట్రం పేరును తమిళనాడుగా మార్చినారు. కాబట్టి నటరాజన్‌గారు పుదుకోట సంస్తానం నుండి, మదరాసు మాగాణంలోని తెనాలికి వలస వచ్చినవారు.

2. నటరాజన్ గారి అమ్మనుడి తమిళం కాదు తెలుగు. ఇప్పటి తమిళనాడులోని మూడువంతులకు పైగా ఊర్లకు తెలుగూ, తమిళమూ, రెండు నుడులలోనూ పేర్లుంటాయి. తమిళులు పుదుక్కోట్టై అంటే తెలుగువారు కొత్తకోట అని పిలుస్తారు. ఈ కొత్తకోట తావును 17వ నూరేడు నుండి 1947 వరకూ తిరుపతి దగ్గరనుండి వలసపోయిన తొండమాను దొరలు ఏలినారు. వీరి అమ్మనుడీ ఏలుబడి నుడీ తెలుగు. వీరి కొలువులో తెలుగువారు ఎక్కువగా ఉండేవారు. అందుకనే కొత్తకోట చుట్టుపక్కల తెలుగు పారుల (బ్రాహ్మణుల) కుటుంబాలు ఎక్కువ. నటరాజన్‌గారు ములకనాటి వైదికులు. వారి ఇంటిపేరు రాయపెద్ది.

3. నటరాజన్‌గారు తెనాలికి వచ్చినాక నేర్చుకొన్నది తెలుగు రాతలనే కానీ తెలుగు నుడిని కాదు. కాకపోతే తెనాలి తావు తెలుగు పలుకును నేర్చుకొని ఉంటారు. నటరాజన్‌గారి గురించి రాసిన ఆలూరి బుజంగరావు లాంటి వారు కూడా ఈ నిక్కాలను ఎరిగినట్టు లేదు. నటరాజన్‌గారే బయటపెట్టుకోలేదేమో! 2009లో తెలుగువాణి ట్రస్టు తిరుచిరాపల్లిలో దక్షిణభారత తెలుగు పల్లెకళల పండుగను జరిపింది. ఈ పండుగకు తమిళనాడులోని తెలుగు కులసంగాల పెద్దలను అందరినీ పిలిచింది. ఆ పండుగకు వచ్చిన వైదీశ్వరన్ అనే పెద్దాయన, తెలుగువాణి ట్రస్టీలయిన వేణుగోపాలరెడ్డి, సామల రమేష్ బాబు, పుష్పరాజు, స.వెం. రమేశ్‌లను కలిసినారు. వారు నటరాజన్‌గారికి చుట్టం. వైదీశ్వరన్‌గారే నటరాజన్‌గారి ఇంటిపేరునూ, కొమ్మ(శాక) పేరునూ తెలియజేసినారు. ఇదీ శారద(నటరాజన్)గారి గురించిన తెలుగు ముచ్చట్లు.

స.వెం.రమేశ్

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
December 2023,January 2024
Vol :9, Issues: 10,11

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/14/2021-23




If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:94929 80244